28-10Pg1exHMNWJQEV-1-VJA_28-10Pg1exHMNWJQEV.qxd--28/Oct/25--12:43-AM--Page-1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
: fb.com/vaartha Digital
Published-from-Vijayawada,-Hyderabad,-Visakhapatnam,-Rajahmundry,-Guntur,-Nizamabad,-Ongole,-Warangal,-Tirupathi,-Kadapa,-Kurnool,-Anantapur,--Karimnagar,-Mahabubnagar,-Khammam,-Nellore,-Nalgonda,-Tadepalligudem,-Srikakulam-
28-10-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 266 పేజీలు: 12 వెల: 6.50

వాణిజ్య ఒప్పందం దిశగా భారత్, అమెరికా చర్చలు

బంగ్లా మ్యాప్‌లో భారత్ భూభాగాలు 9లో

# భయపడకండి


సోమవారం ఆర్టీజీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

తుఫాన్ ప్రభావం అధికంగా ఉన్న ప్రజలను ఆస్తి, ప్రాణనష్టం నుండి రక్షిస్తాం: సిఎం చంద్రబాబు

ప్రతి గంటకు తుఫాన్ ప్రత్యేక బులెటిన్

పరిస్థితిపై సిఎంతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని

పునరావాస కేంద్రాల్లో ఒక్కో కుటుంబానికి రూ.3వేలు ఆర్థిక సాయం, 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు

పిఎంఒతో సమన్వయ బాధ్యతలు మంత్రి లోకేష్‌కు అప్పగించిన సిఎం

విధుల్లో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు: సిఎం

**విజయవాడ, అక్టోబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** మొంథా తుపాన్ ప్రభావాన్ని, నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరేలా రియల్ టైమ్‌లో సమాచారం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి మంగళవారం ఉదయం నుంచి ప్రతీ గంటకూ తుపాన్ బులిటెన్లు విడుదల చేస్తూ, అప్రమత్తం చేయాలని సూచించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో మొంథా తుపాన్ కారణంగా నెలకొన్న పరిస్థితులు, చేపట్టాల్సిన సహాయక చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ఎక్కడా సమాచార పంపిణీ వ్యవస్థకు అంతరాయం కలగకుండా చూసుకోవాలని చెప్పారు. కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు శాటిలైట్ ఫోన్లు వినియోగించాలని, మొబైల్ టవర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తుపాన్ ప్రభావం ఎక్కువ ఉండే 2,707 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. 110 మండలాల్లోని సచివాలయాల్లో 3,211 జెనరేటర్లను పవర్ బ్యాకప్ కోసం వినియోగించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఎక్కడా కమ్యూనికేషన్ వ్యవస్థకు అవాంతరాలు తలెత్తకూడదన్నారు. తుఫాన్ వల్ల ఎవరూ ప్రమాదాల బారిన పడకూడదని, ఒక్క మరణం సంభవించకూడదనేది ప్రభుత్వ లక్ష్యం కావాలన్నారు. సముద్ర తీరంలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. వారికి 25 కేజీల బియ్యంతో సహా నిత్యావసరాలు అందించాలన్నారు. కరువును ఎదుర్కొనేందుకు ఎలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామో, తుఫాన్లను ఎదుర్కొనేందుకూ పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు జరపాలని సీఎం చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ తుపాన్ ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినచర్యలను ప్రధానికి వివరించగా, >>2


సోమవారం తుఫాన్ ప్రభావంతో కాకినాడ సముద్రతీరంలో ఎగసిపడుతున్న అలలు


చిత్తూరు జిల్లాలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు

## శ్రీకాకుళం నుంచి నెల్లూరు దాకా

# రెడ్ అలర్ట్

రేపు భారీ నుంచి అతిభారీ వర్షాలు

మొంథా తుఫాన్ అల్లకల్లోలం

మచిలీపట్నం, కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరందాటే అవకాశం

గంటకు 90 నుంచి 110 కి.మీ వేగంతో ఈదురుగాలులు

అన్ని పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలు జారీ

**విజయవాడ,అక్టోబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడింది. ఇది మొంథా తుపానుగా మారినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది బంగాళాఖాతంలో నైరుతిఆగ్నేయ మధ్య కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. గడిచిన 10 గంటల్లో గంటకు 16 కిలోమీటర్ల వేగంతో తుఫాను ముందుకు కదులుతూ వస్తోంది.మంగళవారం >>2



## తదుపరి సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్ 2లో

సిఫారసు చేసిన జస్టిస్ గవాయ్

## 97 రైలు సర్వీసులు రద్దు

విజయవాడ డిఆర్ఎం మెహిత్ సోనాకియా 2లో

తుఫాన్ కారణంగా నిలిచిన పలు విమాన సర్వీసులు


సోమవారం జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌చే ఎపి హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్


## హైకోర్టు జడ్జిగా జస్టిస్ మానవేంద్ర నాథ్ ప్రమాణం చేయించిన సిజెఐ 2లో

## 7 లక్షల రేషన్ కార్డు కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ

మంత్రి నాదెండ్ల



**ఏలూరు, అక్టోబరు 27:ప్రభాతవార్త:** జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో సోమవారంరాష్ట్రంలో మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో తీసుకున్న చర్యలుపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మరియు జిల్లా ఇంచార్చి మంత్రి నాదెండ్ల మనోహర్ పాత్రికేయులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్చి మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొంథా తుఫాను >>2



## పరకామణి కేసుపై సిఐడి దర్యాప్తు

### హైకోర్టు ఆదేశం

నిందితుడు రవికుమార్ ఆస్తులపై సమగ్ర దర్యాప్తునకు ఎసిబి డిజికి ఆదేశం

లోక్‌అదాలత్ న్యాయమూర్తినీ వదలని కోర్టు

గత టిటిడి ఛైర్మన్, అధికారులపైనా విచారణ జరపాలన్న జడ్జి

**తిరుమల, అక్టోబరు 27ప్రభాతవార్తప్రతినిధి:** మూడుసంవత్సరాల క్రిందట తిరుమల పరకామణిలో విదేశీకరెన్సీ చోరీజరిగిన కేసులో జరిగిన పరిణామలన్నిటిపై పూర్తిస్థాయిలో సమగ్రదర్యాప్తుకు హైకోర్టు ధర్మాసనం సిఐడిని ఆదేశించింది. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుండి ఆ తరువాత చోటుచేసుకున్న అంశాలపై ,లోక్అదాలత్‌లో రాజీచేసుకోవడం వరకు అన్ని కోణాల్లోనూ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి డిసెంబర్ 2వతేదీకి గడువు విధించింది. అలాగే పరకామణిలో గుమస్తా అయిన సివి రవికుమార్ నిందితుడు ఆస్తులపై దర్యాప్తుకు అవినీతినిరోధకశాఖ(ఎసిబి)డిజికి ఆదేశాలిచ్చింది. ఈ కేసుతో సంబంధం ఉన్న గత టిటిడి ఛైర్మన్, అధికారులు, పోలీసు అధికారులతోబాటు లోక్అదాలత్‌లో పరకామణికేసు రాజీచేసిన న్యాయమూర్తిపై కూడా చర్యలు చేపట్టాలని హైకోర్టు సూచించడం సంచలనంగా మారింది. అత్యవసరంగా సిబిసిఐడితో విచారణకు ఆదేశించడంతో పరకామణి చోరీ వ్యవహారంలో 'పెద్ద'లుగా వ్యవహరించి చేతివాటం చూపిన వారికి, అధికారులకు చెమటలు పడుతున్నాయి. ఎటుపోయి ఈ కేసు విచారణ ఎక్కడకు దారితీస్తుందనే భయం గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. 2023లో పరకామణి చోరీ కేసులో తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసినా, ఆ తరువాత విచారణ చేయకుండా అడ్డుకున్న దెవరు?వారిపై ఎవరి ఒత్తిడి పనిచేసింది, లోక్‌అదాలత్‌తో రాజీకి ప్రోత్సహించిన అధికారులు, గతబోర్డు పెద్దలెవరనేది ఇప్పుడు సిఐడి చేపట్టే విచారణలో వెలుగుచూడనున్న కీలక అంశాలు. తిరుమల తిరుపతిదేవస్థానం చరిత్రలోనే ఇలాంటి చోరీ కేసు నమోదుకాలేదు. ఆపైగా చోరీచేసిన గుమస్తా టిటిడి ఉద్యోగి కూడా కాకపోవడం మరో కొసమెరుపు. వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి కోట్లాదిమంది భక్తులు విశ్వాసంతో మొక్కుబడులుగా హుండీకి కానుకలు సమర్పిస్తారు. ఆ కానుకలను లెక్కించే పరకామణి భవనంలో అనధికార వ్యక్తికి ఎంతో బాధ్యత ఉన్న పరకామణిలో గుమస్తాగా నియమించి విధులు నిర్వర్తింపచేయడం కూడా పెద్ద తప్పిదంగానే తెలుస్తోంది. ఏకంగా ఆయన దేవునిసొమ్ము అనే పాపభీతి,భయం లేకుండా,నిర్భయంగా ఏకంగా 920 అమెరికల్ డాలర్లు చోరీ చేయడం,ఆపై 72వేల రూపాయలు విలువ మాత్రమేనని అప్పటి టిటిడి బోర్డుపెద్దలు, ఓ ఉన్నతాధికారి, పోలీసు అధికారులు కలసి సులభంగా కొట్టిపారేయడం ఇప్పుడు సంచలనం రేకెత్తిస్తోంది. తప్పుచేసిన >>2


## అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

**విజయవాడ, అక్టోబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ గడువును ఎపి ప్రభుత్వం పొడిగించింది. మరో మూడు నెలలపాటు గడువు పొడిగిస్తూ మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసారు. వాస్తవానికి అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ గడువు ఈ నెల 23తో ముగిసింది. అయితే గడువు పెంచాలంటూ ప్రభుత్వంపై పలు ఆవాశిత ప్రాంతాల వారు, ఇతరులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులతో జనవరి 23 వరకూ లే అవుట్లు, ప్లాట్‌లు రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ దిశలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక గడువును పెంచే అవకాశం లేదని ప్రభుత్వం వెల్లడించింది. ఈ >>2

# సహాయ శిబిరాలు సిద్ధం

తుఫాన్ బాధితులకు 24 గంటలూ అత్యవసర సేవలు

క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు అండగా నిలవాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు మంత్రి లోకేష్ ఆదేశం


సోమవారం తుఫాన్ తాజా పరిస్థితులను మంత్రి నారా లోకేష్‌కు వివరిస్తున్న సీఎస్ విజయానంద్

**విజయవాడ,అక్టోబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రభుత్వ యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు కీలక ఆదేశాలు జారీచేశారు. ముఖ్యంగా తుపాను ప్రభావం అధికంగా ఉండే నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. తుఫాను సహాయక చర్యల పర్యవేక్షణ బాధ్యతను మంత్రి నారా లోకేష్‌కు సీఎం చంద్రబాబు అప్పగించారు.కేంద్రంతోను, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంతోను సమన్వయం చేసుకుంటూ తుఫాను ప్రభావిత ప్రాంతాల వారికి సహాయకచర్యలు అందించాలని ఆదేశించారు.ఈ క్రమంలో నారా లోకేష్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, హోంమంత్రి అనితలతో కలిసి పరిస్దితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు., ఈ సందర్భంలో లోకేష్ మాట్లాడుతూ ప్రస్తుత సమాచారం ప్రకారం తుపాను కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ శాఖలన్నీ సమష్టిగా పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. అవసరమైతే సహాయక చర్యలలో కూటమి పార్టీల కార్యకర్తలు కూడా పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. తుపాను ప్రభావిత తీరప్రాంతాలు, లంక గ్రామాల్లోని ప్రజల కోసం తక్షణమే సహాయ శిబిరాలను ఏర్పాటు చేయాలని >>2




## నేటి నుంచి 12 రాష్ట్రాలు యుటిల్లో 'సర్'

సిఇసి జ్ఞానేష్‌కుమార్ వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబరు 27:** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎస్ఐఆర్ నిర్వహించడంపై తీవ్ర దుమారం రేపుతున్న వేళ దేశవ్యాప్తంగా రెండో దశ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని 12 రాష్ట్రాల్లో ఈ ఎస్ఐఆర్ రెండో దశను నిర్వహించనున్నట్లు తెలిపింది. ఢిల్లీలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఓటర్ లిస్ట్ >>2



పునరావాస కేంద్రాల్లోని

## ప్రజల ఇళ్లకు పూర్తి భద్రత

గర్భిణులు, బాలింతలు, వృద్ధులను సురక్షిత ప్రదేశాలకు తరలించి వైద్యసేవలందించాలి: డిసిఎం పవన్

**విజయవాడ,అక్టోబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుపాను కాకినాడ ప్రాంతంలో తీరం దాటనున్న నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా పరిధిలోని 12 మండలాల పరిధిలో తుపాను ప్రభావం ఉండనున్న క్రమంలో ప్రభావిత ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. సమాచారం కోసం అత్యవసర ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. మొంథా తుపాను ప్రభావం, ముందస్తు సహాయక చర్యలపై జిల్లా ఇంఛార్జి మంత్రి పి. నారాయణ, స్పెషల్ ఆఫీసర్ శ్రీ కృష్ణ తేజ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పవన్ కళ్యాణ్ వర్చువల్‌గా మాట్లాడుతూ మొంథా తుపాను ప్రభావం కాకినాడ జిల్లా పరిధిలోని 12 మండలాలపై ఉండనున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరికల ద్వారా తెలుస్తోంది. ముందుగా తీర ప్రాంత గ్రామాల ప్రజలను సురక్షి త ప్రాంతాలకు తరలించాలి. ఇప్పటికే 260 పునరావాస కేంద్రాలను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, పాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. పిఠాపురం నియో జకవర్గంతో పాటు కాకినాడ జిల్లావ్యాప్తంగా గర్భిణి స్త్రీలు, బాలింతలు, వృద్ధులను గుర్తించి సురక్షి త ప్రాంతాలకు తరలించాలి. ఇప్పటికే 142 మంది గర్భిణులను గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించినట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు. **కాకినాడ జిల్లాకు రూ. కోటి అత్యవసర నిధి:** తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అత్యవసర సాయం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ. 19 కోట్ల విడుదల చేసింది. అందులో కాకినాడ జిల్లాకు కోటి రూపాయిలు కేటాయించారు. ప్రజలకు నిత్యవసర సరుకుల పంపిణీ, ఇళ్ల కూలడం, దెబ్బ తినడం వంటి సంఘటనలు జరిగితే తక్షణ సాయం చేయాలన్నారు,



సోమవారం ముంబయిలో 'మారిటైమ్ వీక్' కార్యక్రమంలో పాల్గొని శివాజీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కేంద్రహోంమంత్రి అమిత్ షా

# శ్రీకాకుళం నుంచి నెల్లూరు దాకా రెడ్ అలర్ట్

>> ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మొంథా తుపాను అల్లకల్లోలం సృష్టిస్తోంది. సముద్ర తీరాల నుంచి గమనిస్తూ అలలు ఎగిసిపడుతున్నాయి.గడిచిన 6 గంటల్లో గంటకు 16 కి.మీ. వేగంతో కదిలిన మొంథా తుపాను విశాఖకు దక్షిణ ఆగ్నేయంగా 650 కి.మీ. దూరంలో,చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 590 కి.మీ. దూరంలో మొంథా తుపాను కేంద్రీకృతమై ఉంది. పశ్చిమ వాయువ్యంగా కదిలి 12 గంటల్లో తీవ్ర తుపానుగా మారే అవకాశం, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉంది. రేపు సాయంత్రం లేదా రేపు రాత్రికి తీవ్రతుపానుగా తీరం దాటే అవకాశం. మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కి.మీ. వేగంతో ఈదురుగాలులు, కాకినాడ పరిసర సముద్రంలో మీటరు ఎత్తున ఎగిసిపడనున్న సముద్ర అలలు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఒక్కరెండుచోట్ల అత్యంత భారీ వర్షాలు. ఇవాళ శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా వరకు రెడ్ అలర్ట్ జారీ, రాయలసీమ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ.మత్స్యకారులు ఐదు రోజులపాటు వేటకు వెళ్లొద్దని అధికారుల హెచ్చరించారు.

**అన్ని పోర్టుల్లో ఒకటో నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ:** చేశారు.ఇప్పటికే అన్ని కలెక్టర్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.విశాఖకు దక్షిణ ఆగ్నేయంగా 710 కిలోమీటర్ల దూరంలో, కాకినాడకు ఆగ్నేయంగా 680 కిలోమీటర్ల దూరంలో, చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 600 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రీకృతమై ఉంది. తీరం వెంట 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. మొంథా తుపాను ప్రభావంతో ఏపీ లోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో చిరు జల్లులు కురుస్తున్నాయి. కాకినాడలో ఈ ఉదయం నుంచి చిరు జల్లులు పడగా, ఉదయం 10 గంటల సమయం తర్వాత వర్షం తీవ్రత పెరిగింది.

**రాయలసీమ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ:** నేడు శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లాల వరకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. రాయలసీమ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. మత్స్యకారులు ఐదు రోజుల పాటు వేటకు వెళ్లొద్దన్నారు. అన్ని పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలను అధికారులు జారీ చేశారు. మంగళవారం భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఒకట్రెండు చోట్ల అత్యంత భారీ వర్ష సూచనలు ఉన్నట్లు చెప్పారు. తీర ప్రాంతాల్లో ఉండే ప్రజల కోసం అధికారులు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో మంగళవారం తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశమున్నందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తుపాను ప్రభావంపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. విజయవాడ కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబుతో పాటు వివిధ శాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. తుపాను అప్రమత్తత, అన్ని శాఖల సమన్వయంపై కలెక్టర్ చర్చించారు. కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల స్థాయిల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. తుపాను ప్రభావం తగ్గే వరకు పరి, పత్తి కోతలు చేపట్టొద్దని కలెక్టర్ విజ్ఞప్తిచేశారు.

**ప్రభుత్వం సహాయక చర్యల కోసం రూ.19 కోట్లు విడుదల:** 'మొంథా' తుపాను నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే ముందస్తు చర్యలు చేపట్టింది. తుపాను ప్రభావం దృష్ట్యా అధికారులకు సెలవులు రద్దు చేశారు. ప్రభుత్వం సహాయక చర్యల కోసం రూ.19 కోట్లు విడుదల చేసింది. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ కేంద్రాలు, 16 శాటిలైట్ ఫోన్లు ఏర్పాటు చేశారు. 57 తీర ప్రాంత మండలాల పరిధిలో 219 తుపాను షెల్టర్లు ఏర్పాటు చేశారు. సముద్రంలోని 62 మెకనైజ్డ్ బోట్లను ఒడ్డుకు రప్పిస్తున్నారు. సముద్ర తీరాల్లో పర్యాటకుల రాకపోకలపై నిషేధం విధించారు.

**విద్యాసంస్థలకు కొనసాగుతున్న సెలవులు:** అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో విద్యా సంస్థలకు ఎల్లుండి వరకు సెలవులు ప్రకటించారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, కడపలో విద్యా సంస్థలకు రేపటి వరకు సెలవులు ప్రకటించారు. నెల్లూరు జిల్లాలోని విద్యా సంస్థలకు కలెక్టర్ హిమాన్షు శుక్లా నేడు మంగళవారంసెలవు ప్రకటించారు. తుపాను దృష్ట్యా జిల్లాల్లో విపత్తు బృందాలు మోహరించాయి. సహాయక చర్యల కోసం 9 ఎస్డీఆర్ఎఫ్, 7 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉంచారు. తుపాను దృష్ట్యా జిల్లాలకు టీఆర్27 కింద నిధులు మంజూరు చేశారు. వీటితో సహాయ శిబిరాలు, తాగునీరు, ఆహార ఏర్పాట్లు చేస్తున్నారు. విజయనగరం జిల్లాలోని ముక్కాం తీరప్రాంత గ్రామంలో జిల్లా కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్ పర్యటించారు. మత్స్యకారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.మొంథా తుపాను వేళ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మొంథా తుపాను వేళ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు నమ్మవద్దు. ప్రజలందరూ భయపడకుండా ప్రశాంతంగా ఉండాలి. అత్యవసర కమ్యూనికేషన్ కోసం మొబైల్ ఫోన్లను ఛార్జ్ చేసుకుంటూ ఉండాలి. వాతావరణ హెచ్చరికల కోసం టీవీలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. ఎలక్ట్రికల్ మెయిన్ స్విచ్ఛాఫ్ చేయాలి. అన్ని ఎలక్ట్రికల్ ఉపకరణాలు, గ్యాస్ కనెక్షన్లను తీసి వేయాలి. తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి. మీ భద్రత, మనుగడ కోసం అవసరమైన వస్తువులతో అత్యవసర వస్తు సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలి. ప్రభుత్వ అధికారులు సూచించిన వెంటనే సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలి. మీ పత్రాలు, సర్టిఫికెట్లు, విలువైన వస్తువులను సురక్షితంగా ఉంచుకోవాలి. మీ ఇళ్లు సురక్షితం కాకపోతే తుపాను ప్రారంభం కాకముందే సురక్షితమైన ఆశ్రయానికి చేరుకోవాలి. పాత భవనాలు, చెట్లు, విద్యుత్తు తీగలు, స్తంభాల కింద ఎప్పుడూ ఉండకూడదు. పశువులు, పెంపుడు జంతువులకు కట్టిన తాడును విప్పి వాటిని వదిలేయాలి. మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఇప్పటికే అప్రమత్తమైంది. కడప కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. విపత్తును ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

# భయపడకండి

>> కేంద్రం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని భరోసా ఇచ్చారని తెలిపారు. ప్రధాని కార్యాలయంతో సమన్వయం చేసుకునే బాధ్యతను మంత్రి లోకేష్‌కు ముఖ్యమంత్రి అప్పగించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఒక్కో కుటుంబానికి రూ.3వేలు చొప్పున ఆర్థిక సాయం అందించాలని పేర్కొన్నారు. కుటుంబానికి 25కిలోల బియ్యంతో పాటు, నిత్యావసరాలు పంపిణీ చేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జిల్లాల్లో అత్యవసర వైద్యసేవలు అందించే సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. భవిష్యత్తులో వచ్చే తుఫాన్లను ఎదుర్కొనే విధంగా ఈ కార్యచరణ ఒక రోల్‌మోడల్‌గా ఉండాలని సీఎం అధికారులకు సూచించారు.

**ఉమ్మడి కృష్ణాజిల్లాలో అతిభారీ వర్షాలకు అవకాశం:** ప్రస్తుతం కాకినాడకు 680 కి.మీ. దూరంలో ఉన్న మొంథా తుపాన్, 16 కి.మీ వేగంతో తీరానికి చేరువ అవుతోందని ఈ సమావేశంలో అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. దీని ప్రభావంతో ఇప్పటికే ఉత్తర, దక్షి ణ కోస్తాలో వర్షాలు కురు స్తున్నాయని, మంగళవారం కృష్ణా జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విద్యాసంస్థలకు ఇప్పటికే సెలవులు ప్రకటించామని తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులందరినీ వెనక్కి రప్పించినట్టు వెల్లడించారు. గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని తెలిపారు. మంగళ వారం రాత్రికి తుపాన్ తీరానికి చేరే అవకాశం ఉందన్నారు. ఎక్కువ వర్షపాతం కురిసే ప్రాంతాలను గుర్తించి జిల్లా అధికారులు ముందస్తు రక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎన్డీఆర్, ఎస్డీఆర్ దళాలు అందుబాటులో ఉండాలని, ఫైర్ సర్వీసెస్ కూడా అలెర్ట్‌గా ఉండాలని చెప్పారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ టీమ్, రహదారులు భవనాల శాఖ, విద్యుత్ శాఖ పూర్తి అప్రమత్తతో వ్యహరించాలన్నారు. రహదారులు కోతకు గురైనా, విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడినా వెంటనే పునరుద్ధరించేలా మెటీరియల్, మిషనరీ సిద్ధం చేయాలని, కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. తుపాను అనంతరం అంటువ్యాధులు సోకకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. తుపాను సమయంలో గర్భిణిలు, బాలింతలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా 108, 104 వాహనాలను అందుబాటులో ఉంచి వైద్య సౌకర్యాలు కొనసాగేలా చూడాలన్నారు. యాంటీ స్నేక్ వెనోమ్, యాంటి ర్యాబిస్ వ్యాక్సిన్లు కూడా అన్ని పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. మరోవైపు పంటనష్టం సంభవించకుండా టార్పాలిన్లు విరివిగా ఉంచాలని, పశుసంపద నష్టపోకుండా చూడాలని ముఖ్యమంత్రి చెప్పారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో 851 జేసీబీలు, 757 పవర్ సాలు సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, ఏ ప్రాంతంలో అందుబాటులో ఉంచారనేది మ్యాపింగ్ చేయాలని, తుపాన్ అనంతరం వీటన్నింటి వినియోగంపైనా ఆడిటింగ్ చేస్తామని సీఎం చెప్పారు. వరద నీరు వెళ్లేందుకు వీలుగా డ్రెయిన్లలో బ్లాక్స్ లేకుండా పటిష్టం చేయాలని నిర్దేశించారు.

**విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు:** "తుపాన్ తీరం దాటే సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగేందుకు అవకాశం ఉంటుంది. ఆ సమయంలో ప్రజలు ఎవరూ బయటకు రాకుండా అలర్ట్ చేయాలి. ఎప్పటికప్పుడు సందేశాలు పంపించి అవగాహన పెంచాలి. తిత్లీ, హరికేన్, హుద్‌హుద్ తుపాన్లపై అనుభవాన్ని ఇందుకు వినియోగించాలి. అన్ని రిజర్వాయర్లు, ట్యాంకులు ఎలా నిర్వహించాలనే దానిపై జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయండి. రియల్ టైమ్‌లో నీటి ప్రవాహాలను పర్యవేక్షించాలి.బలమైనగాలులకు కూలిపోయే అవకాశం ఉన్న చెట్లకొమ్మలను ముందుగానే తొలగించాలి" అని అధికారులతో ముఖ్యమంత్రి అన్నారు. అలాగే తుపాన్ రక్షణ విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని ముఖ్యమంత్రి హెచ్చరించారు. సమీక్షలో మంత్రులు లోకేష్, అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖలకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 97 రైలు సర్వీసులు రద్దు

## విజయవాడ డిఆర్ఎం మోహిత్ సోనాకియా

## తుఫాను ప్రభావంతో అప్రమత్తమైన రైల్వేశాఖ

**విజయవాడ.అక్టోబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో మొంథా తుపాను కమ్ముకొస్తున్న నేపథ్యంలో దక్షి ణ మధ్య రైల్వే అప్రమత్తమైంది. తుపాను ప్రభావం ఉండనున్న ప్రాంతాల్లో రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ పర్యటించారు. ప్రభావిత ప్రాంతాల్లో హై ఎలర్ట్ ప్రకటించారు. అనంతరం విజయవాడలో డివిజన్ అధికారులతో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. తీసుకున్న చర్యలను జీఎంకు విజయవాడ డీఆర్ఎం మోహిత్ సోనాకియా వివరించారు.

**రద్దయిన రైలు సర్వీసుల వివరాలు :** విజయవాడ డివిజన్ మీదుగా నడిచే 54 రైళ్లను దక్షి ణమధ్య రైల్వే రద్దు చేసింది. రేపు (మంగళవారం), ఎల్లుండి (బుధవారం) బయలుదేరే పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దయ్యాయి. రాజమండ్రి, నిడదవోలు, గుంటూరు, కాకినాడ నుంచి బయలుదేరేవి, తెనాలి, మార్కాపురం, మచిలీపట్నం, నర్సాపురం నుంచి బయలుదేరేవి, విశాఖ, ఒంగోలు, భీమవరం, మాచర్ల నుంచి బయలుదేరే రైళ్లు రద్దు చేశారు. రైళ్ల గురించిన సమాచారాన్ని ప్రయాణికుల మొబైల్‌కు సందేశాలు ద్వారా పంపినట్లు అధికారులు తెలిపారు.

**ప్రయాణికుల భద్రత దృష్ట్యా 43 రైళ్ల సర్వీసులు రద్దు :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి మొంథా తుపానుగా మారడంతో ఈస్ట్ కోస్ట్ రైల్వే అప్రమత్తమైంది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా 43 రైళ్ల సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించాల్సిన పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు తెలిపింది. అలాగే, రద్దుచేసిన రైళ్ల జాబితాను 'ఎక్స్'లో పోస్టు చేసింది.

# తుఫాన్ ప్రభావంతో విమానసర్వీసులు రద్దు

**గన్నవరం, అక్టోబరు 27, ప్రభాతవార్త :** తీవ్రతుఫాన్ మెంతా ప్రభావానికి పలు విమానసర్వీసులు రద్దుచేస్తున్నట్లు విజయవాడ విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మంగళవారం భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తాయన్న అంచనాల నేపథ్యంలో మంగళవారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంనుండి రాకపోకలు సాగించే 8 ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానసర్వీసులు రద్దయ్యాయి. విశాఖపట్నం-గన్నవరం మధ్య తిరిగే ఐఎక్స్ 2819, గన్నవరం-హైదరాబాద్ ఐఎక్స్ 2862, ఐఎక్స్ 2875 బెంగుళూరు-గన్నవరం, ఐఎక్స్ 2876 గన్నవరం-బెంగుళూరు, ఐఎక్స్ 976షార్జా-గన న్నవరం , ఐఎక్స్ 975 గన్నవరం-షార్జా, ఐఎక్స్ 2743 హైదరాబాద్-గన్నవరం, ఐఎక్స్ 2743 గన్నవరం-విశాఖపట్నం విమానసర్వీసులను రద్దు చేసారు. విశాఖపట్నం నుండి వెళ్ళె ఎయిరిండియా, ఇండిగో విమానసర్వీసులను రద్దు చేసినట్లు సమాచారం.

# క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

>> క్రమంలో ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి మరో మూడు నెలల పాటు రాష్ట్రంలో అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ గడువు లభించింది.



సోమవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో జరిగిన ఛాత్‌పూజ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము

# తదుపరి సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్

## సిఫారసు చేసిన జస్టిస్ గవాయ్

**న్యూఢిల్లీ, అక్టోబరు 27:** భారత సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)గా జస్టిస్ సూర్యకాంత్ పేరు ఖరారైంది. ప్రస్తుత చీఫ్ జస్టిస్ భూషణ్ ఆర్.గవాయ్ తన వారసుడిగా జస్టిస్ సూర్యకాంత్ పేరును కేంద్ర ప్రభుత్వానికి సోమవారం సిఫారసు చేశారు. దీంతో దేశ 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి మార్గం సుగమమైంది. జస్టిస్ గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సిజెఐ పేరును సూచించాలని కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ కోరిన మీదట జస్టిస్ గవాయ్ ఈ సిఫారసు చేశారు. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సూర్యకాంత్ నవంబర్ 24న నూతన సిజెఐగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆయన 2027 ఫిబ్రవరి 9న పదవీ విరమణ చేసేంత వరకు, అంటే సుమారు 14 నెలల పాటు ఈ అత్యున్నత పదవిలో కొనసాగుతారు. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హర్యానాలోని ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. హిసార్‌లోని ప్రభుత్వ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీ నుంచి 1981లో డిగ్రీ, రోహతక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి 1984లో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. అదే ఏడాది హిసార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా తన ప్రాక్టీసును ప్రారంభించారు. 1985లో చండీగఢ్‌కు మారి పంజాబ్, హర్యానా హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 2000 జులై 7న హర్యానా రాష్ట్రానికి అత్యంత పిన్న వయస్కుడైన అడ్వొకేట్ జనరల్‌గా రికార్డు సృష్టించారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టుకు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆ తర్వాత 2018 అక్టోబర్ 5న హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. జస్టిస్ గవాయ్ సిఫారసుతో కేంద్ర ప్రభుత్వం త్వరలోనే జస్టిస్ సూర్యకాంత్ నియామకంపై అధికారిక నోటిఫికేషన్ జారీ చేయనుంది.

# హైకోర్టు జడ్జిగా జస్టిస్ మానవేంద్రనాథ్

**విజయవాడ,అక్టోబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.నేలపాడులోని రాష్ట్ర హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆయనతో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయించారు.జస్టిస్ మానవేంద్ర రాయ్ స్వస్థలం ఉమ్మడి విజయనగరం జిల్లా పార్వతీపురం.న్యాయవిద్య అభ్యసించిన తదుపరి 2002 లో జిల్లా జడ్జి క్యాడర్లో నియమితులై వీరు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో న్యాయ సేవలు అందజేశారు.2015 జూలై నుండి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ గా మరియు 2019 జూన్ నుండి ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందజేయగా 2023 నవంబర్ లో గుజరాత్ హైకోర్టుకు బదిలీపై వెళ్లారు.గుజరాత్ హైకోర్టు నుంచి బదిలీపై సొంత రాష్ట్రానికి వచ్చిన ఆయన తిరిగి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు,అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్,అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చిదంబరం,ఎపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్.ద్వారకానాథ్ రెడ్డి అదనపు అడ్వకేట్ జనరల్ ఇ.సాంబశివప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్షీ ్మనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారధి,పలువురు ఇతర రిజిస్ట్రార్లు,సీనియర్ న్యాయవాదులు,బార్ అసోసియేషన్,బార్ కౌన్సిల్ సభ్యులు మరియు హైకోర్టు ఉద్యోగులు,ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ,ఎపి జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సహాయ శిబిరాలు సిద్ధం

>>ఆదేశించారు. ఆ శిబిరాలలో నిరాశ్రయులకు అవసరమైన ఆహారం, తాగునీరు వంటి సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, దీనిని నివారించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ సూచించారు. అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్‌లు, మందులను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అదేవిధంగా, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా సంబంధిత శాఖ సిబ్బంది పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుపాను సమయంలో కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినకుండా చూసే బాధ్యతను సెల్ ఫోన్ ఆపరేటర్లు తీసుకోవాలని కోరారు. భారీ వర్షాలకు చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం ఉన్నందున ఇసుక బస్తాలు,యంత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పంట పొలాల్లో నీరు నిలిచిపోయే ప్రమాదం ఉన్నందున, నీటిని బయటకు పంపేందుకు అవసరమైన ఆయిల్ మోటార్లను సిద్ధంగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు. ఖిమొంథాఖి తుపాను పరిస్థితులను గమనిస్తూ ప్రజలంతాఅప్రమత్తంగా ఉండాలని, బాధితులకు ఏసాయం అవసరమైనా స్పందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం 24గంటలూ సిద్ధంగా ఉంటుందని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

**వారం - వర్జ్యం**

28-10-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
షష్ఠి ఉ.7.59
పూర్వాషాఢ మ.3.41
వర్జ్యం : రా.12.15-1.59
దు.ఉ.8.23-9.09
2) రా.10.18-11.04
రాహుకాలం - మ.3.00-4.30

**వార్తాఫలం**

**మేషం :** దూర ప్రాంతాలలోని ఆత్మీయుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృషభం:** నిలకడ లేని ఆర్థికవ్యవహారాలు చికాకు పరుస్తాయి.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలలో పురోభివృద్ధి ఒడిదుడుకులు లేకుండా సానుకూలంగా ఉంటుంది.

**కర్కాటకం :** బంధువులతో మాట పట్టింపులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటారు.

**సింహం:** గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. నూతన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**కన్య :** ఇంటి వాతావరణం ప్రోత్సాహకరంగా ఉంటుంది. బంధువుల కలయిక.

**తుల :** జీవిత భాగస్వామి సలహాతో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**వృశ్చికం:** నూతన పెట్టుబడులకు అనుకూల కాలం. వస్త్రాల కొనుగోలు.

**ధనుస్సు:** మీ సన్నిహితుల నుండి సకాలంలో సహాయం అందకపోవచ్చు.

**మకరం:** ఎంతటి కార్యాన్నైనా పట్టుదలతో సాధిస్తారు. శుభవార్తలు వింటారు.

**కుంభం:** చిన్ననాటి మిత్రలను కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రయాణాలు.

**మీనం :** రాజకీయ, పారిశ్రామిక రంగాలలోని వారు ప్రభుత్వ పరంగా ఆహ్వానాలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నిత్యావసరాలు పంపిణీ

>> ప్రభావిత 12 జిల్లాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనతో పౌర సరఫరాలు శాఖ తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టరు బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణ, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి మొత్తం 12 జిల్లాలో యుద్ధప్రాతిపదికన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. ఈ జిల్లాల్లో 14,145 రేషన్ డిపోలు ద్వారా 7 లక్షలు కార్డు దారులు కుటుంబాలకు నిత్యవసర సరుకులు సబ్సిడీ రూపంలో రేపు ఉదయం 9:00 గంటలు నుండి అందిస్తున్నామని అన్నారు. మొంథా తుపాను ముందస్తు చర్యల్లో భాగంగా ఏలూరు జిల్లాలో టార్పాలిన్లు రైతు సేవా కేంద్రాల్లో ఉంచామని రైతులు వాడుకోవచ్చునని తెలిపారు. ఏ ఒక్క రైతు ఇబ్బందులు పడకూడదన్నదే కూటమి ప్రభుత్వ లక్ష ్యం అన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో 626 వివిధ కంపెనీల బంకులలో 35,443 లీటర్ల డీజిల్ ఆయిల్, పెట్రోల్ అదనంగా నిల్వలను అందుబాటులో ఉంచి, కొరత లేకుండా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. తీర ప్రాంత జిల్లాల్లో ఉన్న 1,500 మిల్లులను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనుసంధానం చేసినట్లు ఆయన తెలిపారు. రైతులు నుంచి తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు ఇబ్బందులకు గురి చేయకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఇప్పటికే కోత కోసిన వరి ధాన్యం వ్యవసాయ అధికారుల సహకారంతో పౌరసరఫరాల సంస్థ మేనేజర్లు మిల్లులకు తరలించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. గత ఏడాది మాదిరిగానే టార్పాలిన్లు, తాళ్లు, ఇసుక సంచులు, ప్లాస్టిక్ షీట్లు అందుబాటులో ఉంచామని అవసరాన్ని బట్టి వినియోగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమాచార వ్యవస్థలో ఏటువంటి అంతరాయం లేకుండా చూడాలని, సెల్ టవర్స్ దగ్గర ఏర్పాటు చేసిన జనరేటర్లుకు సివిల్ సప్లై కార్పొరేషన్ ద్వారా డీజిల్ ను ఉచితంగా సరఫరా చేస్తున్నామని, సమాచార వ్యవస్థ బాగుండేలా అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు.

# వీధికుక్కల బెడదను నివారించలేరా?

## సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 27:** వీధి కుక్కల కేసులో రాష్ట్ర ప్రభుత్వాలపై సోమవారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ కుక్కలను పట్టుకోవడం, వాటి సంతానోత్పత్తిని నిరోధించడం, వాటిని శిబిరాలకు తరలించడంపై తీసుకుంటున్న చర్యలు తెలియజేసేలా అఫిడవిట్లు దాఖలు చేయకపోవడాన్ని ప్రశ్నించింది. ఆగస్టులో ఇచ్చిన ఉత్తర్వుల తర్వాత కూడా వీధి కుక్కల దాడులు నమోదవుతోన్న నేపథ్యంలో న్యాయస్థానం నుంచి తీవ్ర స్పందన వచ్చింది. రాష్ట్రాల నుంచి ఇంతవరకు ఎలాంటి స్పందన రాలేదు. వీధి కుక్కల దాడులు పెరుగుతున్నాయి. నిరంతరం ఈ ఘటనలు జరుగుతున్నాయి. ఆ బెడద వల్ల విదేశాల్లో భారత్‌ను చెడుగా చిత్రీకరిస్తున్నారు. మేం కూడా వార్తా కథనాలను చూస్తున్నాం.

# పరకామణి కేసుపై సిఐడి దర్యాప్తు

>> వాడిని శిక్షించాల్సిన టిటిడి అధికారులు, పోలీసుశాఖ లోక్‌అదాలత్‌లో రాజీ ధోరణికి తీసుకెళ్ళడం ఎంతవరకు సరైందనే వాదనలు ఇప్పుడు అన్ని వర్గాల్లోనూ హాట్‌టాపిక్‌గా మారింది. టిటిడి ప్రస్తుత ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ కూడా టిటిడి అనుమతిలేకుండానే చోరీ కేసులో పూర్వ ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్‌రాజీచేసుకోవడాన్ని తప్పుపట్టారు. హైకోర్టులో ఇదే అంశాన్ని తెలియజేస్తూ కౌంటర్ పిటిషన్ దాఖలు చేయడంతో ఇప్పుడు ఏం జరగనుందనేది పోలీసుశాఖలో భయంగొల్పిస్తోంది.ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్ కౌంటర్‌దాఖలు చేసి కేసు రాజీలో తనకెలాంటి దురుద్దేశం లేదని పేర్కొనడం వెనుక అంతర్యమేమిటనేది కొందరు పోలీసు అధికారులు తప్పుపడుతున్నారు. టిటిడి పరిధిలోని అంశం గనుక బోర్డు, ఉన్నతాధికారులు ఆదేశాలు పాటించాలి. మరీ నేరం జరిగినా ఆయన ఫిర్యాదిదారుడుగా రాజీ చేసుకున్నాననడం ఎంతవరకు కరెక్ట్‌కూడా ఇప్పుడు సిఐడి విచారణలో తేలనుంది. సిఐడి డిసెంబర్ 2వతేదీకి ఇచ్చే దర్యాప్తు నివేదికలో పేర్కొనే సంచలన విషయాలపై పూర్వ టిటిడి ఉన్నతాధికారి, కొందరు పూర్వ పోలీసు అధికారుల ఉద్యోగాలకు కూడా ఇబ్బంది కలిగే అవకాశం లేకపోలేదు.

**దర్యాప్తు నిందితుడు రవికుమార్‌చుట్టూనే:** దేవునికి భక్తులు కానుకలుగా సమర్పించే కరెన్సీ నోట్లు, చిల్లరనాణేలను టిటిడి పరకామణి భవనంలో లెక్కింపు చేస్తుంది. ఎంతో అమూల్యమైన ఈ వ్యవహారంలో బాధ్యతగా టిటిడి డిప్యూటీ ఇఒ, సూపరింటెండెంట్ స్థాయి అధికారులతో బాటు విజిలెన్స్‌విభాగం పర్యవేక్షణ ఉంటుంది. విజిలెన్స్ విభాగం టిటిడి పరిధిలో ఉన్నా డిప్యూటేషన్‌పై పోలీసుశాఖ నుండి వచ్చే సిఐలు, డిఎస్పీ అధికారులు విధుల్లో ఉంటారు. వీరి కాలపరిమితి రెండేళ్ళు. టిటిడిలోకి వచ్చిన తరువాత డిప్యూటేషన్ అధికారులను తిరిగి వారి మాతృసంస్థలకు బదలాయించాలి. అయితే టిటిడిలో ఉన్న విఐ, ఏవిఎస్ఒ, విఎస్ఒల హోదా పరపతి, సామంతరాజుల్లా మందీమార్బలంతో సకలం జరిగిపోతూ రాజకీయపెద్దల అండతో ఏళ్ళతరబడి రకరకాల హోదాల్లో కాలం వెల్లబుస్తున్నారు. ఇలాంటి సమయంలో టిటిడిలో ఏదేని తప్పులు జరిగినా ఆ అదికారులదే బాధ్యత వహించాల్సి ఉంటుంది. మరీ పూర్వ ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్ వ్యవహారం ఇందుకు భిన్నంగా మారి, ఫిర్యాదిదారుడు తానే కావడంతో కేసు రాజీచేసుకునే అర్హత తనకుందని పిటిషన్‌లో పేర్కొనడం ఇప్పుడు రానున్న రోజుల్లో టిటిడి విజిలెన్స్‌విభాగంలో ప్రక్షాళన తప్పదనేది కూడా చర్చమొదలైంది. పైగా టిటిడిలో ప్రత్యేకంగా విజిలెన్స్‌విభాగం పోలీస్ సిబ్బంది లేకపోవడం కూడా ఇలాంటి తప్పిదాలకు అవకాశం ఇచ్చినట్లేనని కొందరు ఉద్యోగులు వాదనలు. పరకామణిలో గుమస్తా అయిన సివి రవికుమార్ 2023ఏప్రిల్‌లో 920 అమెరికన్ డాలర్లు చోరీ చేసిన కేసు,ఎఫ్ఐఆర్, ఆ తరువాత దర్యాప్తు, అతను కూడబెట్టిన ఆస్తులు,కుటుంబసభ్యుల ఆస్తులు, బ్యాంక్‌ఖాతాలు, లోక్‌అదాలత్‌లో రాజీతో ఎవరెవరికి ఎంత మొత్తంలో లాభపొందారనేది సిఐడి నిగ్గుతేల్చాల్సిన కీలక అంశంగా మారింది.

# నేటి నుంచి 12 రాష్ట్రాలు, యుటిల్లో 'సర్'

>> సెకండ్ ఫేజ్ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ప్రక్రియ మంగళవారం నుంచే మొదలు కానుందని వివరించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రారంభం అవుతుందని సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెల్లడించారు. దేశంలోని 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ ఓటర్ల జాబితా సవరణ జరుగుతుందని, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గోవా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కేరళ, రాజస్థాన్ రాష్ట్రాలతోపాటు అండమాన్ అండ్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరి వంటి కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ప్రతి ఓటరు ఇంటిని కనీసం 3 సార్లు సందర్శించి కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడానికి ఏవైనా తప్పులను సరిదిద్దుతారని సీఈసీ జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఫారం6, డిక్లరేషన్ ఫారాలను సేకరించి, కొత్త ఓటర్లు ఫారాలను నింపడానికి, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) లేదా అసిస్టెంట్ ఈఆర్ఓకి అందజేస్తారని తెలిపారు. ఎస్ఐఆర్ రెండో దశ శిక్షణ కార్యక్రమాలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతాయని ప్రధాన ఎన్నికల కమిషనర్ తెలిపారు.


28-10Pg3 BZ 3 VJA_28-10Pg3 BZ.qxd 28/Oct/25 12:08 AM Page 1



# లాజిస్టిక్స్ అభివృద్ధికి రైలు రవాణా కారిడారే కీలకం

## నూతన పోర్టులకు రైల్వే కనెక్టివిటీ రావాలి

## రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



రైల్వే ప్రాజెక్ట్‌లపై సిఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, అక్టోబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని నూతనంగా నిర్మించే పోర్టులను కూడా అనుసంధానించేలా రైల్వే కనెక్టివిటీ వచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మూలపేట, విశాఖ, కాకినాడ, రామాయపట్నం తదితర పోర్టులకు కనెక్టివిటీని పెంచేలా లైన్లు వేయాలని సీఎం రైల్వే అధికారులకు సూచించారు. సోమవారం సచివాలయంలో రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఏపీలో లాజిస్టిక్స్ రంగాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేసేలా ప్రణాళిక చేస్తున్నామని ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి ఉత్పత్తుల రవాణా కోసం రైల్వే సహకారం అవసరమని సీఎం అన్నారు. కేంద్రంతో కలిసి ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్ ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. నడికుడిశ్రీకాళహస్తి, గుంటూరుగుంతకల్, గుణదలముస్తాబాద్ బైపాస్, రేణిగుంట, రాయదుర్గ్తుముకూరు మధ్య రైల్వేలైన్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షలో చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రంలో చేపట్టిన రూ.33,630 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టు పనుల పురోగతిపై సీఎం అధికారులతో సమీక్షి ంచారు. హైదరాబాద్‌బెంగుళూరు, అమరావతి మీదుగా హైదరాబాద్‌చెన్నై మార్గాల్లో హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్వే కారిడార్ కు సంబంధించిన ప్రతిపాదనలపై సీఎం చర్చించారు. అమరావతిలో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించేలా బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు రావాలని ముఖ్యమంత్రి సూచించారు. తిరుపతిని కలుపుతూ చెన్నై బెంగుళూరు హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్ ఉండేలా చూడాలన్నారు. మరోవైపు ఖరగ్ పూర్ నుంచి చెన్నై వరకూ డెడికేటెడ్ రైలు రవాణా కారిడార్ పైనా సమీక్షలో సీఎం దిశానిర్దేశం చేశారు. కొత్తగా 1564 కిలోమీటర్ల కొత్త మార్గాలకు సంబంధించిన పనులపై కూడా సీఎం ఈ సమీక్షలో చర్చించారు. ఏపీని లాజిస్టిక్స్ కారిడార్ గా మార్చేలా ప్రణాళికలు చేస్తున్నామని ప్రస్తుతం ఉత్తర దక్షి ణ భారత్ ల మధ్య కనెక్టివిటీ దిశగా పనులు జరిగాయని ఇక తూర్పు నుంచి పశ్చిమ రాష్ట్రాలను అనుసంధానించే ప్రాజెక్టులు కూడా చేపట్టాల్సి ఉందని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచనలు జారీ చేశారు. నడికుడి శ్రీకాళహస్తి మార్గంలో తదుపరి పనులు చేపట్టేందుకు అవసరమైన రూ.27 కోట్ల నిధుల్ని తక్షణం విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. కోటిపల్లి నర్సాపూర్ మార్గంలో కాకినాడ కోటిపల్లి అమలాపురం మార్గంలో రైలు సర్వీసు నడపాలని సూచించారు. అమరావతి, గన్నవరంలో నూతన రైల్వే కోచింగ్ టెర్మినళ్ల నిర్మాణానికి భూమి కేటాయించాలని రైల్వే శాఖ చేసిన ప్రతిపాదనకు సీఎం అంగీకారం తెలిపారు. వీటితో పాటు విజయవాడ, గుంటూరు నగరాల్లోనూ రైల్వే కోచింగ్ టెర్మినళ్లను విస్తరిస్తున్నట్టు అధికారులు వివరించారు. గుంటూరు గుంతకల్ డబ్లింగ్ పనులు వేగంగా చేపట్టాలని... కాజీపేట విజయవాడ మధ్య మూడో లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో ఐకానిక్ రైల్వే స్టేషన్లు రాష్ట్రంలోని విజయవాడ, విశాఖ, తిరుపతిలను ఐకానిక్ రైల్వే స్టేషన్లుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నూతనంగా నిర్మించనున్న అమరావతి రైల్వే స్టేషన్ ను కూడా వినూత్నంగా నిర్మాణం చేపట్టాలన్నారు. విజయవాడ రైల్వే స్టేషన్ రీడెవలప్మెంట్ పనులు వేగంగా చేపట్టాలని తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణికుల సౌలభ్యం కోసం స్కైవాక్ నిర్మించాలని సీఎం సూచించారు. విశాఖలో జ్ఞానాపురం వైపు అభివృద్ధి చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉంటాయని సీఎం అన్నారు. ప్రస్తుతం మూడు స్టేషన్లతో పాటు నెల్లూరు,

రాజమహేంద్రవరం స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్టు రైల్వే అధికారులు ముఖ్య మంత్రికి తెలియచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 73 స్టేషన్లను అమృత్ స్టేషన్ల కింద ఆధునీకరిస్తున్నామని రైల్వే అధికారులు వివరించారు.

# తిరుమల సమాచారం

## తిరుమలలో విడవని వర్షం



**తిరుమల,అక్టోబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో తుఫాన్ ప్రభావంతో తిరుమలతో బాటు తిరుపతి జిల్లాలో తిరుమల,తిరుపతి,చంద్రగిరి ప్రాంతాల్లో బలమైన వాన కురుస్తోంది. ఉదయం గంటసమయం కురిసిన వాన మళ్ళీ మధ్యాహ్నం, సాయంత్రం నుండి కురుస్తోంది. ఓ వైపు వర్షం మరోవైపు విపరీతమైన చలితో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యాసంస్థలకు కూడా వరుసగా మూడురోజులు సెలవులు ప్రకటించారు. కురుస్తున్న వానలతో వాతావరణం మారి చలితీవ్రత పెరిగింది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు చలికి వణుకుతున్నారు. వర్షాల కారణంగా తిరుమల ఘాట్‌రోడ్లలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం వుందని, వాహనదారులు ,భక్తులు అప్రమత్తంగా ఉండాలని టిటిడి విజిలెన్స్ హెచ్చరిస్తున్నారు.

## శ్రీవారి ఆశీస్సులతో సకలం సుభిక్షం

### రఘువిజయతీర్థస్వామి



**తిరుమల, అక్టోబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మానవాళి సుభిక్షంగా ఉంటుందని కర్నాటక శ్రీకూడలి ఆర్యఅక్షోభ్యమఠం పీఠాధిపతి రఘువిజయతీర్థస్వామి తెలిపారు. పవిత్రమైన కార్తీక సోమవారం ఉదయం శిష్యులతో కలసి ఆలయం వద్దకు విచ్చేసిన స్వామివారికి ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా మహద్వారం వద్ద స్వాగతం పలికారు. వానలోనూ స్వామి ఆలయంలోపలకు చేరుకుని తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# బస్సు ప్రమాద మృతులకు కన్నీటి వీడ్కోలు



**వింజమూరు, (నెల్లూరు)అక్టోబర్ 27, ప్రభాతవార్త** కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుండి బెంగుళూరుకు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధమైన ఘటనలో సజీవ దహనమైన గోళ్ళ రమేష్ కుటుంబ సభ్యుల మృతదేహాలు ఆదివారం రాత్రికి గోళ్ళవారిపల్లికి ప్రత్యేక అంబులెన్స్ ద్వారా వచ్చాయి. సోమవారం ఉదయం జరిగిన అంతిమ యాత్రలో మృతులు గోళ్ళ రమేష్, అనూష, శశాంత్, మన్విత్‌లకు అశ్రునయనాలతో ఘనంగా కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు. బస్సు ప్రమాద ఘటన తెలిసినప్పటి నుండి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్వయంగా గోళ్ళవారిపల్లి గ్రామానికి వెళ్లి గోళ్ళ రమేష్ తండ్రి మాలకొండయ్యకు ధైర్యం కల్పిస్తూ అండగా అక్కడే ఉండి మృతదేహాలను స్వగ్రామంకు తీసుకొని వచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టి అటు పార్టీ పెద్దలు దృష్టికి రమేష్ కుటుంబ పరిస్థితి వివరించి ఇటు జిల్లా నాయకులతో ప్రమాద ఘటన వివరిస్తూ వారి కుటుంబంలో ఒక్కడిగా వ్యవహరించిన ఎమ్మెల్యే తీరు గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఆదివారం రాత్రి కర్నూలు నుండి ప్రత్యేక అంబులెన్స్‌లో బయలుదేరిన మృతదేహాలు వస్తున్నాయని సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గొళ్ళవారిపల్లి గ్రామంలో మృతదేహాలను రాత్రికి ఉంచేందుకు మృతుడు ఇంటి వద్ద ఐస్ బాక్సులు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా సోమవారం ఖననం చేసే ప్రాంతం శుభ్రం చేయించాడు. ప్రమాద సంఘటన జరిగిన రోజు నుండి చివరి అంతిమ యాత్ర వరకు అన్ని ఖర్చులు ఎమ్మెల్యే భరించారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబానికి ధైర్యం చెబుతూ గ్రామస్తులు అందరూ కూడా వారికి మనోధైర్యం కల్పించాలని కోరారు. సోమవారం అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో జనాలు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. గొళ్ళవారిపల్లిలో దు:ఖ వాతావరణం నెలకొంది. సోమవారం జరిగిన రమేష్ కుటుంబ సభ్యుల అంతిమ యాత్రలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని కన్నీరుమున్నీరయ్యారు. రమేష్ కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటానని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఈ ప్రమాదం తనను మానసికంగా తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కష్టం ఏ ఒక్క కుటుంబానికి కలగకూడదని దేవుని ప్రార్థిస్తున్నాం అన్నారు. మృతుడు కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. గోళ్ళ మాలకొండయ్య కుటుంబానికి పార్టీ నుండి పది లక్షల రూపాయలు అందించడం జరిగిందన్నారు. అలాగే కాకర్ల చారిటబుల్ ట్రస్టు నుండి మూడు లక్షల రూపాయలు ఆర్థిక సాయం నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ట్రస్టు నుండి రూ.5లక్షలు ఆర్థిక సాయం, అలాగే మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు స్వర్ణ భారతి ట్రస్టు ద్వారా లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. అంతే కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి మరికొంత ఆర్థిక సహాయం అందనుందన్నారు.

ఆర్థికపరంగా మాలకొండ కుటుంబానికి భరోసా కొంత కలిగినప్పటికి, కుటుంబ సభ్యులు కోల్పోయిన లోటును తీర్చలేనిదన్నారు. వారి కుటుంబాన్ని అన్ని విదాల ఆదుకునే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. ప్రత్యేకంగా పోలీసు వారికి మీడియా మిత్రులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.

## తాళ్లరేవు మండల గ్రామాలకు సహాయక చర్యలపై దృష్టి సారించాలి

### అమలాపురం ఎంపి హరీష్

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 27 ప్రభాతవార్త:** మొంథా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష సమావేశంలో అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లాలో విలీనమై అమలాపురం పార్లమెంట్ పరిధిలో ఉన్న తాళ్లరేవు మండలంలోని గ్రామాల ప్రస్తుత పరిస్థితి పై అధికారులను హరీష్ ఆరా తీశారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. అవసరమైతే చెయ్యాల్సిన సహాయక చర్యలపై దృష్టి సారించాలని ఎంపీ హరీష్ అధికారులకు సూచించారు. అలాగే ఈ సమావేశంలో పాల్గొన్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌లను విపత్కర పరిస్థితులు ఏర్పడితే తమ పరిధిలోని గ్రామాలకు పూర్తి సహాయ సహకారాలను అందించాలని ఎంపీ హరీష్ కోరినట్లు తెలిపారు.

## పరకామణి కేసులో ముందుకు ఎలా !

### - వైకుంఠద్వారదర్శనాలపై నేడు నిర్ణయం?
### - నేటి టిటిడి బోర్డు సమావేశంలో కీలక అంశాలు



**తిరుమల,అక్టోబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు మొక్కుబడులుగా కానుకలు సమర్పించే పరకామణిలో చోరీ జరిగిన ఉదంతంపై కేసు హైకోర్టులో ఉండటంతో తదుపరి ఎలా వ్యవహరించాలనే అంశంపై టిటిడి బోర్డు చర్చించే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ కేసులో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ హైకోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. టిటిడి ప్రమేయం లేకుండా అప్పటి పరకామణి ఏవిఎస్‌ఒ సతీశ్‌కుమార్ కేసు రాజీచేసుకున్నారనే ప్రధాన ఆరోపణ వినిపించారు.ఇప్పుడు సిఐడితో విచారణకు,రవికుమార్ ఆస్తులపై ఏసిబికి కేసు అప్పగించడం సంచలనంగా మారింది. టిటిడికి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన భక్తుల మనోభావాలతో ముడిపడిన విషయం కావున ఎలాంటి చర్యలు చేపట్టాలి, సిఐడికి ఇవ్వాల్సిన సమాచారం పై నేడు చర్చించనున్నారు. అలాగే గతనెలలో ముగిసిన సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఇటీవల దిగ్విజయంగా జరిపించారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల బహుమానం కూడా టిటిడి ఉద్యోగులకు 18వేల రూపాయలు మంజూరుచేయాలనేది టిటిడి ఉద్యోగ సంఘాల విజ్ఞప్తులు. గత ఏడాది 15,400 రూపాయలు బ్రహ్మోత్సవ బహుమానం అధికారులు మంజూరుచేశారని దాన్ని కొంతరెట్టింపు చేయాలని కోరుతున్నారు. ఎంత మొత్తంలో అందజేస్తారనేది బోర్డు సమావేశంలో స్పష్టత రానుంది. ఇక ఆలయంలో పవిత్రమైన ధనుర్మాసంలో ఏకాదశి,ద్వాదశి ఘడియల్లో వైకుంఠద్వారాన్ని తెరచి ఉంచే విషయంపై రెండురోజులకే పరిమితం చేయనున్నారనేది వెల్లడికానుంది. ఇదేగాక తిరుమలలో ఔషధవనం ఏర్పాటు, ప్రసాదాలకు ఆహారపదార్థాలు టెండర్లు, టిటిడిపై దుష్ప్రచారాలు చేసేవారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి, గోశాల నిర్వహణ పై కార్యాచరణ వంటి అంశాలు చర్చకు రానున్నాయి.

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

### ముందస్తు చర్యలు పకడ్బందీగా ఉండాలి : డిప్యూటీ సిఎం పవన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 27 ప్రభాతవార్త:** మొంథా తుపాను కాకినాడ ప్రాంతంలో తీరం దాటనున్న క్రమంలో కాకినాడ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై సోమవారం మంగళగిరి క్యాంప్ కార్యాలయం నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పి.నారాయణ, స్పెషల్ ఆఫీసర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ల్లాలో 12 మండలాలపై ప్రభావం ఉంటుందనీ తెలిసిన క్రమంలో ముందస్తు చర్యలు పకడ్బందీగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు వారికి అవసరమైన ఆహారం, రక్షిత తాగునీరు, పాలు, ఔషధాలు సమకూర్చాలన్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు, ఈతగాళ్ల సిద్ధంగా ఉన్నందున ఎలాంటి ఆందోళన అవసరం లేదని ప్రజలకు తెలియచేయాలన్నారు.తీరం దాటే సమయంలో గాలుల తీవ్రత ఎక్కువగా ఉం టుంది కాబట్టి విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి వాటి పున రుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. గర్భిణులు, బాలిం తలు, వృద్ధులు, రోగుల వివరాలు తెలుసుకొని, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని.

## మొంథా తుఫాన్ ప్రభావం

### నేడు ప్రశాంతి.. విశాఖ సహా అనేక రైళ్లు రద్దు

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 27, ప్రభాత వార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి మొంథా తుపానుగా మారడంతో రైల్వేశాఖ అప్రమత్తమైంది. ప్రయాణికుల రక్షణ, భద్రత దృష్ట్యా భువనేశ్వర్ బెంగళూరు మధ్య తిరిగే ప్రశాంతి ఎక్స్ ప్రెస్, భువనేశ్వర్ సికింద్రాబాద్ మధ్య తిరిగే విశాఖ ఎక్స్ ప్రెస్ తోపాటు తూర్పు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే అనేక రైలు సర్వీసులను రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది.

## శ్రీవారికి తలనీలాలు సమర్పించిన కొడాలి నాని



**తిరుమల,అక్టోబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** ఎప్పుడూ భిన్నంగా గడ్డంతో కనిపించే మాజీమంత్రి, వైసిపి నేత కొడాలి నాని సోమవారం ఉదయం తిరుమలలో వేంకటేశ్వర స్వామికి తలనీలాలు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. ఆయన చూడటానికి చాలా సన్నగాకనిపించారు. సోమవారం ఉదయం వైసిపి మాజీమంత్రులు కొడాలి నాని, పేర్నినాని శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించి కానుకలు సమర్పించారు. ఆలయ అర్చకులు రంగనాయకుల మండపంలో ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మేయర్ అనురాధ దంపతుల హత్యకేసు నిందితుల శిక్ష మళ్లీ వాయిదా

**చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్ హత్య కేసులో నిందితుల శిక్ష మరోసారి వాయిదా పడింది. మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌ల హత్య కేసు తుది తీర్పు సోమవారం వెల్లడిస్తామని మూడు రోజుల క్రితం చిత్తూరు 6వ అదనపు జడ్జి కోర్టు ప్రకటించింది. ఈ మేరకు హత్యానేరం నిర్ధారించబడిన ఐదు మందిని పోలీసులు సోమవారం కోర్టు ఎదుట హాజరుపరిచారు. అయితే నిందితుల నుండి వాగ్మూలాలు తీసుకున్న కోర్టు ఈ నెల 30వ తేదీన తుది తీర్పు వెల్లడించనున్నట్లు జడ్జి శ్రీనివాసరావు తెలిపారు. చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌లు 2015 నవంబర్ 17వ తేదీన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోనే దారుణ హత్యకు గురయ్యారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి మేయర్ దంపతుల హత్య కేసులో 23 మంది నిందితులను గుర్తించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కోర్టులో 2016 ఫిబ్రవరి 18వ తేదీన కోర్టులో 23 నిందితులపై చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు విచారించిన 6వ అదనపు కోర్టు 23 మంది నిందితుల్లో మేయర్ దంపతులను హత్య కేసులో ఐదు మందిని మాత్రమే నిందితులుగా నిర్ధారించి మిగిలిన వారిని విడుదల చేసింది. ఈ మేరకు మేయర్ దంపతులను హత్య చేసిన మొదటి ఐదు మంది నిందితులను పోలీసుల కస్టడీలోకి తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు సోమవారం మేయర్ దంపతుల హత్య కేసు నిందితులకు శిక్ష ఖరారు అవుతుందని అందరు భావించారు. అయితే ఈ కేసులో ప్రధాన నిందితులుగా వున్న చంద్రశేఖర్ అలియాస్ చింటూ, వెంకటాచలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేష్‌ల వాగ్మూలాలను కోర్టు సోమవారం మరోకసారి నమోదు చేసింది. ఈ మేరకు నిందితులు తమ ఆవేదనను కోర్టుకు విన్నవించుకున్నారు.

## తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

### - విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లు - డివిజన్లస్థాయిలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు - ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతిరూరల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎపిఎస్పీడిసిఎల్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఎస్పీడిసిఎల్ పరిధిలో తుఫాన్ ప్రభావం ఎక్కువ ఉండే జిల్లాల్లో అధికారులు, సిబ్బంది ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాలలో విద్యుత్ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. నెల్లూరు సర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్ జె.రమణాదేవి, తిరుపతిసర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్ పి.సురేంద్రనాయుడు, చిత్తూరు సర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్ యం.ఉమాపతిలను నోడల్ ఆఫీసర్లగా నియమించామని తెలిపారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న ఎపిఎస్పీ డిసిఎల్ నుంచి అధి కారులు, సిబ్బందితో (1505 మంది) కూడిన 124 బృందాలు తరలి వెళ్ళాయని తెలి పారు. ఎస్పీడిసి ఎల్‌కు అవసరమైన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు, ఎబి స్విచ్‌లు, క్రాస్ ఆర్మ్స్, కండక్టర్, ఎబి కేబుల్ తదితర విద్యుత్ పరికరాలను కూడా తరలించినట్లు పేర్కొన్నారు. ఎపిఎస్పీడిసిఎల్ సంస్థ పరిధిలో సర్కిల్స్, డివిజన్స్ స్థాయిల్లో కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతా ల్లో సరఫరా పున రుద్ధరణ పనులు వేగవంతం చేయడం కోసం అధికారులు, సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉండాల న్నారు. వర్షం కురుస్తున్న సందర్భాలలో ప్రజలు విద్యుత్ స్తంభాలకు తాకవద్దని, లైన్ల కింద నిల్చోవద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూటిపోవడం, లైన్ల తెగిపడటం లాంటి సంఘటనలను గుర్తించినట్లయితే తక్షణమే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి గానీ లేదా టోల్ ఫ్రీ నంబర్లు-1912 లేదా 1800 425 1553 33కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

## తుఫాన్ ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేయాలి, ప్రజలను అప్రమత్తం చేయాలి: చంద్రబాబు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 27 ప్రభాతవార్త:** మొంథా తుపాను ప్రభావంపై సోమవారం అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ, ప్రత్యేక అధికారి కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ జీ.బిందు మాధవ్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ, అమలాపురం పార్లమెంటు సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, జీఎం.హరిష్ బాలయోగిలతో కలిసి హాజరయ్యారు. తుఫాన్ ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి, ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

## వైఎస్సార్సీ రాజకీయాలు చేస్తుందా? ఆ పేరుతో నేరాలను ప్రోత్సహిస్తుందా? మంత్రి లోకేష్

**విజయవాడ, అక్టోబరు 27 పభాతవార్త ప్రతినిధి:** వైసిపి రాజకీయాలు చేస్తుందా, ఆ పేరుతో నేరాలను ప్రోత్సహిస్తుందా ఆలోచించుకోవాలి అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. పక్క రాష్ట్రంలోని ఓ గురుకుల పాఠశాలలో 2023 నాటి వీడియోను ఇప్పుడు అరకులో జరిగినట్లు ఒక కథనం రాసి వైకాపా అనుబంధ సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రచారాలతో రాజకీయం చేద్దామనుకుంటున్న 'బ్లూ బ్యాచ్' సమాజానికి ప్రమాదకరమని ఎక్స్‌లో నారా లోకేష్ ఆరోపించారు..

'ఈ వార్త, వీడియోపై రాష్ట్ర ప్రభుత్వం తరపున ఫ్యాక్ట్ చెక్‌లో సంపూర్ణ వివరాలు అందించాం. కొద్ది రోజులు ఊరుకొని మళ్ళీ అదే వీడియోతో తాజాగా తప్పుడు ప్రచారం ప్రారంభించారు. ఈ ఫేక్ ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దు.

తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చర్యలు తీసు కోవాల్సిందిగా పోలీసుల్ని కోరుతున్నాను'అని లోకేష్ వివరించారు.


**IN THE COURT OF THE I ADDI JUNIOR CIVIL JUDGE: VIJAYAWADA**

**O.S No. 48 OF 2022**

Between :
Canara Bank (Erstwhile Syndicate Bank), Buckinghampet Branch, Vijayawada, Andhra Pradesh
Rep by its Chief Manager ... Plaintiff
AND
M/s. Sri Padman Herbals
Rep by its prop: Neelapu Padmavathi ... Defendant
To:
Defendant
M/s. Sri Padman Herbals, Rep by its Proprietor Neelapu Padmavathi, W/o Ramesh, aged 53 years, D.No.27-12-72, 2nd Floor, North Face, Alibaig Street, Governorpet, Vijayawada, Andhra Pradesh-52002.

పై నెంబర్ దావాలో ప్రతివాది అయిన మీకు పై దావా నెంబర్ 48/2022 నోటీసులు పంపగా తీసుకొనక కాలయాపన చేయుచునందున, ఈ పేపర్ ప్రకటన ద్వారా పై దావా సంగతులు తెలియ చేయవలసినదిగా పై కోర్టు వారు ఆదేశించియున్నారు. కావున ది: 31/10/2025 ఉదయం గం. 10-30 ని. లకు పై కోర్ట్ వారి ఎదుట స్వయంగా గాని లేదా మీ న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలుపు కొనవలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని ఈ మూలంగా తెలియచేయడమైనది.

వాయిదా తేది.31/10/2025)
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

Sri. B.SURYANARAYANA KUMAR, B.Com; BL;
B. SAI KRISHNA KARTHIK, MBA, LLB
ADVOCATES, BSNK Law Associates
D.No:32-15-104, Flat No: 01, Classic Towers,
Ratnamamba Street, Moghalrajpuram, Vijayawada-10
Cell No.98480 17859, 81859 56019



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ నోటీసు
నెం.16(3)/ఓ.ఓ/2025-26, తేది: 21.10.2025
2025-26 సంవత్సరమునకు వంతెన మరియు రోడ్లు మరమ్మతుల నిమిత్తం మొత్తం 3 పనులకు గాను అంచనా విలువ: రూ.45.40 లక్షలకు టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరు షెడ్యూలు డౌన్‌లోడ్ చేసుకొనుటకు తేది: 29.10.2025 మ.3.00గం.ల నుండి. ఇతర వివరాలను www.eprocurement.gov.in నుండి పొందవచ్చును. ఫోన్ నెం. 08672-252500.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) శాఖ, మచిలీపట్నం.
DIPR.NO. 17856/CL/ADVT/1/1/2022-23 తేది: 27.10.2025

వార్త

దేనినైనా ఆశించబోయే ముందు అందుకు కావలసిన అర్హతను సంపాదించుకో.

-బర్ట్రండ్ రస్సెల్

# ముందస్తుతో ముప్పు తప్పేనా?

భారీ తుపాను హెచ్చరికతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల ప్రజలకు కంటి మీద కునుకు లేదు. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత ప్రజలయితే ఎప్పుడు ఏ జలఖడ్గం మీద పడ్తుందోనని బెంబేలు పడుతున్నారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారింది. ఇక్కడొచ్చే భయం అదే. వాయుగుండం బలహీనపడి తీరం దాటేటప్పుడే అసలు సమస్య వస్తుంది. తుఫానులు వాయుగుండాలు, వరదలు తెలియని తీర ప్రాంతంకాదు. కోస్తాతీర ప్రాంతాలకు మూడు రోజులు ముందుగానే వాతావరణ హెచ్చరికలు తెలియడం, తుఫాను తీవ్రతను అంచనా వేయగలగడం ఆధునిక శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకొని వాతావరణ తీవ్రతను తెలియ చేయడం మంచి పరిణామం. దీని వల్ల ప్రాణనష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవడం తేలిక. ఉత్తర ఈశాన్య జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని జారీ చేసిన హెచ్చరికలు మొదట్లో ప్రజల్ని ఆందోళనలో ముంచెత్తినా ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఆహ్వానించదగినవి. గతంలో ఉత్తరాంధ్రకు ఎంతో తీవ్రతతో వచ్చి ఆ ప్రాంత ప్రజలపై పంజా విసిరిన 'హుద్‌హుద్' తుఫాను అనంతర చర్యలు ఉపశమనం కలిగించాయి. ఆనాటి అనుభవాలతో ఈ ప్రాంతంలో అలల అలజడికి మరెంతో మంది అప్రమత్తులైనారు. తీరం పొడవునా బీచ్‌లన్నీ మూసేసారు. ఈదురుగాలులకు విద్యుత్ లైన్‌లు, కమ్యూనికేషన్, వంటి మౌలిక సౌకర్యాలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఎక్కువ. కనుక పెద్ద సంఖ్యలో పునరుద్ధరణ సిబ్బందిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రకృతి బీభత్సాలు ఆ ప్రాంతాలకు, ప్రభుత్వాలకు కొత్త కాదు. ఈసారి మరిన్ని ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 2014 అక్టోబరు 12న హుద్‌హుద్ తుపాను ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని ముంచెత్తింది. కనీవినీ ఎరుగని రీతిలోరూ. 21,908 కోట్ల మేరకు ఆస్తి నష్టం వాటిల్లింది. శ్రీకాకుళం, విజయ నగరం, విశాఖపట్నం జిల్లాలు ప్రభావితం కాగా వ్యవసాయ సంబంధిత నష్టం రూ.947 కోట్లుగా అంచనా వేశారు. గత అనుభవాల రీత్యా ఈసారి 'మొంథా' తుపానును ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. సోమవారం రాత్రికి తీవ్ర వాయుగుండం ప్రభావం గట్టిగానే ఉంటుంది. మంగళవారం మధ్యాహ్నం తుపాను బలహీనపడుతుంది. ఇలా జరిగినప్పుడే ప్రకృతి విధ్వంసం తీవ్రంగా ఉంటుంది. కోస్తా జిల్లాలో ఈదురు గాలులతో వర్షాలు పడుతున్నాయి. మొంథా తుపాను మంగళవారం సాయంత్రానికి కాకినాడ, తునిల మధ్య తీరం దాటుతుందన్నది అంచనా. ప్రస్తుతానికి చెన్నైకి 520 కి.మి, కాకినాడకి 570కి.మీ, విశాఖపట్నానికి 600 కి.మీ దూరంలో కేంద్రీకృతమైంది. తీరం వెంబడి అన్ని పోర్టుల్లో మూడో ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. జాలర్లను సముద్రంలోకి వెళ్లకుండా నిషేధాజ్ఞలు విధించారు. నెల్లూరు జిల్లాలో ఎగువనున్న సోమశిల డ్యామ్ నుండి పెన్నానదికి వచ్చే వరద ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని పొర్లుకట్టల నిర్మాణాన్ని స్థానికులు చేసుకుంటున్నారు. ఎన్నడూలేనిది ఈసారి ఎలాంటి విలయ తాండవానికైనా తట్టుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమౌతోంది. బొర్రా గుహలకు ఈనెల 31వరకు పర్యాటకులెవరూ సందర్శించకుండా సెలవులు ప్రకటించారు. ఉభయ రాష్ట్రాలలో ఎన్నో కష్టాలు కోర్చి వరి, కూరగాయలు, అపరాలు,వగైరా ఎన్నో పంటలను పండించగా ఇటీవలనే కోతల వరకు చేరి మరో పంటకు సిద్ధమైన తరుణంలో ఈ తుపాన్ ప్రభావం నష్టపరిచేదే. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో తుపానుల తాకిడి ఉంటుందని పంటల ఒబ్బిడి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నవారు గట్టెక్కారు. అలా చేసుకోలేని వారు ఆందోళనపడుతున్నారు. ఉభయ రాష్ట్రాల్లో జూన్ నుంచి భారీ వర్షాలు, అత్యంత భారీ వర్షాలు పడుతూనే ఉన్నాయి. ఇందువల్ల వ్యవసాయ కార్యకలాపాల మీద తీవ్ర ప్రభావం చూపాయి. చివరికి పంట చేతికొచ్చిన తరుణంలో నోటికందకుండా చేస్తోంది. అంటే సాగు ఉత్పత్తులను విక్రయించుకునే సమయానికి భారీ వర్షాలు ముంచెత్తిరావడంతో రైతులు కష్టాల సాగు చేసినట్లు భావించాల్సి వస్తోంది. చాలా మంది రైతులు తాము పండించిన పంట ఆదాయ వ్యయాలుచూసుకుంటే అప్పులే మిగిలాయి. దానికితోడు ఈవర్షాలు మరిన్నితిప్పలు తెచ్చిపెట్టాయి. గత నాలుగు నెలల్లోనూ 98 రోజుల భారీ వర్షంతో తెలంగాణ రైతును ఎత్తి కుదేసాయి. ఇక వ్యవసాయం వద్దనుకునే పరిస్థితీ. దాదాపు ఆంధ్రప్రదేశ్ రైతాంగం పరిస్థితి అదే. ఎక్కడా వెసులుబాటు లేని స్థితి. మళ్లీ పంటకు పెట్టుబడి పెట్ట లేని స్థితి. రేపటి తుపాను ప్రభావం ఎలా ఉంటుందో తెలియని గందరగోళంలోకోస్తా రైతు కొట్టుమిట్టాడుతున్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. గతానికి ఇప్పటికీ తేడా ఏమిటంటే తుపానుపై ప్రిడెక్టివ్ మోడల్, రియల్ టైమ్ డేటాను అనుభవంలోకి తీసుకుని ముఖ్యమంత్రి సరైన సమయానికి సరైన నిర్ణయాలు, అప్రమత్తం పాటింపు చర్యలు తీసుకోవడానికి అనువుగా ఉంటుంది. డ్రోన్‌లు, క్రేన్‌లు, జెసిబిలు, రంపాలు వంటి అన్ని ఆధునిక పరికరాలతో బృందాలు సిద్ధమయ్యాయి. తీరం దాటేటప్పుడు ప్రచండగాలులు వీస్తాయని హెచ్చరించడంతో ఉత్తరకోస్తా ప్రాంతం వాళ్లు బతుకు జీవుడా అని కాలం వెళ్లబుచ్చుతున్నారు. ప్రభావిత ప్రాంతాల్లో నౌకాదళ హెలికాప్టర్‌లు బోట్లు సిద్ధం చేయడం వల్ల తక్షణ సహాయాన్ని అందివ్వడం వీలవుతుంది.



సమాజంలో మాత్రమే ఒక వ్యక్తి అనుకున్న శక్తులన్నిటినీ అన్ని దిశలలోనూ అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

వివేకానంద



ఎక్కువ మంది విమర్శిస్తారు, కొద్ది మంది ప్రశంసిస్తారు. బహు కొద్ది మంది ప్రోత్సహిస్తారు.

రామకృష్ణ పరమహంస

# ప్రాథమిక హక్కులకు గ్రహణం?

**రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న రాజ్యాంగ మౌలిక స్వరూపానికి ఎసరు పెట్టే మెజారిటేరియనిజం ప్రమాదం కట్టెదుట నిలిచింది. రాజ్యాంగ మౌలిక స్వరూప లక్షణాలు ప్రధానంగా ఏవంటే రాజ్యాంగం అత్యున్నత స్థానం, దేశ ఐక్యత సమైక్యత, సర్వసత్తాకత, ప్రజాస్వామిక జీవన విధానం, రాజ్యాంగ లౌకికవాద, ఫెడరల్ స్వభావం, ప్రాథమిక హక్కులు, శాసన సభ, కార్య నిర్వాహక వర్గం, న్యాయస్థానాల మధ్య అధికార వేర్పాటు, సంక్షేమ రాజ్యం,సమానత్వం మొదలగునవి. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారం లోకి వచ్చిన తర్వాత నేటి పాలక పార్టీ మెజారిటేరియని జాన్ని ప్రోత్సహిస్తూ, అభివృద్ధి పేరిట తీవ్ర ఆర్థిక అసమా నతలు పెరిగే పంథాన పయనిస్తూ, ప్రభుత్వ రంగాన్నినీరు కారుస్తూ, ప్రతి పక్షాల నుంచి దేశాన్ని విముక్తి చేస్తామని చెబుతూ రాజకీయ ప్రత్యామ్నాయ సిద్ధాంతాల సమూల నిర్మూలనకు సిద్ధమవుతున్నారు. ఇదే కొనసాగితే అవతరిం చేది సంకుచిత భారత్ కానీ వికసిత భారత్ కాదు.**

డా.జె. రవీంద్రనాథ్

ప్రజాస్వామ్యం ఈనాటి పరిస్థితుల్లో జీవించి వికసించాలంటే ప్రజలకు తమ గొంతు వినిపించే స్వేచ్ఛ ఉండాలి. తమ న్యాయమైన కోర్కెల కోసం రోడ్ల మీదకు వచ్చి శాంతియుతంగా ప్రదర్శనలు చేసే అవకాశం , ధైర్యం ఉండాలి. తమ అంతరాత్మకు నచ్చిన మతం అనుసరించే, ప్రచారం చేసే రాజ్యాంగ హక్కు మైనారిటీలకు కాగితంపై కాక ఆచరణలో ఉండాలి. మేజర్లు అయిన యువతీ యువకులు పరస్పర అంగీకారంతో కుల, మత, జాతి భేదాలకు అతీతంగా పరిణయమాడే స్వేచ్ఛ, సామాజిక, నైతికమద్దతు నిచ్చే చట్టాలు ఉండాలి. కానీ 'లవ్ జిహాద్ చట్టాల'తో వారి ప్రాథమిక హక్కులు సమకాలీన భారతంలో మృగ్యమయ్యాయి. రాజ్యాంగం చెప్పిన 'సహేతుక ఆంక్షల' స్థానంలో నిష్కారణ నిర్బంధం, అణచివేత, అగ్రకుల అహంకారపూరిత పరువు హత్యలు పరిపాటి అయ్యాయి. చివరకు జీవించే హక్కు నిస్సారమయ్యేలా వలస కాలం నాటి చట్టాలను మించిన కఠిన చట్టాలను ప్రతిపక్షాలు బైట ఆందోళనలో ఉన్నపుడు ఏ చర్చ లేకుండా పాలక పార్టీ పార్లమెంటులో ఆమోదించింది. అమలులో ఉన్న నల్ల చట్టాలని యధేచ్ఛగా ఉపయోగిస్తోంది. మరో వైపు కార్యనిర్వాహక వర్గాల అత్యుత్సాహం, న్యాయ విరుద్ధ చేష్టలు న్యాయ ప్రక్రియనే శిక్షగా మార్చాయి. రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న రాజ్యాంగ మౌలిక స్వరూపానికి ఎసరు పెట్టే మెజారిటేరియనిజం ప్రమాదం కట్టెదుట నిలిచింది. రాజ్యాంగ మౌలిక స్వరూప లక్షణాలు ప్రధానంగా ఏవంటే రాజ్యాంగం అత్యున్నత స్థానం, దేశ ఐక్యత సమైక్యత, సర్వసత్తాకత, ప్రజాస్వామిక జీవన విధానం, రాజ్యాంగ లౌకికవాద, ఫెడరల్ స్వభావం, ప్రాథమిక హక్కులు, శాసన సభ,కార్యనిర్వాహక వర్గం,న్యాయస్థానాల మధ్య అధికార వేర్పాటు, సంక్షేమ రాజ్యం,సమానత్వం మొదలగునవి. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత నేటి పాలక పార్టీ మెజారిటేరియనిజాన్ని ప్రోత్సహిస్తూ, అభివృద్ధి పేరిట తీవ్ర ఆర్థిక అసమానతలు పెరిగే పంథాన పయనిస్తూ, ప్రభుత్వ రంగాన్నినీరు కారుస్తూ, ప్రతి పక్షాల నుంచి దేశాన్ని విముక్తి చేస్తామని చెబుతూ రాజకీయ ప్రత్యామ్నాయ సిద్ధాంతాల సమూల నిర్మూలనకు సిద్ధమవుతున్నారు. ఇదే కొనసాగితే అవతరించేది సంకుచిత భారత్ కానీ వికసిత భారత్ కాదు. 1950 నాటి ఏ కె గోపాలన్ కేసు నుంచి నేటి భీమా కోరేగాం కేసు దాకా పీడీ, ఊపా, పీఎంఎల్ఏ లాంటి చట్టాల మూలానా వేలాది మంది ఖైదీలు ఎన్నో యేళ్లుగా బెయిలు రాక బాగా కిక్కిరిసిన కారాగారాల్లో మగ్గుతున్నారు. భిన్నాభిప్రాయం, సిద్ధాంతాలు సమర్థించే మేధావులు, నిజాన్ని అన్వేషించే పాత్రికేయులు, భావ ప్రకటన స్వేచ్ఛను ప్రేమించే కళాకారులు తమ హక్కులు కోల్పోయే దుస్థితి రిపబ్లిక్‌తరహా ప్రభుత్వాన్ని కాక నిరంకుశ పాలనకు నిదర్శనం. ప్రపంచ న్యాయ ప్రాజెక్టు చట్టబద్ధ పాలన సూచిక 2024 ప్రకారం భారత్ మొత్తం 142 దేశాల్లో నేపాల్ (69), శ్రీలంక( 75) తర్వాత 79వ స్థానంలో ఉంది. విడి అంశాలలో చూస్తే భారత దేశం ప్రాథమిక హక్కులలో 102వ స్థానం, ప్రభుత్వ అధికారాలపై ఆంక్షల స్థానంలో 60వ స్థానం, పారదర్శకతలో 44వ స్థానం, అవినీతిరాహిత్యంలో 97వ స్థానం,




భద్రతలో 98వ స్థానం, సివిల్ న్యాయంలో 107వస్థానం, క్రిమినల్ న్యాయంలో 82వ స్థానంలో ఉంది. భారత్‌ను ఇతర దేశాలతో పోల్చి చూసినపుడు జర్మనీ(5),కెనడా (12), జపాన్ (24),యుకె (15), ఫ్రాన్స్(22), అమెరికా (27), ఇటలీ (32)వ స్థానాల్లో ఉన్నాయి. డెన్మార్క్, నార్వే, ఫిన్లాండ్‌లు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను మూడవ భాగంలో పొందుపరిచారు.వీటిలో సమానత్వ హక్కు (ఆర్టికల్స్ 1418), స్వేచ్ఛ హక్కు(19, 22), దోపిడీ వ్యతిరేక హక్కు(23, 24), మత స్వేచ్ఛ (25, 28),సాంస్కృతిక, విద్యాహక్కులు (29,30), రాజ్యాంగ పరిష్కారాల హక్కు (32, 35) ఉన్నాయి. ఇవి రాజ్యానికి వ్యతిరేకంగా ఆర్టికల్ 12లోని విశాల నిర్వచనానికి తగినట్లు అమలులో ఉంటాయి. దేశంలో ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా చట్టాలుంటే ఆ మేరకు ఆ చట్టాలు చెల్లనేరవని ఆర్టికల్ 13(1)చెబుతుంది. రాజ్యాంగ సభ చర్చల్లో ఆ నాడు పీడీ చట్టంపై 'న్యాయ ప్రక్రియ' స్థానంలో "చట్టం ద్వారా ఏర్పాటు చేయబడిన విధానం చేర్చారు. వ్యక్తిగత స్వేచ్ఛ విషయంలో కోర్టుల అధికారం తగ్గి సభ్యులందరూ తమ నమ్మకాన్ని శాసన సభ దయపైన, నేతల మంచి వ్యక్తిత్వంపైన పెట్టుకున్నారని గ్రాన్విల్ ఆస్టిన్ తన పుస్తకంలో రాశారు.అంబేద్కర్ ఆశించినట్లు సాంఘిక ఆర్థికన్యాయాలను, సమానత్వాన్ని విస్మరించి రాజ్యం మరింత నిర్బంధానికి పూనుకుంటే నిజమైన జాతీయ ఐక్యతకు భంగం కలుగుతుంది. భిన్నమతాలు, కులాలు, భాషలు, ప్రాంతాలు ఉన్న మన దేశంలో బలమైన వ్యక్తిత్వం,దార్శనికత, చిన్న బృందాలు, ప్రాంతాల కోసం దేశ ప్రయోజనాలను త్యాగం చేయనివారు, పై భేదాల వల్ల కలిగే అపోహలను నుంచి పైకి ఎదిగిన వారు వస్తారని ఆశిద్దాం అన్నారు అంబేద్కర్. కానీ మెజారిటీ మత, భాషా సంకుచిత భావాలను ప్రకటించే నేటి పాలకులకు అట్టి స్థాయి ఎక్కడిది? అయితే గతంలో ఎదురైన ఎమర్జెన్సీ అనుభవం తర్వాత సుప్రీం కోర్టు చట్టం ద్వారా ఏర్పాటు చేయబడిన విధానం అంటే ఆర్టికల్ 14కు అనుగుణంగా ఉండాలని భావించింది. అంటే "అమలులోని చట్టం హేతుబద్ధత పరీక్షకు తట్టుకోవాలి" ఈ విధంగా రాజ్యాంగ నిర్మాతలు ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టిన 'న్యాయ ప్రక్రియ' సారాంశంలో మరింత సమాచారయుత వ్యాఖ్యానం ద్వారా తిరిగి ప్రవేశ పెట్టబడింది. ఆర్టికల్స్ 14,16 రాజ్య చర్యలోని వివాదస్పద గుణాన్ని దెబ్బతీసి న్యాయం,సమాన ట్రీట్మెంట్ జరిగేలా హామీ ఇస్తాయని రాయప్ప కేసు (1974)లో న్యాయ మూర్తులు కృష్ణయ్యర్, భగవతిలు తీర్పులో చెప్పారు. ఎన్‌సిఆర్‌బి గణాంకాల ప్రకారం 2023 డిసెంబర్ నాటికి 5.3 లక్షల మంది ఖైదీల్లో 73.5 శాతం విచారణలో ఉన్న ఖైదీలు. వీరి సంఖ్య 3.9 లక్షలు కాగా, 1295 మంది ఐదేళ్ల కన్నా ఎక్కువ కాలం ఇప్పటికే జైలులో గడిపారు. ఈ సందర్భంగా జస్టిస్ కృష్ణయ్యర్ మాటల్ని గుర్తుచేసుకోవటం సముచితంగాఉంటుంది. జస్టిస్ కృష్ణయ్యర్‌ను నారిమన్ తన గ్రంథం ఇలా ఉటంకించారు. ప్రాథమిక నియమం బెయిల్ కానీ జైలు కాదు. అయితే న్యాయ ప్రక్రియ నుంచి తప్పించుకునే ప్రమాదం, నేరాలకు మళ్లీ పాల్పడటం లేదా సాక్షులను భయపెట్టడం లాంటి వాటి ద్వారా సమస్యలు సృష్టించే పరిస్థితుల్లో తప్ప చాలా కేసుల్లో డబ్బు స్యూరిటీ కాకుండా పిటిషనర్ బంధువులు లేదా అతడు చెందిన సంస్థ హామీ ఇవ్వటం మెరుగైనది, సామాజికంగా కూడా ప్రాసంగికమైనది. ప్రమోద్ సింగ్లా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా,ఇతరులు (2023) కేసులో ప్రివెంటివ్ డిటెన్షన్ కేసుల్లో న్యాయ విధాన అనుసరణలో ఎంత చిన్న తప్పుజరిగినా డిటెన్యూకు అనుకూలంగా సంశయ లాభం ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చింది. జస్టిస్ లెర్నెడ్ హ్యాండ్ మాటల్లో స్వేచ్ఛ స్త్రీ పురుషుల హృదయాల్లో ఉంటుంది. అది అక్కడ మరణిస్తే ఏ రాజ్యాంగం, ఏ చట్టం, ఏకోర్టు దాన్ని కాపాడలేదు. ఏ రాజ్యాంగం, ఏ చట్టం, ఏ కోర్టు దానికి అంతగా సాయం చేయలేదు. ●

# ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై నీలినీడలు



రామ కిష్టయ్య సంగన భట్ల

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం తెలుగు రాష్ట్రాల్లో విద్యా రంగంలో ఒక పెద్ద సంస్కరణగా నిలిచింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉన్నత విద్య అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో 2008లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి దీన్ని ప్రవేశపెట్టారు. ప్రారంభంలో రెండు వేలకోట్ల రూపాయల వ్యయం ఉండగా, కాలక్రమంలో విద్యార్థుల సంఖ్య పెరగడం, కోర్సుల విస్తరణ జరగడం వల్ల ఇది ఏటా ఎనిమిది నుండి పది వేలకోట్ల వరకుచేరింది. ఈపథకం ద్వారా ఇంజనీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ తదితర కోర్సుల్లో చదివే సుమారు ఇరవై లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందారు. ఇంజనీరింగ్ కళాశాలల్లోనే ఏడు నుండి ఎనిమిది లక్షల మంది విద్యార్థులు పూర్తిగా ఈ పథకం ఆధారంగానే చదువులు కొనసాగించారు. మొదట్లో ఇది సామాజిక సమానత్వానికి దారితీసే గొప్ప ఆలోచనగా నిలిచింది కానీ చెల్లింపులు ఆలస్యమవడం, బడ్జెట్ కేటాయింపులు తగినంతగా లేకపోవడం వల్ల సమస్యలు తలెత్తాయి. ప్రభుత్వం నుంచి సమయానికి నిధులు రాక విద్యాసంస్థలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఉపాధ్యాయులకు జీతాలు ఆలస్యమయ్యాయి, లైబ్రరీలు, లాబ్‌లు వంటి మౌలిక సదుపాయాల నిర్వహణ దెబ్బతింది. నాణ్యత తగ్గిపోవడంతో పాటు అనేక కళాశాలలు మూతపడ్డాయి. గత దశాబ్దంలో రెండు వందలకు పైగా ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ కళాశాలలు తలదాచుకోలేక మూసివేయబడ్డాయి. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో విడివిడిగా అమలు చేసినప్పటికీ రెండు రాష్ట్రాల్లోనూ బకాయిలు వేల కోట్లలో పేరుకుపోయాయి.ఈ నేపథ్యంతో విద్యార్థుల ఆందోళనలు తెలంగాణలో మరింత ఉధృతమయ్యాయి. బకాయిలు సకాలంలో చెల్లించాలని, కాలేజీల ఆర్థిక సంక్షోభం పేరుతో విద్యార్థులు నష్టపోకూడదని విద్యార్థి సంఘాలు నిరసనలు వ్యక్తం చేశాయి. కళాశాల యాజమాన్యాలకు కాకుండా నేరుగా విద్యార్థుల ఖాతాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు జమచేయాలని వారు డిమాండ్ చేస్తు



న్నారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం కూడా కొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది. విద్యాసంస్థలకు కాకుండా నేరుగా విద్యార్థుల వ్యక్తిగత ఖాతాల్లోనే నిధులు జమ చేసే విధానం పరిశీలనలో ఉంది. దీనివల్ల డబ్బుల దుర్వినియోగం తగ్గి విద్యార్థులకే ప్రయోజనం నేరుగా అందుతుంది. అయితే ఇలాంటి విధానం అమలు చేయాలంటే విద్యార్థులు నిజంగా కళాశాలల్లో చేరారన్నది, వారు తరగతులు హాజరవుతున్నారన్నది, కోర్సులు కొనసాగిస్తున్నారన్నది కచ్చితంగా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. లేకుంటే ఈ సదుపాయం కూడా లోపాల పాలయ్యే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 9వేల కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని యాజమాన్యాలు చెబుతుండగా, విద్యార్థులు విద్య కొనసాగించడానికి తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వెనుకాడుతున్నాయి. ఫలితంగా అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు చెల్లింపులు ఆలస్యమవడం వల్ల ఉపాధ్యాయులు జీతాలు సమయానికి పొందలేక నిరాశలో ఉన్నారు.నవంబర్ 1లోగా 8వేల కోట్లు ప్రభుత్వం ప్రకటించిన విధంగా చెల్లించకపోతే,3వ తేదీ నుండి కళాశాలలు మూసి వేస్తామని, మార్చి ఏప్రిల్ నెలలలో నిర్వాహించే పరీక్షలకు సహకరించేది లేదని ప్రైవేటుకళాశాలల యాజమాన్యాలు స్పష్టంచేస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టడం అనివార్యం. ఈపరిస్థితిలో పరిష్కార మార్గాలు అత్యవసరంగా అవసరం.ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తగిన బడ్జెట్ కేటాయింపులు చేసి త్రైమాసికాల వారీగా నిధులు విడుదల చేయాలి. అర్హులైన విద్యార్థుల వివరాలను పారదర్శకంగా ఆన్‌లైన్ ద్వారా ధృవీకరించి చెల్లింపులు జరగాలి. ప్రైవేట్ కళాశాలలు పూర్తిగా ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వీయ నిధులతో కొంత శాతం నిర్వహణ చేపట్టాలి.అదేవిధంగా విద్యార్థుల ఖాతాల్లో నేరుగా నిధులు జమచేసే విధానం అమలులోకి వస్తే వారు నేరుగా లబ్ధిపొందే అవకాశం ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం విద్యార్థుల భవిష్యత్తుకు ఒక శక్తివంతమైన సాధనం. కానీ సమయపాలన, పారదర్శకత, బాధ్యత లేకుంటే ఇది విద్యార్థులకే కాకుండా విద్యాసంస్థలకు, ఉపాధ్యాయులకు, సమాజానికి నష్టాన్ని కలిగిస్తుంది. అందువల్ల దీన్ని రాజకీయ వాగ్దానాల పథకంగా కాకుండా విద్యారంగ అభివృద్ధి పునాదిగా పరిగణించి అమలు చేయాలి. అప్పుడే ప్రతి విద్యార్థి తన చదువును ఆర్థిక ఇబ్బందులు లేకుండా కొనసాగించ గలుగుతాడు,ప్రతి విద్యాసంస్థ నిలదొక్కుకుంటుంది, సమాజం ముందుకు దూసుకుపోతుంది. ●

# జీవిత ఖైదుతో అవినీతి అంతం అయ్యేనా?

పూసాల సత్యనారాయణ

ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రజాప్రతి నిధులను ఎన్నుకునే విధానం ఎలాఉంది అంటే 'గొర్రెలమందకు తోడేలును కాపలపెట్టిన' చందంగా ఉంది. నేడు ప్రజలు ఓటు వేసే విధానం. ప్రభుత్వ ఉద్యోగులు సైతం పైసా లేకుండా నయాపైసాపని చేస్తే ఒట్టు. అవినీతి పరులు ప్రజల రక్తం తాగుతున్నారు.కాల్చిచంపే ఉగ్రవాదుల కన్న దేశద్రోహుల కన్న కరడు గట్టిన నేరస్థులు అంత్యంత ప్రమాదకరమైన క్రూరమృగాలు. లంచం తీసుకోకుండా గ్రామ సర్పంచి పని చేస్తాడా? ప్రభుత్వ ఉద్యోగిగాని ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులుగాని డిమాండ్ చేసినంత ముట్టచెప్పాల్సిందేనా?ఇంకెంతకాలం కొనసాగుతుంది? 'అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలుగా' వర్ధిల్లుతున్నదంటే పవిత్ర భారత దేశంలో ఉన్న బూజుపట్టిన బలహీనమైన చట్టాలే కారణం. శతాబ్దాలు గడిచినా హై టెక్నాలజీ ఆకాశమంత ఎత్తుఎదిగి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విన్యాసాలు చేసినా అవినీతిని కూకటి వేళ్ళతో పెకిలించి వారేరీ?సమాచార హక్కుచట్టం సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం ,అవినీతి అధికారులపై ఎక్కుపెట్టిన సత్పౌరుడెవ్వరు? ఉంటే 'పౌర రత్న'బిరుదుతో పాటు క్యాష్ అవార్డ్ఇచ్చి రాష్ట్రపతి గాని ప్రధాన మంత్రి గాని సన్మానం చేయాలి. అప్పుడే ప్రజలలో చైతన్యం కదలి అవినీతి కర్పూరంలా కరిగిపోతుంది.లోకపాల్,లోకాయుక్త ఉందని ప్రజలకు తెల్సా? ఏంటి కరప్షన్ బ్యూరో ఇంటెలిజెన్స్ బ్యూరో,సెంట్రల్ విజిలెన్స్ కమీషన్, దర్యాప్తు సంస్థలు నీతి నిజాయితీగా సమర్థవంతంగా స్వతంత్రంగా పని చేస్తున్నాయా? సిగ్గులేని అవినీతి అధికారులను నిగ్గ తీసి ప్రశ్నించాలి. మలినమైన మనుషులను నిప్పుకణికలతో కడగాలి. తెగించి కొట్లాడే దమ్ము,ధైర్యం ఉన్నబాహుబలి మనిషి ఉంటే ఒట్టు. 54 శాతం మంది భారతీయులు లంచం చెల్లించి పని చేయించుకొని చేతులు దులుపుకొని జారుకుంటున్నారు. ఇది కూడా ఒక నేరమేకదా! ఆర్థిక వ్యవస్థకు అవినీతి క్యాన్సర్‌గా అవతారమెత్తితేమనిషి బతికి బట్ట కట్టగలడా !180 దేశాలలో భారత దేశం అవినీతిలో 96 స్థానంలో తళతళ మెరుస్తుంది.ఇది అసమర్థత పాలనకు నిలువెత్తు నిదర్శనం కాదా! సమాజంలో అసమానతలను కాలుష్యంలా పెంచే ఈసంస్కృతి మనకెందుకు? 542 మంది పార్లమెంట్ సభ్యులలో 220 మందిపై క్రిమినల్ కేసులున్నాయి. నేరం రుజువైన వారిని జైలు నుండి బెయిల్ పై వచ్చిన వారిని పోటీ చేయుటకు అర్హత లేకుండా చట్టాలు ఎందుకు చేయడం లేదు.? ప్రశ్న ప్రశ్నగానే నిలిచిపోవాలా?ఫిన్‌లాండ్, సింగపూర్, న్యూజిలాండ్, స్వీడన్, ఆస్ట్రేలియా, దేశాలలో అవినీతి అంతం ప్రభుత్వ పంతం. కఠిన చట్టాలతో కొరడా ఝుళిపించి నిర్దాక్షిణ్యంగా కటకటాలకు నెట్టుతున్నారు. బలమైన చట్టాలతో బలాదూర్ అంటూ అని గల్లా ఎగరేసిగర్వపడుతున్నారు.అక్కడ ఆర్థిక వ్యవస్థ చిగురులు తొడిగి దీపావళి పండుగ చేసుకొంటుంది. ఇటీవల చైనాలో జరిగిన సంఘటన అవినీతి పరులగుండెల్లో రైళ్లు పరుగెత్తెలా చేసింది. ప్రపంచదేశాలకు షాక్ ఇచ్చింది.మాజీ వ్యవసాయ గ్రామీణ వ్యవహారాల శాఖా మంత్రి టాంగ్ రెన్ జియాన్' దాదాపు 337 కోట్ల అవినీతి ఉచ్చులో చిక్కుకొని నేరం రుజువైనందుకు ఆయనకు కోర్టుమరణ శిక్షవిధించింది. ఆయన పశ్చాత్తాపపడి కోర్టు విచారణకు సంపూర్ణంగా సహకరించినందులకు అక్రమంగా సంపాదించిన ఆస్తులను సొమ్మును స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పచెప్పినందులకు ఆయన మరణ శిక్షను రద్దుచేస్తూ రెండేళ్ల పాటు జైలుశిక్ష విధించినట్లు జిలిన్ ప్రావిన్స్‌లోని 'చంగ్ చున్ పీపుల్స్' కోర్టు తీర్పు వెలువరించింది.ఐతే ఉరి లేకుంటే జీవిత ఖైదీ. న్యాయ వ్యవస్థ లో అనకొండ ప్రవేశించింది. రేపిస్ట్ భూకబ్జాదారు ఆర్థిక నేరస్థుడు డేరా బాబాకు 40 రోజులు పెరోల్ 5సంవత్సరాల్లో 14వసారి పెరోల్ ఇవ్వడం ఏంటి? లోకం చుట్టిన వీరుడు ప్రధాని మోడీగారు. తన వాక్చాతుర్యంతో అత్యున్నత బిరుదులు అందుకొని భారత దేశ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పివారు. గ్లోబల్ లీడర్‌గా మొదటి స్థానంలో నిలిచి చరిత్ర సృష్టించడం భారతీయులందరికీ గర్వకారణం. ప్రధాని మోడీ గారికి "క్షణం తీరిక లేదు రూపాయి ఆదాయం లేదు ఇంటగెలిచింది లేదు గానిబయట రచ్చరచ్చ చేస్తున్నారు. పారిశ్రామిక దిగ్గజాలకు కోట్ల రుపాయలు రుణ మాఫీ చేయడం, బాంక్ ఖాతాలో మినిమం బ్యాలెన్స్ ఉంచే స్థోమత లేని పేదల నుండికోట్లు వసూల్ చేయడం న్యాయమేనా? ఓట్ చోరీతో అధికారంలోకి అడుగు పెట్టాడనే ఆరోపణ కొట్టి పడెయ్యలేము. ఈ సందర్భంగా డాక్టర్ అంబేద్కర్‌గారి మాటలు గుర్తుకు వస్తాయి." సిరా చుక్క మౌనం వహిస్తే మద్యం చుక్క రాజ్యంఏలుతుంది. మేధావులు మౌనం వహించినంత కాలం మూర్ఖులు రాజ్యం ఏలుతారు 'ఇప్పుడు అదే జరుగుతుంది. దేశ సంపద కొంత మంది చేతిలోకి పోతే ఆర్థిక క్రమశిక్షణ ఆగమైంది.అందుకే కేంద్రప్రభుత్వం 200 లక్షల కోట్లు అప్పు చేసింది.కాకులను కొట్టి గద్దలకు వేయడం అంటే ఇదేనేమో! కేంద్రంతో దోస్తీ చేస్తేనే కేంద్ర నిధులు అందుతాయా ! కేంద్రానికే జాతీయ గీతం ఉందా?ప్రజాస్వామ్యంలో పక్షపాత వైఖరి రాజ్యాంగ విరుద్ధం కాదా! కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలలో అవినీతి తీవ్ర స్థాయిలో ఉన్నట్లు సర్వేలు తేటతెల్లం చేస్తున్నాయి. నీతి నిజాయితీ మానవీయ విలువలు పాఠశాల కళాశాల స్థాయిలో పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి. అవినీతి నిర్మూలన చట్టాల మీద సదస్సులు సమావేశాలు నిర్వహించాలి. నిజాయితీ గలవారికి అవార్డ్ ఇచ్చి ప్రోత్సహించాలి.అధికారులలో జవాబుదారీతనం ఉండాలి.పారదర్శకత పెరగాలి. డిజిటల్ టెక్నాలజీ వినియోగించి అవినీతిని అరికట్టేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి.అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని చట్టసభలలో అడుగు పెట్టనీయకూడదు. అవినీతి రుజువైతే అక్రమార్జన సొమ్ము ప్రభుత్వాలు స్వాధీనం చేసుకొని జీవిత ఖైదీ శిక్షవిధించితే అవినీతి అడ్రస్ లేకుండాపోతుందనిసామాన్య మానవుడు అనుకోవడంలో తప్పులేదు.ఆర్థికంగాబలపడితేనే దేశం అన్ని కోణాలలో అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.ఆ రోజులు తప్పని సరిగా వస్తాయని ఆశిద్దాం. ●

# ప్రజావాక్కు



## సాంకేతికత అవసరం

హైదరాబాదు నుండి బెంగళూరుకు వెళ్తున్న కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ వోల్వో బస్సు ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి మంటలు చెలరేగి, క్షణాల్లోనే అగ్నికి ఆహుతైంది. మొత్తం44మంది ప్రయాణికుల్లో కనీసం20మంది ప్రాణాలు కోల్పోగా,పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రాథమిక విచారణ ప్రకారం,ఢీకొన్న బైక్ బస్సు కింద చిక్కుకోవడంతో స్పార్క్‌లు పుట్టి మంటలు చెలరేగాయి. రాత్రి మూడుగంటల సమయంలోఎక్కువమంది ప్రయాణికులు నిద్రలో ఉండటం,అత్యవసర ద్వారాలు సకాలంలో పనిచేయకపోవడం, బస్సులో ఎలక్ట్రికల్ మార్పులు ఉండటం వంటి అంశాలు ప్రాణనష్టాన్ని మరింత పెంచాయి. ఈ ఘటనఒక్కసారిగా జరిగిన అనర్థంమాత్రమే కాదు భారత రోడ్డు భద్రతా వ్యవస్థలో ఉన్నలోపాలను మళ్లీ బహిర్గతం చేసింది. అతివేగం,డ్రైవర్ అలసట, తగిన పర్యవేక్షణ లేకపోవడం, నిబంధనలు కేవలం పత్రాలకే పరిమితమవడం వంటి కారణాలు ఇప్పటికీ అనేకప్రాణాలను తీస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## యూనివర్సిటీ శుభ్రతను కాపాడాలి

ఉత్తరతెలంగాణ జిల్లాలో పెద్దదైన కాకతీయ యూనివర్సిటీలో నిత్యం వేలాదిమంది నడకదారులు, యోగా చేసే వారు సైకిల్ వాకర్స్ యూనివర్సిటీ లోపల పచ్చని చెట్ల మధ్య ప్రకృతిలో సేదతీరుతారు. అదేవిధంగా కిలోమీటర్ల కొద్ది వాకింగ్ చేస్తూ తమఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. ప్రతిరోజు నిత్యం 2000 నుంచి 5000 వరకు ఈ ప్రాంతంలో వాకింగ్ చేస్తారు యూనివర్సిటీ ప్రధాన రహదారివెంబడి చెత్తాచెదారంతో అపరిశుభ్రంగాఉండడం వల్ల నడకదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి

## ఎల్ఐసిపై వాషింగ్టన్ పోస్ట్ ఆరోపణలు

వాషింగ్టన్ పోస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాపై ఆధారరహిత ఆరోపణలు చేసింది, దాని విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నంగాకనిపిస్తోంది. వాషింగ్టన్ పోస్ట్ లాంటి మీడియా సంస్థలు కుట్ర చేస్తున్నాయని, భారతీయ మీడి యా విచక్షణ లేకుండా ఈ ఆరోపణలను ప్రసారంచేస్తూస్వయం నష్టంకలిగిస్తోందని అనిపి స్తుంది. ఆరోపణలు ఆధారరహితంగా, అతిశయోక్తిగా ఉన్నాయి.

- ఎ.రఘునాథ రెడ్డి, కడప

## అత్యాచారాలు ఆపలేమా?

మన దేశం సంస్కృతి, సంప్రదాయాల పరంగా ప్రపంచంలో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. 'మాతృదేవోభవ' స్త్రీను గౌరవించు' అని చెప్పేనేటి రోజుల్లో మహిళలపై చిన్నారులపైనా, దివ్యంగులపైనా, వృద్ధులపైనా జరుగుతున్న అత్యాచారాలు, దాడులు మనసును కలచివేస్తున్నాయి. ఇది మన సమాజం మీద ఒక నల్ల మచ్చగా మారింది.మహిళ అనేది కేవలం ఒక వ్యక్తి కాదు. ఆమె తల్లి, అక్క,చెల్లి, భార్య,స్నేహితురాలు, గురువుగా కూడా మన జీవితంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఆమెకు గౌరవం ఇవ్వడం అనేది మన అందరి నీతిపరమైన బాధ్యత. అయితే, కొన్ని మానవతా విలువలు కోల్పోయిన వ్యక్తులు స్త్రీని కేవలం వస్తువుగా చూసిహింసకు,దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఇది అత్యంత దారుణమైన,మానవతను అవమానపరిచేచర్య. మహిళలపైదాడులు ఆగాలంటే ప్రతిపౌరుడుబాధ్యతగా వహరించాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## తెలంగాణ అభివృద్ధికి నూతన దిశ

తెలంగాణ ప్రభుత్వం నవంబర్‌లో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సును నిర్వహించేందుకు సిద్ధమవ్వడం రాష్ట్ర అభివృద్ధి దిశలో ఒక ప్రగతిశీల అడుగుగా చెప్పుకోవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి చేస్తున్న కృషి తెలంగాణ భవిష్యత్తుకు కొత్త దిశను చూపగల సామర్థ్యం కలిగి ఉంది.'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు, మూసి నది పునరుజ్జీవన ప్రణాళిక వంటి భారీ ప్రాజెక్టులు ప్రపంచ పెట్టుబడిదారులకు ఆకర్షణీయంగా మారేఅవకాశంఉంది.ఈరెండు ప్రాజెక్టులు హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చి పెట్టే సామర్థ్యంతో పాటు, పర్యావరణ పరిరక్షణ, పర్యాటక అభివృద్ధికి కొత్త మార్గాలను సుగమం చేస్తాయి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## కార్మికులకు రక్షణ పరికరాలు అందించాలి

వంతెనలు భూగర్భ కాలువలలో పని చేసే కార్మికులు అత్యంత దారుణమైన పరిస్థితుల్లో తమ విధులను నిర్వహిస్తుంటారు. భయంకరమైన దుర్వాసన మనుషుల మల విసర్జన ప్రవాహంలో పనిచేస్తూ నిర్మిస్తుంటారు. వీరికి దుర్వాసన నుండి అరికట్టడానికి ముఖానికి మాస్కులు చేతులకు గ్లౌజులు కాళ్ల రక్షణకు పొడవైన బూట్లుఉండవు.ఈపనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియలో తప్పకుండా కార్మికులకు అత్యంత నాణ్యమైన తగు రక్షణ పరికరాలు సమకూర్చటకు పొందుపరచాలి.

- దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రేపల్లె రైళ్ళు రద్దు...

రేపల్లె, అక్టోబరు 27, ప్రభాతవార్త: తుఫాన్ కారణంగా ఈ నెల 28వ తేదీ తెనాలిరేపల్లె(67231), రేపల్లెతెనాలి(67232), తెనాలిరేపల్లె(67233), రేపల్లెగుంటూరు(67234), తెనాలి రేపల్లె(67237), రేపల్లెమార్సాపూర్ రోడ్(67238) రైళ్ళు, ఈ నెల 29వ తేదీ వరకు గుంటూరు రేపల్లె(67249), రేపల్లెగుంటూరు(67250) ప్యాసింజర్ రైళ్ళను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే శాఖ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ సోమవారం ప్రకటించారు. రైల్వే ప్రయాణికులు గమనించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

విజయవాడ వార్త





రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టుల పనుల పురోగతిపై సచివాలయంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రం (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)

## పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా చూసుకోవాలి : మున్సిపల్ కమీషనర్

విజయవాడ కార్పొరేషన్, అక్టోబరు 27, ప్రభాతవార్త: పునరావాస కేంద్రాల్లో ఎటువంటి లోపం ఉండరాదని, అక్కడకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా చూసుకోవాలని వారందరికి సమయానికి ఆహారం అందేటట్లు చూసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఆయన కృష్ణవేణి స్కూల్ రోడ్, పటమట



వీఎంసి పాఠశాల, సత్యన్నారాయణపురం, ఏలూరు రోడ్, వన్‌టౌన్ గాంధీజీ మున్సిపల్ స్కూల్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలుత కృష్ణవేణి స్కూలు రోడ్‌లో జరుగుతున్న అవుట్‌ఫాల్ డ్రైన్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ సర్కిల్, పటమట బెంజిసర్కిల్ వద్ద వర్షపు నీటి నిల్వలు ఉండకుండా శాశ్వత పరిష్కారంలో భాగంగా నిర్మిస్తున్న అవుట్‌ఫాల్ డ్రైన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొంథా తుఫాను నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆయన పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా పటమట లోని వీఎంసి స్కూల్, సత్యన్నారాయణపురం ఎబిటిపి స్కూల్, వన్ టౌన్ గాంధీజీ మున్సిపల్ హైస్కూలులో పునరావాస కేంద్రాలను పరిశీలించారు. పునరావాస కేంద్రాలన్నీ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం గాంధీజీ మున్సిపల్ హైస్కూలు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. అన్న క్యాంటీన్‌కు వచ్చే ప్రజలతో మాట్లాడి అన్న క్యాంటీన్‌లో ఉన్న వసతులపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో త్రాగునీరు, వాడుకనీరు సరఫరాలో అంతరాయం ఉండరాదని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అడిషనల్ కమీషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్‌రత్నకుమార్, జోనల్ కమీషనర్లు కె.షమ్మి, కె.ప్రభుతేజ్, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె.శ్రీనివాస్, వి.శ్రీనివాసరెడ్డి, జి.సామ్రాజ్యం సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు 168 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసే అవకాశం : ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్, అక్టోబరు 27, ప్రభాతవార్త: నేడు జిల్లాలో ముఖ్యంగా విజయవాడ నగరంలో సుమారు 162 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిందని, అందువలన జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రజలందరూ ఇళ్ళల్లోనే ఉండాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీ షా ఆదేశాల మేరకు అన్ని దుకాణాలు, వాణిజ్య సముదాయాలను మూసివేయాలని, ప్రజల రక్షణార్థం ఈ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అత్యవసర సేవల కోసం మాత్రమే (ఆరోగ్య సేవలు, ఆహార సేవలు మొదలైనవి) బయటకు రావాలని, మెడికల్ షాపులు, కూరగామలు, పాల విక్రయ కేంద్రాలు వంటి అవసరమైన సేవా కేంద్రాలు మాత్రమే తెర్చి ఉంచాలని అనవసర ట్రాఫిక్ రద్దీని నివారించాలన్నారు. అవసరం లేని ప్రయాణాలు, షాపింగ్, వినోదం, ఉదయపు నడకలు, పార్కుల సందర్శనలు మొదలైనవి పూర్తిగా నివారించాలని ప్రజలను ఆయన కోరారు. ప్రజలందరూ ఈ హెచ్చరికలను గౌరవించి జాగ్రత్తగా ఉండాలని, సురక్షితంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో డిస్ట్రిక్ట్ కమాండ్ కంట్రోల్ రూం 9154970454, వీఎంసి కంట్రోల్ రూం 08662424172, 0866 2422515, 0866 2427485లను సంప్రదించాలని ఆయన కోరారు.

## బంగారపు వస్తువులను చోరీ చేసిన పనిమనిషి అరెస్ట్

విజయవాడ కార్పొరేషన్, అక్టోబరు 27, ప్రభాతవార్త: సూర్యారావుపేట, చిలుకు దుర్గయ్య వీధి ప్రాంతానికి చెందిన ఫిర్యాది సూర్యారావుపేట పోలీసులకు తన ఇంటిలో 850 గ్రాముల బంగారపు వస్తువులను ఎవరో దొంగిలించారని ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఈస్ట్ జోన్ ఇన్చార్జి డిసిపి కెజివి సరిత సూచనలతో సౌత్ ఏసిపి డి.పావన్‌కుమార్ పర్యవేక్షణలో సూర్యారావుపేట సిఐ షేక్ అహ్మద్ ఆలీ, వారి సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి, అక్కడ సేకరించిన ఆధారాలను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని అనుమానితులు, పాత నేరస్థుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. కొద్ది గంటల వ్యవధిలోనే సూర్యారావుపేట సిఐకి రాబడిన సమాచారం మేరకు సోమవారం మధ్యాహ్నం, సాంబమూర్తి రోడ్డులో గతంలో ఫిర్యాది ఇంటిలో పనిచేసి మానివేసిన మహిళను అదుపులోకి తీసుకొని విచారించి ఆమెను అరెస్ట్ చేసి ఆమె నుంచి



చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితురాలు, విజయవాడ మారుతీనగర్ ఏరియాకు చెందిన చీపురుపల్లి సుమలత అలియాస్ లత అని తేలింది. గత కొంత కాలంగా ఇళ్ళల్లో వంట ఇంటి పనులు చేసుకుంటూ జీవించేది. ఈ క్రమంలో సదరు మహిళ సుమారు 2 సంవత్సరాల క్రితం తెలిసిన వారి ద్వారా సూర్యారావుపేట, చిలుకు దుర్గయ్య వీధి లోని ఫిర్యాది ఇంటిలో వంట, ఇంటి పనులు చేయడానికి చేరింది. ఈ క్రమంలో ఆ ఇంటిలో చాలా బంగారపు వస్తువులు ఉన్నాయని గ్రహించి ఏ విధంగానైనా ఆ బంగారు నగలను దొంగిలించాలని నిర్ణయించుకొని మొత్తం ఒక్కసారే దొంగతనం చేస్తే అనుమానం వస్తుదని ఇంటిలో పని ముగించుకొని తన ఇంటికి వెళ్ళే సమయంలో అవకాశం దొరికినప్పుడల్లా ఒక్కో బంగారపు వస్తువులు తీసుకొని వెళ్ళిపోయేది. ఆ విధంగా సదరు మహిళ ఆ ఇంటి నుంచి 837 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేసింది. ఇంకా ఇక్కడే పని చేస్తే ఎక్కడ అనుమానం వచ్చి దొరికిపోతాననే భయంతో సుమారు ఆరు నెలల క్రితం తన తండ్రి చనిపోవడంతో ఆరోగ్యం బాగోలేదని ఆ ఇంటిలో పని చేయడం మానివేసింది. ఈ క్రమంలో ఈ నెల 26న ఫిర్యాది కుంటుంబం ఒక ఫంక్షన్‌కు వెళ్ళుటకు బంగారు ఆభరణాలను వెతకగా కనిపించకపోవడంతో ఆ రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. దర్యాప్తు అధికారి సంఘటనా స్థలాన్ని పరిశీలించిన తర్వాత ఎవరో తెలిసిన వారే చోరీ చేసినట్లు గుర్తించి అనుమానితులైన వారిని విచారించారు. ఈ క్రమంలో గతంలో పనిచేసి మానేసిన చీపురుపల్లి సుమలతను అదుపులోకి తీసుకొని విచారించగా తానే చోరీ చేసినట్లు ఒప్పుకుంది. ఆమె నుండి చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అతి తక్కువ సమయంలో కీలక ఆధారాలు సేకరించడంతో పాటు నిందితురాలిని అదుపులోకి తీసుకొని, చోరీ వస్తువులను పూర్తిగా రికవరీ చేయడంలో కీలకంగా వ్యవహరించిన సౌత్ ఏసిపి డి.పావన్‌కుమార్, ఎస్ఆర్ పేట సిఐ షేక్ అహ్మద్ ఆలీ వారి సిబ్బంది పోలీసు అధికారులు ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యరకమంలో డిసిపి కెజివి సరిత, కె.తిరుమలేశ్వరరెడ్డి, క్రైం ఏడిసిపి ఎం.రాజారావు, సౌత్ ఏసిపి డి.పావన్‌కుమార్, ఎస్ఆర్‌పేట సిఐ అహ్మద్ ఆలీ, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యలవాడలో ఉదయించిన విద్యాకిరణం



పెనమలూరు, అక్టోబరు27ప్రభాతవార్త : విద్యలవాడ విజయవాడలో ఉదయించిన విద్యాకిరణం సూర్యవిద్యానికేతన్ పాఠశాలకు రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మకమైన ఎడ్యూకాన్2025 అవార్డు వరించిందని డెరెక్టర్ అబ్రార్‌అలీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లా బ్యూరోఆఫ్ చైల్డ్ డెవలెప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నం మ్యారియట్‌లో ఈ ఎంపికను ఘనంగా నిర్వహించారని తెలిపారు. పార్లమెంటుసభ్యులు, గీతం యూనివర్సిటీ అధినేత మతుకుమిల్లి భారత్ చేతులమీదుగా అవార్డును అందజేసారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలియజేసారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ

తిరువూరు, అక్టోబరు 27, ప్రభాతవార్త :తిరువూరు మండలం ఎర్రమాడు గ్రామంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న తిరువూరు మండల పార్టీ అధ్యక్షుడు తాళ్లూరి నవీన్ కుమార్ జిల్లా మున్సిపల్



విభాగ ప్రధాన కార్యదర్శి మోదుగు ప్రసాద్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బొర్రా మోహన్ రావు గ్రామ సర్పంచ్ బొర్రా మాధవి బొర్రా వీరఆంజనేయులు చలివేంద్ర శేషు, పృధ్వీ, వేము నాగరాజు చల్లా ముత్తు పగిడిమర్రి పవన్ కుమార్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



మొంథా తుపాను ప్రభావంపై సోమవారం సచివాలయం నుంచి సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)

## వినగడప కట్టలేరుపై బ్రిడ్జి నిర్మాణం జరపాలని సిపిఎం ర్యాలీ

ఎ కొండూరు, అక్టోబరు 27, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం మండలం వినగడప ఆర్ అండ్ బి రాష్ట్ర రహదారిపై సుమారు 7 సంవత్సరాల క్రితం ధ్వంసమైన బ్రిడ్జి స్థానంలో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బందులను కష్టాలను తొలగించి వెంటనే హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ప్రజా సంఘాలు వినగడప వద్ద కూలిన బ్రిడ్జి స్థానం నుండి తిరువూరు ఆర్డీవో ఆఫీసు వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు.




ఈ బ్రిడ్జి ఎగువ రాష్ట్రాల్లో కురిసే వర్షాల వరద ఉధృతికి కొట్టుకుపోయి ఏడేళ్లయినా లక్షలాది రూపాయల వ్యయంతో తాత్కాలిక మరమత్తులు చేయడం తిరిగి భారీ వర్షాల వల్ల వరద ఉధృతికి తాత్కాలిక మరమత్తుల అప్రోచ్ కొట్టుకుపోవడం గత 7 ఏళ్ల నుండి ఆర్ అండ్ బి అధికారులు మీనమేషాలు లెక్కించడం తప్ప శాశ్విత హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడం ప్రభుత్వం అధికారుల నిర్లక్షం కొట్టోచినట్లుగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ ర్యాలీ ప్రారంభించిన అనంతరం పాలకుల నిర్లక్ష్య తీరును ఎండగట్టారు. ఈ హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కొరకు గత వైసిపి అంతకు ముందు టిడిపి ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు కావస్తున్నా ప్రజా ప్రతినిధులు కూలిన బ్రిడ్జి ప్రాంతాన్ని సందర్శించి వెళ్లడం తర్వాత పోలీసులు స్టాపర్‌లు ఏర్పాటు చేసి రవాణా వ్యవస్థ జరుగకుండా ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం తప్ప శాశ్విత హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని ఆర్డీవోకు అందచేశారు. నాయకులు కార్యకర్తలు పాల్గొని బైక్ ర్యాలీ నిర్వహించారు.

## టిడిపి రైతు విభాగ అధ్యక్షుడు చెరుకూరి జన్మదిన వేడుకలు

తిరువూరు, అక్టోబరు 27, ప్రభాతవార్త : తిరువూరు టౌన్ మండల పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా తెదేపా సీనియర్ నాయకులు తెలుగు రైతు విభాగ అధ్యక్షులు చెరుకూరి రాజేశ్వరరావు జన్మదిన వేడుకలు తెదేపా నేతలు అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కటింగ్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అభిమానులు జన్మదిన పూల బొకేలు



ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతూ శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దుబ్బాకు వెంకటేశ్వర్లు బాణావత్ ఫీక్లా నాయక్ రాయల సుబ్బారావు పట్టణ తెదేపా అధ్యక్షులు మల్లెల శ్రీనివాసరావు మండల ప్రధాన కార్యదర్శి తెలప్రోలు మోహన్‌రావు నడిమ్‌తిరువూరు పాక్స్ అధ్యక్షులు కంచి రఘు ప్రవీణ్ (బాబీ) పట్టణ ప్రధాన కార్యదర్శి పరిసె రామలింగేశ్వరరావు (రామా) కౌన్సిలర్లు అబ్దుల్ హుస్సేన్ నాళ్ళా సురేంద్ర మూడు దుర్గారావు తెదేపా నేతలు తాళ్ళూరి రామారావు దొడ్డ మాధవరావు కోమటి వెంకటరామారావు మోదుగు వెంకటేశ్వరరావు కామాల రామారావు మాజీ ఎంపీపీ గద్దె వెంకన్న జనసేన సీనియర్ నాయకులు లింగినేని సుధాకర్, మహిళలు బలమూరి నాగపద్మ, కొలికపోగు రామకోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

అమరావతి, ప్రభాతవార్త అక్టోబర్ 27 : విజయవాడ: విద్యార్థులకు కంటి ఆరోగ్యం, సంరక్షణపై అవగాహన కల్పించడమే ధ్యేయం గామ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఖీసీవీఎస్, రిఫ్రాక్టివ్ ఎర్రర్స్ పై అవగాహన కార్యక్రమం ప్రారంభించినట్టు విజయవాడ మ్యాక్సీ విజన్ ఐ హాస్పిటల్స్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ స్వాతి పిన్నమనేని తెలిపారు. ఈ అవగాహన సభలో ఆమె మాట్లాడుతూ కళాశాల విద్యార్థులలో పెరుగుతున్న కంప్యూటర్ విజన్ సిండ్రోమ్, రిఫ్రాక్టివ్ ఎర్రర్స్ అనగా అధిక స్క్రీన్ వినియోగం, మారుతున్న జీవనశైలి తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నామన్నారు. ముందుగానే కంటి సమస్యలను గుర్తించడం, కంటి సంరక్షణ, ఆరోగ్యకరమైన స్క్రీన్ అలవాట్ల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలియజేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని చెప్పారు. ఈ ప్రచారం ద్వారా మ్యాక్సివిజన్ 10 కళాశాలల్లో 5,000 మందికి పైగా విద్యార్థులకు చేరుకోవాలని యోచిస్తోందన్నారు.

## 40వేల గృహాలకు క్రాంప్టన్ గ్రీవ్స్ సోలార్ రూఫ్‌టాప్

అమరావతి, ప్రభాతవార్త అక్టోబర్ 27: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గణనీయమైన సోలార్ రూఫ్‌టాప్ ఆర్డర్‌ను పొందడం ద్వారా తన సోలార్ ప్రయాణంలో ప్రధాన మైలురాయిని సాధించామని క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ సిఇఒ మిస్టర్. ప్రోమీత్ ఘోష్, మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. ఈ ఆర్డర్ సమీప కాలంలో 2 కిలోవాట్ల ఆన్‌గ్రిడ్ రూఫ్‌టాప్ వ్యవస్థలతో 40,000 గృహాలను కవర్ చేయడం ద్వారా, సౌరశక్తిని అందిస్తామన్నారు. 77 మెగావాట్ల విలువైన ఈ మైలురాయి ఆర్డర్ మొత్తం రూ. 445 కోట్లు అన్నారు.

## మేక్‌మైట్రిప్ ట్రావెల్ కా ముహూరత్ ప్రారంభం

విజయవాడ,, ప్రభాతవార్త అక్టోబర్ 27 : భారతదేశంలోని ప్రముఖ ఆన్లైన్ ట్రావెల్ కంపెనీ మేక్‌మైట్రిప్, భారతీయుల సంవత్సరాంత ప్రయాణ సీజన్ ప్రారంభానికి గుర్తుగా రూపొందించిన కొత్త క్యాలెండర్ మూమెంట్ ట్రావెల్ కా ముహూరత్‌ను ప్రారంభించిందని ఈ నెల 29 నుండి నవంబర్ 30, వరకుఆ సంస్థ ప్రతినిథులు ప్రకటించారు. ఇందులో భాగంగా, విమానాలు, హోటల్ వసతులు, హాలిడే ప్యాకేజీలు, గ్రౌండ్ ట్రాన్స్‌పోర్ట్, పర్యటనలు, ఆకర్షణలు వంటి సేవలతో పాటు వీసా, ఫారెక్స్, ట్రావెల్ ఇన్సూరెన్స్ వంటి ప్రయాణ నిత్యావసరాలను కూడా కలిపి, భారతదేశం, విదేశాలలోని ప్రముఖ విమానయాన సంస్థలు, హాస్పిటాలిటీ బ్రాండ్లు, ప్రధాన బ్యాంకింగ్ భాగస్వాములతో కలసి ప్రయాణికులకు అత్యున్నత విలువను అందిస్తామన్నారు.

## కర్నూలులో బస్సు ప్రమాదంపై వైకాపా దుష్ప్రచారం

### శవరాజకీయాలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్న వైకాపా -మీడియాలో సమావేశంలో ఎమ్మెల్సీ ఆలపాటి

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 27: జగన్మోహన్ రెడ్డి నీచ శవ రాజకీయాలు పరాకాష్టకు చేరాయని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విమర్శించారు. ప్రభుత్వ విధానాలను విమర్శించొచ్చు, ప్రభుత్వ పరంగా రాజకీయం చేస్తే తప్పు లేదు కానీ దుర్ఘటనలు, మరణాలపై రాజకీయం చేయడం దారుణమని మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడిన ఆయన... కర్నూలు బస్సు యాక్సిడెంట్..అందర్నీ కలిచివేసిందన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం తెలియజేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుందన్నవారు. దుబాయ్ లో ఉన్న సీఎం చంద్రబాబు వెంటనే స్పందించారన్నారు. మంత్రులు ఘటన స్థలానికి వెళ్లి... సహాయక చర్యలు జరిగేలా చూశారు. బాధితులకు ధైర్యం చెప్పారన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని సహాయక చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీలు అని తేడా లేకుండా స్పందించాల్సిన సమయంలో వైసీపీ పార్టీ మాత్రం నీచ రాజకీయాలను ఎంచుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శవ రాజకీయాలు చేయడమే వైసీపీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కర్నూలు బస్సు ప్రమాద విషయంలో వైసీపీ, సాక్షి మీడియా అనేక



తప్పుడు కథనాలు సృష్టిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు కథనాలు రాస్తున్న మీడియా ఛానెల్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బైకర్ బెల్టు షాపులో మద్యం కొనలేదు రాష్ట్రంలో అర్ధరాత్రి బెల్టు షాపులు నడుస్తున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది పూర్తిగా అవాస్తవం. చనిపోయిన బైకర్, మద్యన్ని బెల్ట్ షాప్‌లో కాదు, ప్రభుత్వ అనుమతి పొందిన లైసెన్స్‌డ్ దుకాణం నుంచే కొనుగోలు చేసినట్టు సీసీటీవీ ఫుటేజీలో ఉందన్నారు. అది కూడా రాత్రి 8 గంటలు ఆ సమయంలో కొనుగోలు చేసినట్లు తెలుస్తోందన్నారు. నిందితుడు కొనుగోలు చేసిన షాపు రోడ్డుకు చాలా దూరంలో ఉందన్నారు. నిబంధనలు ప్రకారమే రాష్ట్రంలో మద్యం షాపులు నడుస్తున్నాయని ఆలపాటి అన్నారు. బస్సుకు పర్మిట్ లేదన్నారు బస్సు ప్రమాదంలాంటి కష్ట కాలంలో సాయం చేయాల్సింది పోయి... అసత్య ప్రచారాలు చేయడం బాధకరమని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. బస్సుకు పర్మిట్, లైసెన్స్, ఇన్సూరెన్స్ సరైన పత్రాలు లేవని తప్పుడు కథనాలు రాస్తున్నారని మండిపడ్డారు. సిద్ధాంతపరంగా రాజకీయ పోరాటాలు చేయెచ్చు కానీ ఇలాంటి విషయంలో రాజకీయాలు చేస్తారా? అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో కల్తీ మద్యంతో చాలా మంది చనిపోయారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో వైసీపీ పార్టీ నాయకులు జైలుకు వెళ్లారని.. మద్యం కుంభకోణాలు, కల్తీ మద్యం అంశం పక్కదోవ పట్టించడానికి కర్నూలు బస్సు ప్రమాదం ఎంచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పోలవరం కాపర్ డ్యామ్, అమరావతిపై కూడా ఇలానే తప్పుడు ప్రచారాలు చేశారన్నారు. ఉద్యోగులకు డీఏ ఇవ్వలేదని ప్రచారం చేశారన్నారు. ప్రభుత్వ ధనం ఎలా దోచుకోవాలో వైసీపీ వాళ్లకే తెలిసిన విద్య అని.. పార్టీ కార్యకర్తను కారుతో తొక్కించిన చరిత్ర వైసీపీ పార్టీదని తీవ్రంగా విమర్శించారు. తప్పుడు ప్రచారాలు చేస్తోన్న మీడియాలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## తుపానును ఎదుర్కొనేందుకు యంత్రాంగం ఏకతాటిపై నిలవాలి: కలెక్టర్ లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు

విజయవాడ, ప్రభాతవార్త అక్టోబర్ 27: తుపానును ఎదుర్కొనేందుకు యంత్రాంగం ఏకతాటిపై నిలవాలి: కలెక్టర్ లక్ష్మీ ృశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు లు అన్నారు. విపత్తు స్పందనలో అన్ని శాఖల సిబ్బంది సమష్టిగా పాల్గొనాలి డివిజన్, మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీ ృ శా అన్నారు. సోమవారం విజయవాడలో ఆయన అధికారులతో సమీక్షచేసి మాట్లాడుతూ ప్రతి సచివాలయానికి ఒక పోలీస్ ను కేటాయించాలి ప్రజలు ఖాళీ చేసిన ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి జేసీబీలు, డ్రోన్లను అందుబాటులో ఉంచుకోవాలి అని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబుజిల్లాలోని అన్ని శాఖల సిబ్బంది పూర్తి సమన్వయంతో, ఏకతాటిపై ఉండడం ద్వారా మొంథా తుపానును సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీ ృశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. స్థానిక కలెక్టరేట్లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఆర్డీవోలు, పోలీసు అధికారులతో కలెక్టర్, పోలీస్ కమిషనర్ దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీ ృశ మాట్లాడుతూ.... ప్రతి గ్రామం, మండలం, పట్టణంలో ప్రత్యేక ప్రతిస్పందన బృందాలు (రెస్పాన్స్ టీమ్స్) ఉండాలన్న గౌరవ ముఖ్యమంత్రి సూచన మేరకు ఇప్పటికే బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. వారంతా క్షేత్రస్థాయిలో పర్యటించి, తుపాను ముప్పు ఉన్న ప్రజలను సురక్షి త ప్రాంతాలకు తరలించాలన్నారు. ఇళ్లను వదిలి రావడానికి ఇష్టపడని వారిని తుపాను ప్రమాద తీవ్రత తెలిపి ఒప్పించాలని సూచించారు. మైకులలో అనౌన్స్ మెంట్ ద్వారా ప్రజలకు తుపాను ప్రమాద తీవ్రతను తెలియజేయాలన్నారు. తహసిల్దారులు, పోలీస్ సిబ్బంది కలసి తుపాను ప్రభావిత ప్రాంతాలలో పర్యటించాలన్నారు. గర్భిణులు, అనారోగ్యంగా ఉన్న వారిని వెంటనే తరలించాలని చెప్పారు. పాత వీడియోలతో తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే వారిపై దృష్టిపెట్టాలని.. తప్పుడు ప్రచారంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యే ప్రమాదం ఉందని, ఈ అంశంపై దృష్టి సారించాలని చెప్పారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ... కొండ చరియల ముప్పు ఉన్న ప్రాంతాల్లో 365 ఇండ్లు, శిథిలావస్థలో ఉన్న 7 ఇండ్లను గుర్తించినట్లు చెప్పారు. ఆ ఇళ్లలోని ప్రజలను ఒప్పించి పునరావాస కేంద్రానికి తరలించాలన్నారు. వాగులు, వంకలు పొంగినప్పుడు ప్రమాదాలు సంభవించకుండా ముందస్తుగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రోప్ లు కట్టాలని చెప్పారు. డ్రోన్లను వినియోగించాలని, అవసరమైన ట్రాక్టర్లు, జెసిబిలను ముందే సమకూర్చుకోవాలని సూచించారు. తప్పుడు వార్తలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు ఖాళీ చేసిన ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. కొండ ప్రాంతాలు, బుడమేరు పై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. సమిష్టి కృషితో తుపానును సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని, ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ (జేసీ) ఎస్.ఇలక్కియ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్వో ఎం.లక్ష్మీ ృనరసింహం, కే ఆర్ సి సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, డిసిపిలు సరిత, తిరుమలేశ్వర్ రెడ్డి, ఉమామహేశ్వరరాజు, ఏసీపీ భానుప్రకాశ్‌రెడ్డి, ఏసీపీ పావన్ కుమార్, డి ఆర్ డి ఏ పీడీ నాంచారరావు, డ్వామా పీడీ ఎ.రాము వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పొన్నూరు, అక్టోబరు 27,ప్రభాతవార్త: మొంథా తుఫాను కారణంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్థకశాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి కెవివి సత్యనారాయణ సూచించారు. మండల పరిధిలోని వెల్లలూరు గ్రామంలో పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఎలాంటి ఉపద్రవం వచ్చినా ప్రజలు ఎదుర్కొనేవిధంగా సిద్ధంగా ఉండాలన్నారు. పూరి గుడిసెల్లో ఉండేవారు గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి రావాలని కోరారు. గ్రామంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అవసరమైన చోట కచ్చా డ్రెయిన్లను తవ్వాలన్నారు. తాగునీటిని ఎప్పటికప్పుడు ఓవర్ హెడ్ ట్యాంకుకు ఎక్కించాలన్నారు. పారిశుద్ధ్య నిర్మూలనకు అవసరమైన పరికరాలను, బ్లీచింగ్, సున్నం, తదితరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాలను పరిశీలించిన ప్రత్యేకాధికారి ఉపాధ్యాయులు కూడా ప్రజలకు అవసరమైన చేయూత నందించేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులున్నారు.

## ప్రతిభ కనబరచిన కరాటే ఫైటర్స్



పొన్నూరు, అక్టోబరు 27,ప్రభాతవార్త: ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని కరాటే మాస్టర్ మస్తాన్ అన్నారు. గుంటూరు జిల్లా, మంగళగిరిలో జరిగిన 16వ అంతర్జాతీయ ఆహ్వాన జపాన్ షిటోరియా కరాటే ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణపురి క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనపరచి ఏకంగా 33పతకాలను సాధించారు. ఈ సందర్భంగా మాస్టర్ మస్తాన్ మాట్లాడుతూ తమ డోజోకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పతకాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించడమే కాకుండా రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పొన్నూరు కరాటే ఫైటర్స్‌ను నిలబెట్టడమే లక్ష్యంగా పయనిస్తామన్నారు. కరాటే ఫైటర్స్ 24మందిలో 33పతకాలు సాధించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారన్నారు. 16బంగారు పతకాలు,8రజత పతకాలు, 9కాంస్య పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను కోచ్ మస్తాన్‌ను పలువురు పెద్దలు, క్రీడాకారుల తల్లిదండ్రులు అభినందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్ యర్రా నాగేశ్వరరావు తదితరులున్నారు.

## పోలింగ్ బూత్‌లను జడ్పీ పాఠశాలలోనే కొనసాగించాలి



పొన్నూరు, అక్టోబరు 27,ప్రభాతవార్త: ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బూత్‌లను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే కొనసాగించే విధంగా అధికారులు ఆలోచించాలని వెల్లలూరు గ్రామ సర్పంచి ఇక్కుర్తి మల్లికార్జునరావు, వైకాపా నాయకులు తహశీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఆలేటి మాధవికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని నడిబొడ్డున ఉన్న మండల పరిషత్ స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో గతంలో పోలింగ్ నిర్వహించేవారన్నారు. అయితే ఆ పాఠశాల చాలా ఇరుకుగా ఉండడంతో ఓటు సేవారికి, ఓటు వేసి బయటకు వచ్చేవారికి ఒకే ద్వారం కావడంతో కొంత ఇబ్బంది కలగడంతోపాటు శాంతిభద్రతల సమస్య కూడా తలెత్తేదన్నారు. అంతేకాకుండా పాఠశాల చుట్టూ నివాస గృహాలు ఉండడంతో జనం గుమిగూడి ఉండడం, ఏదైనా గొడవ జరిగినప్పుడు అందరూ ఒకేసారి మూగేవారన్నారు. దీంతో శాంతిభద్రతల సమస్య తలెత్తేదన్నారు. జీబీసీ రహదారికి పక్కనే ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలకు మార్చడం వల్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం మళ్ళీ పోలింగ్ బూత్‌లను మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని మార్చకుండా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే కొనసాగించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచితోపాటు పలువురు నాయకులు కోరారు. అందుకు సంబంధించిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అంబటి రాఘవయ్య, ఇమ్మడిశెట్టి నాగార్జున, బండి రామనామము, బండి గోపి, ఎన్.రమేష్, అంబటి అంకమ్మరావు, బండి శివరామకృష్ణ, పెరవలి రామకృష్ణ, ఐ.వెంకట్రావు తదితరులున్నారు.

## ఎలాంటి ఆపద వచ్చినా కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయండి



పొన్నూరు, అక్టోబరు 27,ప్రభాతవార్త: భారత వాతావరణశాఖ తాజా సమాచారం మేరకు బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను పొన్నూరు ప్రాంతంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు సూచించారు. తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్, మునిసిపల్ కమిషనర్ రమేష్‌బాబు, సిబ్బంది పట్టణంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు, మునిసిపాలిటీ అధికారులు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. లోతట్టు ప్రాంతాలలో, బలహీనమైన ఇళ్ళలో నివసించే ప్రజలు తక్షణమే పురపాలక సంఘం తరపున ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు రావాలని కోరారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డీవీసి కాలనీలో మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తుఫాను తీరం దాటే సమయం వరకు, వాతావరణం పూర్తిగా మెరుగుపడే వరకు ఇంటి నుండి బయటకు రావద్దని కోరారు. తుఫాను సమయంలోవిద్యుత్ పరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున మొబైల్‌ఫోన్లు, టార్చ్‌లైట్లు చార్జిచేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మనుగడ కోసం అవసరమైన వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే వెంటనే కంట్రోల్ రూమ్ ఫోన్ నెం:08643-247737కు ఫోన్ చేయాలని కోరారు. పట్టణంలోని పునరావాస కేంద్రాలను పరిశీలించారు. వీరి వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు తదితరులున్నారు.

## విజ్ఞాన్‌కు ప్రోగ్రామ్స్‌కు ప్రతిష్ఠాత్మక ఎన్‌బీఏ టైర్-1 అక్రిడిటేషన్


పొన్నూరు, అక్టోబరు 27,ప్రభాతవార్త: చేబ్రోలు మండల పరిధి, వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ మరో మైలురాయిని చేరుకుందని, దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యా సంస్థలకు జాతీయస్థాయిలో నాణ్యత ప్రమాణాలను నిర్ధారించే నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) నుంచి విజ్ఞాన్



యూనివర్సిటీలో అర్హత కలిగిన అన్ని ప్రోగ్రామ్స్‌కు టైర్-1 అక్రిడిటేషన్ లభించిందని విజ్ఞాన్స్ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తెలిపారు. స్థానిక విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరిగిన సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. విజ్ఞాన్ యూనివర్సిటీ మొదటి నుంచి విద్యానాణ్యత, పరిశోధనలో ప్రతిభ, సామాజిక బాధ్యత ఈ మూడు అంశాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు.అర్హత కలిగిన అన్ని ప్రోగ్రామ్స్‌కు ఎన్‌బీఏ టైర్-1 అక్రిడిటేషన్ పొందడం ద్వారా విజ్ఞాన్ విద్యా ప్రమాణాలకు, బోధనా నాణ్యతకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. ఇది మా విద్యార్థులు, అధ్యాపకులు, నిర్వాహకుల సమిష్టి కృషికి నిదర్శనమన్నారు. న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్‌బీఏ తనిఖీ బృందం 2025ఆగస్టు 29నుంచి మూడు రోజులపాటు విజ్ఞాన్‌యూనివర్సిటీని సందర్శించిందన్నారు. ఈ బృందం బోధనా విధానాలు, సిలబస్, టీచింగ్ లెర్నింగ్ ప్రాసెస్, ప్రాజెక్టు-బేస్డ్ లెర్నింగ్, విద్యార్థుల పరిశోధనా పేపర్లు, ల్యాబ్ సదుపాయాలు, పరిశోధనా ప్రాజెక్టులు, ప్లేస్‌మెంట్ అవకాశాలు, విద్యార్థుల అచీవ్‌మెంట్స్, హాస్టల్ వసతి, క్రీడా కార్యకలాపాలు వంటి అంశాలను విస్తృతంగా పరిశీలించిందన్నారు. ఈ అక్రిడిటేషన్ విజ్ఞాన్ యూనివర్సిటీని భారతదేశంలోని అత్యుత్తమ టెక్నికల్ ఇనిస్టిట్యూషన్ల సరసన నిలిపిందన్నారు. ఎన్‌బీఏ టైర్-1 సర్టిఫికేషన్ ఉన్న విద్యార్థుల డిగ్రీలు విదేశీ విశ్వవిద్యాలయాలు, బహుళజాతి కంపెనీలు గుర్తిస్తాయన్నారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విజ్ఞాన్ యూనివర్సిటీ ఎల్లప్పుడూ విద్యార్థుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఈ గుర్తింపు మన ప్రయత్నాలను మరింత బలపరుస్తుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ అక్రిడిటేషన్లు సాధించడం మా తదుపరి లక్ష్యమన్నారు. అర్హత కలిగిన అన్ని ప్రోగ్రామ్‌లకు టైర్-1 అక్రిడిటేషన్ పొందడం వల్ల విద్యార్థులకు అంతర్జాతీయ కంపెనీలలో ప్లేస్‌మెంట్లు, విదేశీ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యలో ప్రవేశాలు సులభం అవుతాయన్నారు. ఈ ఘనత సాధించడంలో కృషి చేసిన ఐక్యూఏసీ సిబ్బందిని విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సిఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

## పలు ప్రాంతాల్లో సందర్శించిన ప్రత్యేకాధికారి జయలక్ష్మి

చేబ్రోలు(పొన్నూరు), అక్టోబరు 27,ప్రభాతవార్త: మొంథా తుఫాన్ ప్రభావంతో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు ప్రజలు, అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని చేబ్రోలు మండల ప్రత్యేకాధికారి జయలక్ష్మి సూచించారు. చేబ్రోలు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రత్యేకాధికారి పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. కొమ్మమూరు కెనాల్‌ను పరిశీలించారు. అదేవిధంగా చేబ్రోలు బ్రిడ్జి వద్ద నీటి ఉధృతిని పరిశీలించారు. చేబ్రోలు వంతెన వద్ద గతంలోనే రోడ్డు కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆర్అండ్‌బి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహశీల్దార్ శ్రీనివాసశర్మ చేబ్రోలు మండల పరిధిలోని శేకూరు, శలపాడు, వీరనాయకుని పాలెం, వేజండ్లలో పర్యటించారు. శిథిలావస్థకు చేరిన గృహాల్లో నివాసం ఉంటున్నవారిని పునరావాస కేంద్రాలకు రావాలని తహశీల్దార్ శ్రీనివాసశర్మ కోరారు. ప్రత్యేకాధికారి వెంట ఎంపిడిఓ ఊహారాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పెరుగు శ్రీనివాసరావు, ఈఓఆర్డీ రవిశంకర్ తదితరులున్నారు.





## తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలి: జెసి అశుతోష్ శ్రీవాత్సవ

పెదనందిపాడుఅక్టోబర్ 27, (ప్రభాతవార్త) మెంతా తుఫాను పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని గుంటూరు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. సోమవారం సాయంత్రం పెదనందిపాడు మండలంలో వారు పర్యటించారు. పర్చూర్ వంతెన సమీపంలోఓగేరు వాగు కట్టమీద నివసిస్తున్న కుటుంబాల వారిని వెంటనే పెదనందిపాడు ఎస్సీ హాస్టల్ కు తరలించి తుఫాను తగ్గుముఖం పట్టే వరకు అక్కడే వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కాన్పుకు దగ్గరగా ఉన్న గర్భిణీ స్త్రీలను గుంటూరు జి జి హెచ్ కు తరలించాలని తెలిపారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉండి మండలంలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ తక్షణ రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట ప్రత్తిపాడు సిఐ జి శ్రీనివాసరావు, పెదనందిపాడు తహసిల్దార్ ఎస్ హేనా ప్రియ, స్పెషల్ ఆఫీసర్ ప్రసూనాంబ. ఎంపీడీవో స్వామి రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ షేక్ కరిముల్లా, మండల వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం .ఆర్ఐ అబీద్ అలీ.మండల అధికారులు ఉన్నారు.



## నాగులపాడు వంతెన వద్ద నల్లమల ప్రవాహాన్ని పరిశీలించిన తహసిల్దార్

పెదనందిపాడు అక్టోబర్ 27 (ప్రభాతవార్త): తుఫాను సందర్భంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎస్ హేనా ప్రియ అన్నారు. అత్యవసర పనుల నిమిత్తం తప్ప బయటకు రావద్దని అందరూ ఇళ్లల్లోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సోమవారం నాగులపాడు వద్ద రైతులు పొలాలు వెళ్లేందుకు నిర్మించిన వంతెన వద్దకు వెళ్లి . నల్లమడ వాగు ప్రవాహమును పరిశీలించారు. వంతెనకు ఇరువైపులా గతంలో వచ్చిన వరదలకు తెగిన కట్టలను పరిశీలించారు. వాగు ప్రవాహం పెరిగితే వరద నీరు నాగులపాడు గ్రామం లోకి ప్రవేశించకుండా ఉండేందుకు ఇసుక బస్తాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. వారి వెంట డిప్యూటీ తహసిల్దార్ షేక్ కరిముల్లా. మండల స్పెషల్ ఆఫీసర్. ఎంపీడీవో స్వామి రెడ్డి. పలువురు డ్రైనేజీ అధికారులు ఆర్ ఐ అ బిద్ అలీ. రైతు సంఘ నాయకులు రావి శివరామకృష్ణయ్య. గొల్లపూడి కోటయ్య చౌదరి. కాపు దామోదరం తదితరులు ఉన్నారు. తుఫాను సందర్భంగా ముందస్తు జాగ్రత్తగా రైతులు గాని. ప్రజలు గాని. అత్యవసర సమయంలో దిగువ తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తహసిల్దార్ హేనా ప్రియ కోరారు. తహశీల్దార్:9949098619. ఉప తహశీల్దార్:9640405207. రెవిన్యూ ఇన్స్పెక్టర్: 8121395395.



## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వల్లూరులో రచ్చబండ



కాకుమాను అక్టోబర్ 27 (ప్రభాత వార్త): మండల పరిధిలో వల్లూరు, చినలింగాయపాలెం గ్రామాలలో మాజీ ముఖ్య మంత్రి వై.యస్.ఆర్ సీ.పీ అధ్యక్షులు వై.యస్.జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకుప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వల్లూరు గ్రామంలో రచ్చబండ కార్యక్రమం సోమవారం నిర్వహించి, సంతకాల సేకరణ చేసిన, ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బలసాని కిరణ్ కుమార్.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు,తెనాలి నియోజకవర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్ మరియు కాకుమాను మండల మరియు వల్లూరు గ్రామ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాను కారణంగా వర్సిటీకి సెలవులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు27, ప్రభాతవార్త: మొంథా సైక్లోన్ ప్రభావంతో ఏఎన్‌యుకు, అనుబంధ కళాశాలలకు 3రోజులు సెలవులు ప్రకటిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశానుసారం ఈనెల 27,28,29 తేదీలలో సెలవులు ఇచ్చినట్లు వెల్లడించారు.

**ఉద్యోగులకు యధావిదిగా:** వర్సిటీలో పలువురు ఉద్యోగులకు యధావిదిగా విధులు ఉంటాయని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. వీసి సూచనలతో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్, ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, వసతిగృహాల వార్డెన్‌లు, సిఇ, ఏసిఇ పరీక్షల అధికారులు, సిడిఇ, హెల్త్ సెంటర్, ఇంజనీరింగ్ సెక్షన్‌లోని అన్ని విభాగాలు, లైబ్రరీ, వీసి, రెక్టార్, రిజిస్ట్రార్ పేషీ ఉద్యోగులు విధులకు హాజరుకావాలని సూచించారు. ఇతర విభాగాల టీచింగ్, నాన్ టీచింగ్ విభాగాలకు 28,29 తేదీలలో సెలవులు ఉంటాయన్నారు.

**పరీక్ష ఫీజు రీ షెడ్యూల్:** వర్సిటీ పరిధిలో 3వ సెమిస్టర్ పీజీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కోర్సుల రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షల ఫీజు గడువు తేదీని రీషెడ్యూల్ చేసినట్లు సిఇ ఆలపాటి శివప్రసాదరావు తెలిపారు. నవంబరు 3వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చునని, రూ.100 అపరాధంతో 4వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. షెడ్యూల్ వర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని పేర్కొన్నారు.

**ఫైన్ ఆర్ట్స్ రివైజ్డ్ పరీక్షల షెడ్యూల్:** వర్సిటీలోని ఫైన్ ఆర్ట్స్ కోర్సుల 3/4, 2/4 లో 2వ సెమిస్టర్ సప్లమెంటరీ, 1/4, 4/4 మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల రివైజ్డ్ తేదీలను సిఇ ప్రకటించారు. నవంబరు 3వ తేదీ నుంచి జరుగుతాయని పేర్కొన్నారు.

**ముందస్తు చర్యలు:** మొంథా సైక్లోన్ ప్రభావంతో ఏఎన్‌యులో ముందస్తు చర్యలు చేపట్టారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ఆదేశాలతో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల సౌకర్యార్థం పూర్తి భద్రత చర్యలు తీసుకున్నట్లు ఛీఫ్ వార్డెన్ ఆచార్య కె.మల్లిఖార్జున తెలిపారు. విద్యార్థులకు అధనంగా భోజనం, వైద్య సదుపాయాలుతో పాటు సురక్షిత ఏర్పాట్లు చేశారు. అధనపు ఛీఫ్ వార్డెన్ డా.డి.శ్రీనివాసరావు,, డిప్యూటి వార్డెన్‌లు డా.కె.శశిధర్, డా. ఎన్.బాబు, డా.కె.నాగరాజు, రెసిడెన్షియల్ వార్డెన్స్ విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, కిషోర్, వెంకటేశ్వర్లు, హాస్టల్ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురజాల అప్పారావుకు ఘన సన్మానం

మాచర్ల, అక్టోబరు 27 ప్రభాతవార్త: తెలుగువెలుగు మహానంది జాతీయ పురస్కార గ్రహీత గురజాల అప్పారావును పవర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు న్యాయవాది జి.జయానందరావు





పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా జయానందరావు మాట్లాడుతూ ఎంతోకాలంగా గురజాల అప్పారావు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో ఎంతోమందికి సేవలందించినట్లు తెలిపారు. అంతర్జాతీయ తెలుగు భాషా సాహితీ సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా హైదరాబాదులోని త్యాగరాయ గానసభ కళావేదికపై మహానంది అవార్డును తీసుకోవడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలందించి ఎన్నో ఉత్తమ అవార్డులను పొందాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం గురజాల అప్పారావు మాట్లాడుతూ పవర్ ఫౌండేషన్ నిర్వాహకులు తనను ఘనంగా సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ పురస్కారం తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. అనంతరం అప్పారావును ఫౌండేషన్ సభ్యులు, మిత్రులు ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు కృష్ణారెడ్డి, మంజుల కృష్ణ, తేనెపల్లి శ్రీనివాసాచారి, పోతురాజు, కన్నెగంటి కోటేశ్వరరావు, కన్నెగంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మొంథా తుఫానుపై అధికారుల అప్రమత్తత

మాచర్ల, అక్టోబరు 27 ప్రభాతవార్త: మొంథా తుపాను నేపథ్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్, గురజాల ఆర్డీవో ఆదేశాల మేరకు మాచర్ల తహశీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తహశీల్దారు కిరణ్‌కుమార్ తెలిపారు. తక్షణ సహాయం కోసం 24/7 కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 8520882876లో సంప్రదించాలన్నారు. మాచర్ల మండలంలో ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. ప్రతి గ్రామంలో గ్రామ రెవెన్యూ అధికారులు, సహాయకులు కార్యాలయంలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. మాచర్ల మండలంలో తుపాను కారణంగా సమస్య వస్తే మాచర్ల తహశీల్దారు 9849904027, కంట్రోల్ రూమ్ నంబర్ 8520882876లో సంప్రదించాలన్నారు.

## మైనార్టీల అభ్యున్నతికి రోడ్ మ్యాప్



గుంటూరు వెస్ట్,అక్టోబర్ 27,ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వంలో మైనార్టీల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో దీనికోసం రోడ్ మ్యాప్ రూపొందిస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు.సోమవారం స్థానిక అసెంబ్లీలో మైనార్టీ శాఖ,లీడ్ బ్యాంక్ అధికారులతో నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.మైనార్టీలకు అమలవుతున్న సంక్షేమ ఫలాలు,చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.పథకాల అమలుకు త్వరలో నూతన కమిటిని ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక ఇమామ్‌లు,మౌజన్లకు గౌరవవేతనం నిధులు అందించామన్నారు.రాష్ట్రంలో ఎంతమంది ఇమామ్‌లు,మౌజన్లు ఉన్నారని వీరి అర్హతకు ప్రామాణికమేంటని అడిగి తెలుసుకున్నారు.రాష్ట్రంలో మైనార్టీ జూనియర్,డిగ్రీ కాలేజిల్లో విద్యార్థులు,లెక్చరర్ల సంఖ్యపై ఆరా తీశారు.సీడ్ యాప్ ద్వారా నమోదైన నిరుద్యోగుల్లో ఎంతమందికి ఇప్పటివరకు శిక్షణ కల్పించిన వివరాలు తెలియజేయాలన్నారు.వక్ఫ్‌బోర్డు సమస్యలతో పాటు మైనార్టీఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందించిన రుణాలపై నివేదిక ఇవ్వాలని సూచించారు.బీసీ-ఈల సర్టిఫికేట్లు జారీలో అర్హతకు ఎలాంటి ప్రమాణాలు పాటిస్తున్నారో తెలియజేయాలన్నారు.

## మొంథా తుఫాను కారణంగా ర్యాలీ వాయిదా

అచ్చంపేట, అక్టోబర్ 26, ప్రభాతవార్త: మొంథా తుఫాను ప్రభావం దృష్ట్యా అక్టోబర్ 28న జరగాల్సిన ర్యాలీని నవంబర్ 4వ తేదీకి వాయిదా వేస్తున్నామని అచ్చంపేట మండల పార్టీ అధ్యక్షులు చిలక చంద్రయ్య తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “కేంద్ర పార్టీ కార్యాలయం నుండి వచ్చిన ఆదేశాలు మేరకు ర్యాలీని వాయిదా వేస్తున్నాం. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు ప్రజలకు అండగా ఉండాలని పార్టీ అధ్యక్షులు శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి గారు సూచించారు,” అని అన్నారు.తుఫాను బాధిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ప్రాంతాల్లో నాయకులు, పార్టీ శ్రేణులు ముందస్తు జాగ్రత్త చర్యలు, సహాయ మరియు పునరావాస కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 28న (మంగళవారం) అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో తలపెట్టిన ర్యాలీని మొంథా తుఫాను కారణంగా నవంబర్ 4వ తేదీకి వాయిదా వేయడం జరిగింది అని చిలక చంద్రయ్య గారు తెలిపారు.

## 101వ సారి అన్నప్రసాద వితరణ



సత్తెనపల్లి అక్టోబర్ 27ప్రభాతవార్త :సత్తెనపల్లి పట్టణంలోని ఏరియా హాస్పిటల్ లో సోమవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రభుత్వ వైద్యశాలలో జనసేన పార్టీ నాయకుడు అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ అన్నప్రసాద వితరణ కార్యక్రమం 101వ సారి విజయవంతంగా నిర్వహించబడింది.

**100 మందికి ఉచిత భోజనం:** దాత బాణావత్ రమణి బాయి జ్ఞాపకార్థం ఆమె కుమార్తె సునీతబాయి ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 100 మంది నిరుపేద ఓపీ రోగులకు, గర్భిణీ స్త్రీలకు మరియు రోగుల సహాయకులకు ఉచితంగా భోజనం పంపిణీ చేశారు. 101వ సారి వితరణ పూర్తి చేసుకున్న సందర్భంగా, కార్యక్రమానికి సహకరిస్తున్న వైద్యులకు, సేవకు వస్తున్న పెద్దలకు చిరుసత్కారం చేశారు.

**సేవా నిబద్ధతను అభినందించిన వైద్యులు:** ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన డా. గిరిరాజు, డా. రమేష్ మాట్లాడుతూ అప్పాపురపు నరేంద్ర నిస్వార్థంగా చేస్తున్న ఈ సేవకు ప్రతిఫలంగా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరిస్తున్నందుకు ఆయనను అభినందించారు.

## అధునాతన ఈత శిక్షణ పూర్తిచేసుకున్న ఆక్వా డెవిల్స్



తాడేపల్లి,అక్టోబర్ 27,ప్రభాతవార్త : ఉండవల్లిలోని ఆక్వా డెవిల్స్ 15మంది అగ్నిమాపక శాఖ సిబ్బంది అధునాతన ఈత శిక్షణకు నెలరోజులు పూర్తయింది.ఈత శిక్షణపొందిన సిబ్బంది అధికారుల ముందు డెమో నిర్వహించారు.ప్రాణరక్షణ,స్క్యూబా డైవింగ్,రక్షణ నైపుణ్యాల శిక్షణను విజయ వంతంగా పూర్తియింది.ముగింపు కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ డిజి పి.వెంకట రమణ శిక్షణ పూర్తిచేసుకున్న ట్రైనీలకు ప్రశంశా పత్రాలు అందించారు.అగ్నిమాపక శాఖ అధికారులు,సిబ్బంది సుమారు 70మంది వరకు పాల్గొన్నారు.

## నేడు ఎస్ఆర్ఎం వర్సిటీ 5వ స్నాతకోత్సవం

### ముఖ్య అతిథిగా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్

మంగళగిరి, అక్టోబరు 27, ప్రభాతవార్త: ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవానికి సిద్ధమైంది. మంగళవారం ఉదయ 11 గంటలకు యూనివర్శిటీ ఆడిటోరియంలో విద్యార్థులకు డిగ్రీల ప్రదానం జరుగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ మేరకు యూనివర్సిటీలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.యూనివర్సిటీలో 2020 25 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ చదివిన 1877 మంది విద్యార్థులకు, మరో 39 మంది పరిశోధనా విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నారు. ఇందులో 45 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు, 7 నంది స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులకు, నలుగురు లిబరల్ ఆర్ట్స్ విద్యార్థులకు ఈ సందర్భంగా బంగారు, వెండి పతకాలను ప్రదానం చే య ం న ం న్నా ర ం . స్నాతకోత్సవం ఉదయం 11 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం రెండు గంటలకు ముగియనుంది. సోమవారం ఉదయం యూనివర్సిటీ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్లు ఆడిటోరియంలో ఏర్పాట్లను పర్యవేక్షి ంచారు. భారీ వర్షాల నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ తో పాటు యూనివర్సిటీ కులపతి డాక్టర్ టీఆర్ పారివేంధర్, ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్, ఇన్ చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్, గవర్నింగ్ బాడీ మెండర్లు పాల్గొంటున్నారు.





## తుఫాన్ కారణంగా వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి--డిఎంహెచ్ఓ



కొల్లిపర,అక్టోబరు 27 ప్రభాతవార్త: తుఫాన్ కారణంగా వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ అన్నారు.సోమవారం మండల పరిధిలోని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఓ విజయలక్ష్మీ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి రికార్డులను..వైద్యశాలలోని మందులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ గ్రామాల్లో తప్పనిసరిగా మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలన్నారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.కార్యక్రమంలో మండల వైద్యాధికారి నేహ,పీహెచ్ఎన్ సుమతి,ఆరోగ్యవిస్తరణాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్‌కాలనీలో మౌలికవసతులు కల్పించాలి




కొల్లిపర,అక్టోబరు 27 ప్రభాతవార్త: మండల కేంద్రం కొల్లిపర గ్రామ శివారు ప్రాంతమైన గుదిబండివారిపాలెం హౌసింగ్‌కాలనీలో మౌలిక వసతులు కల్పించపోవటంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని..అధిక వర్షాలు పడితే గృహాల నుండి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని వెంటనే కాలనీలో రోడ్లు వేయించాలని కాలనీవాసులు సోమవారం డిప్యూటి తీహశీల్ధార్ రాజేష్‌కు వినతి పత్రం అందజేసారు,.కార్యక్రమంలో సీపీఎం తెనాలి రూరల్ కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి, తిరుపతమ్మ,శ్రీలత,దుర్గా భవాని,రెహనా, వెంకటసుబ్బమ్మ, గోపాలకృష్ణ,వెంకటేష్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ ఎంపిడిఓగా వేముల శ్రీనివాసరావు

పొన్నూరు, అక్టోబరు 27,ప్రభాతవార్త: పొన్నూరు మండల డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వేముల శ్రీనివాసరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. 1997 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసరావు అప్పట్లో గ్రామాభివృద్ధి(విడిఓ) అధికారిగా విధుల్లో చేరారు. ఆ తర్వాత ప్రభుత్వం 2002లో విడిఓలను పంచాయితీ కార్యదర్శులుగా మార్పు చేసింది. అప్పటి నుంచి పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం పంచాయితీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించింది. ఆ పదోన్నతుల్లో పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనివాసరావు డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన శ్రీనివాసరావును పొన్నూరు మండలానికే కేటాయించారు. దీంతో ఈయన డిప్యూటీ ఎంపిడిఓ జాయినింగ్ రిపోర్టును ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావుకు అందజేశారు. శ్రీనివాసరావు పంచాయితీ కార్యదర్శిగా వల్లభరావుపాలెం, దండమూడి, బ్రాహ్మణకోడూరు పంచాయితీల్లో పనిచేశారు. అనంతరం బాపట్ల జిల్లా ఖాజీపాలెం పంచాయితీ కార్యదర్శిగా పనిచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక శ్రీనివాసరావు మళ్ళీ వల్లభరావుపాలెం పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు సమర్థవంతమైన కార్యదర్శిగా పేరు తెచ్చుకోవడంతో మండలంలో ఖాళీగా ఉన్న మునిపల్లె, చింతలపూడి పంచాయితీలకు ఇన్‌చార్జిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం పదోన్నతి రావడంతో డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును పలువురు అభినందించారు.



## కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో పీహెచ్‌డి



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు27, ప్రభాతవార్త: వర్సిటీలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ పరిశోధన పర్యవేక్షణలో థీసిస్ సమర్పించినందుకు బొప్పన రవికుమార్‌కు పీహెచ్‌డి డిగ్రీని ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. రవికుమార్ సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ స్ట్రాటజీస్- ఇట్స్ ఇంపాక్ట్ ఆన్ ట్రెడిషనల్ మీడియా- యాన్ ఎనాలసిస్ అనే అంశంపై పీహెచ్‌డి పూర్తి చేశారు. ఏలూరు జిల్లా ముదినేపల్లిలోని పెద్దపాలపర్రుకు చెందిన రవికుమార్ తన పరిశోధనలో సామాజిక మాధ్యమాల్లో సంస్కరణలు సూచించారు. డిజిటల్ కంటెంట్ రెగ్యులేటరి అథారిటీ ఏర్పాటుచేయాలని, సోషల్ మీడియా నకిలీ ప్రచారాన్ని అడ్డుకునేందుకు మీడియా ఎడ్యుకేషన్ చట్టం తీసుకురావాలని, మీడియా లిటరసీపై అవగాహన పెంచాలని తన పరిశోధన ద్వారా తెలిపారు.

# పల్నాడు జిల్లా వార్త



## ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు: ప్రత్తిపాటి



చిలకలూరిపేట, అక్టోబర్ 27, ప్రభాతవార్త: వాయుగుండం ప్రభావం దృష్ట్యా, అధికారులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి రాష్ట్రంపై వాయుగుండం ప్రభావం అధికంగా ఉండే అవకాశాలున్నందున కూటమిప్రభుత్వం ఇప్పటికే సమగ్ర చర్యలు చేపట్టిందని, తుపాను ఎఫెక్ట్ అధికంగా ఉండే జిల్లాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేకాధికారులను నియమించి, ఆర్టీజీఎస్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో నియోజవకర్గంతో పాటు పల్నాడు జిల్లాపై తుపాను ప్రభావాన్ని అంచనా వేస్తూ, అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించి, భోజన.. వసతి ఏర్పాట్లు చేయాలని, ముందు జాగ్రత్తగా ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా మూసివేయాలని ఆయన సూచించారు. నియోజకవర్గంలోని వాగులు పొంగి రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రమాదాలకు అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు ప్రయాణాలకు దూరంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. తుపాను ధాటికి నేలకొరిగే ఉద్యాన, వాణిజ్య పంటల నష్టపరిహార అంచనాలపై వ్యవసాయ సిబ్బంది వేగంగా స్పందించాలని ప్రత్తిపాటి ఆదేశించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మునిసిపల్ చైర్మన్



చిలకలూరిపేట, అక్టోబర్ 27, ప్రభాతవార్త: తుఫాన్ ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి చిలకలూరిపేట పట్టణంలోని భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటికి రాకూడదని మరియు అధిక వర్షాల వల్ల ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగిన యెడల, వెంటనే మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెం: 08647253994 నకు ఫోన్ చేసి సమాచారం అందించాలి. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ప్రత్యేక విజ్ఞప్తి: సంజీవ్ నగర్, శాంతి నగర్, సుబ్బయ్య తోట, ఈస్ట్ మలపల్లె, శారద హై స్కూల్ రోడ్ వంటి లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. పునరావాస కేంద్రాలు .. సుగాలీ కాలనీ హై స్కూల్ ..హై స్కూల్ .. మద్దినగర్ కమ్యూనిటి హాల్ .. ాలేజీ, పెద్దనందిపాడు రోడ్ లోతట్టు ప్రాంతాల ప్రజలు తరలింపునకు సిద్ధంగా ఉండాలని కమీషనర్ ఈ సందర్భంగా కోరారు. కారణంగా చెట్లు పడిపోవడం లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు జరిగిన యెడల, వెంటనే మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెం: 08647253994 నకుగాని మున్సిపల్ చైర్మన్ గారికి 9440479765 మున్సిపల్ కమిషనర్ 9849907278కి మున్సిపల్ డిఈ గారికి 9849906585 ఫోన్ చేసి సమాచారం అందించాలి. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ప్రత్యేక విజ్ఞప్తి: సంజీవ్ నగర్, శాంతి నగర్, సుబ్బయ్య తోట, ఈస్ట్ మలపల్లె, శారద హై స్కూల్ రోడ్ వంటి లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. భారీ వర్షాల వలన అత్యవసర పరిస్థితులు ఏర్పడినచో, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి పురపాలక సంఘం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు.

## ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా విద్యాసంస్థలు నడిపితే చర్యలు



చిలకలూరిపేట, అక్టోబర్ 27, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలం విద్యాశాఖ అధికారి మీడియాతో మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసరించి మండల పరిధిలోని అన్ని విద్యాసంస్థలు ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా మాత్రమే నడవాలని సూచించారు.అయితే, ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తూ పాఠశాలలు నడిపే వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని లీనివీ స్పష్టం చేశారు.భారీ వర్షాలు, తుఫానుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నందున, విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## వాసవి మెడికల్ కాంప్లెక్స్ సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



చిలకలూరిపేట, అక్టోబర్ 27, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని తొమ్మిదవ వార్డులో అభివృద్ధి పనులు ఊపందు కున్నాయి. మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రతిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు, వాసవి మెడికల్ కాంప్లెక్స్ నందు 17.3 లక్షల రూపాయల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం ఏర్పాటుకు సోమవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ శంకుస్థాపన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ షేక్. రఫ్వాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, మున్సిపల్ డిఇ రహీం పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ వెల్సన్, టీడీపీ నాయకులు చురుగ్గా పాల్గొన్నారు. వీరిలో టౌన్ ప్రెసిడెంట్ సమ్మద్ ఖాన్, టౌన్ సెక్రటరీ మద్దిమల రవి, పట్టణ అధికార ప్రతినిధి మల్లి బాబు,వెంకటేశ్వర్లు,వెంకటరావుతో పాటు తొమ్మిదవ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు మరియు ప్రెసిడెంట్లు పాల్గొన్నారు. ఈ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానికులకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## తుఫాను పై మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు సమీక్ష



చిలకలూరిపేట, అక్టోబర్ 27, ప్రభాతవార్త: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నాడు మున్సిపల్ కమిషనర్ పీ శ్రీహరిబాబు మేధో తుఫాన్ పై అప్రమత్తంగా ఉండాలనీ.. మొంథా తుఫాన్ తో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు,తుఫాన్ ప్రభావంతో ప్రజలనుంచి వచ్చే సమస్యలు తెలిపేందుకు సహాయక చర్యలు తీసుకునేందుకు ఇప్పటికే మన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని , ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ముందస్తుగా సమాచారం అందేలా చూడాలి.రోడ్లపై చెట్లు కూలితే వెంటనే తొలగించేలా అవసరమైన యంత్రాలు అందుబాటులో ఉంచాలి. విద్యుత్ కు అంతరాయం కలిగినా, తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలనీ మున్సిపల్ కమిషనర్ పీ శ్రీహరిబాబు సమీక్ష సమావేశం లో అధికారులకు ఆదేశించారు.. ఈ సమీక్ష సమావేశం లో మున్సిపల్ డి ఈ ఈ.అబ్దుల్ రహీం.మేనేజర్ మొహిద్దిన్ .శానిటరీ ఇనస్పెక్టర్ లు సిహెచ్ రమణారావు, సునీత, ఏఈ లు,మణి. అల్తాఫ్, అన్సారీ,టౌన్ ప్లానింగ్ అధికారులు. వెంకటేశ్వర్లు,బి.రాజేష్. షేక్ ఖాదర్..తదితరులు పాల్గొన్నారు

## పెన్షనర్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షునిగా డాక్టర్ చుక్క విన్సెంట్ పాల్



చిలకలూరిపేట, అక్టోబర్ 27, ప్రభాతవార్త: జిల్లా.కేంద్రమైన నరసరావుపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో. ఆయన నియామకం జరిగింది. ఈ పదవి రెండేళ్ల పాటు ఉంటుంది. వీరు చిలకలూరిపేట ఫెన్షనర్స్ అసోసియేషన్ లో కూడా ఉపాధ్యక్షులుగా ఉన్నారు. వీరు జిల్లా పదవికి ఎన్నిక కావడం పట్ల స్థానిక అసోసియేషన్ నాయకులు లంకా ఆదినారాయణ రెడ్డి, కందిమళ్ల మురళీధరరావు, బిట్రా నాగేశ్వరరావు, వెంకటప్ప, కనుమూరి జాషువ, సాహితీవేత్తలు డా. పీవీ సుబ్బారావు, దార్ల బుజ్జిబాబు, వై.యం.సి.ఏ. అధ్యక్షులు కె. రామమోహన్ , మాజీ ఏజిపి డి. చిట్టిబాబు, ఏవీ శివయ్య, తదితరులున్నారు.

## జోగి రమేష్‌పై డిజిపికి రావు సుబ్రహ్మణ్యం ఫిర్యాదు



చిలకలూరిపేట, అక్టోబర్ 27, ప్రభాతవార్త: దుర్గగుడిలో వైస్సార్సీపీ నేత జోగి రమేష్ ప్రమాణం పై ఇమెయిల్, కొరియర్ ద్వారా రాష్ట్ర డిజిపికి నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. విజయవాడ కనకదుర్గమ్మ గుడికి రాజకీయ కళంకం అంటించిన వైస్సార్సీపీ నేత జోగి రమేష్ పైన కేసు నమోదు గురించి. వైస్సార్సీపీ నేత మాజీ ఎమ్మెల్యే జోగి రమేష్ ది:27102025 న విజయవాడ ఇంద్రకీలాద్రి పైన అమ్మ వారిని దర్శనం చేసుకుని ఘాట్ రోడ్ వద్ద రాజకీయ ప్రేరేపణ కలిగిస్తూ, భక్తులకు తీవ్రంగా అసౌకర్యం కలిగిస్తూ మద్యం కుంభకోణం గురించి ప్రమాణం పేరుతో ఆలయ పవిత్రత దెబ్బ తీసేలా వ్యవహారించారు.మీడియా సమావేశం నిర్వహించడం, రాజకీయ వేదికగా దుర్గమ్మ ఆలయాన్ని ఉపయోగించడం వల్ల భక్తులు మనోభావాలు దెబ్బతీశారన్నారు. కార్తీక మాసం సోమవారం పర్వదినం రోజున ఇటువంటి ప్రకటనకు వేదికగా దుర్గమ్మ ఆలయాన్ని వాడుకోవడం ఆమె భక్తుడుగా రావు సుబ్రహ్మణ్యం అనే తనకు చాలా బాధ కలిగించింది. యావత్తు ప్రజలు కలవరం చెందారు. కావున జరిగిన సంఘటన పైన చట్టప్రకారం కేసు నమోదు చేసి జోగి రమేష్‌పైన, ప్రమాణం కార్యక్రమంలో పాల్గొన్న వారిపైన చట్ట ప్రకారం చర్యలు తీసుకొని భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా కాపాడాలని సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ధర్మ సంఘం నూతన కార్యవర్గం

చిలకలూరిపేట, అక్టోబర్ 27, ప్రభాతవార్త: చిలకలూరిపేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ధర్మ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా పసుమర్తి సూర్యప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా రాచు మల్లు సూర్యారావు , కోశాధికారిగా సికాకొల్లి సుబ్బారావు , గౌరవాధ్యక్షులుగా గుర్రం సాంబశివరావును నియమించడం జరిగినది కనుక ధర్మ సంఘం సభ్యులకు తెలియజేస్తున్నాము త్వరలో మీటింగ్ ఏర్పాటు చేసి కమిటీ సభ్యుల సమక్షంలో కమిటీలు ఏర్పాటుచేసి మెంబర్స్ లిస్టు తయారు చేయబడుతుందని తెలిపారు.

## వార్డుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు



చిలకలూరిపేట, అక్టోబర్ 27, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు 20వ వార్డు నందు మజిద్ బజార్, సిద్ధవత్తిని వీధి కళామందిర్ సెంటర్ తవ శ్రీరాములు వీధి,తషా బజార్ నందు ఉన్న సమస్యను గుర్తించి తీసుకోవాల్సిన చర్యలు నిమిత్తం మున్సిపల్ అధికారులకు సూచించిన మున్సిపల్ చైర్మన్ షేక్. రఫ్వాని ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ డిఈ మున్సిపల్ ఏఈ లు సచివాల సిబ్బంది 20వ వార్డు లోని టిడిపి నాయకులు సెక్రటరీలు ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.

## ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ వినతి

నరసరావుపేట, అక్టోబర్ 27 ప్రభాతవార్త : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు సోమవారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు పోతుల శంకర్, రంగిశెట్టి రామకృష్ణ, కాపు నాయకులు ఉన్నారు. ఎమ్మెల్యే డాక్టర్



చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ ప్రముఖ వ్యాపారి బత్తిన నాగేశ్వరరావు కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా స్వర్గపురిలో జరిగినటువంటి హత్య కేసు గురించి పూర్తి విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఇటీవల బత్తిన నాగేశ్వరరావుకు సంబంధించి అక్రమ కేసులు నమోదైనట్లు తెలిపారు. వైకాపా నాయకులు హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. కాటికాపరి యఫ్రాన్ హత్య కేసు వెనుక వైకాపా నాయకులు ఉన్నారని ఆరోపించారు. అదే విధంగా బత్తిన నాగేశ్వరరావుపై అక్రమ కేసులు పెట్టి వేధించే వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు కోరారు. దీనిపై స్పందించిన ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ రాష్ట్ర డిజిపితో పాటు పల్నాడు ఎస్పీలతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వినతి



నరసరావుపేట, అక్టోబర్ 27 ప్రభాతవార్త : తమ సమస్యలు పరిష్కరించాలని ఏపిఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నాయకులు బోస్, మస్తాన్‌రావు, ప్రభాకర్, ఎంఆర్‌పి రెడ్డి, బిఎస్ఎన్ సింగ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. రివ్ ఎన్‌క్యాష్‌మెంట్ గ్రాడ్యూటీ వెంటనే చెల్లించాలన్నారు. హయ్యర్ పెన్షన్ సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతపురం, రాజమండ్రిలలో రిఫరల్ హాస్పటల్ సౌకర్యం కల్పించాలన్నారు. 1996 నుండి 2014 వరకు ఎంప్లాయీస్ జీతాలలో మినహాయించుకున్న పెన్షన్ ఇప్పించాలన్నారు. వృద్ధాప్యంలో కనీసం జీవనం గడిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సామాజిక పెన్షన్లు, తెల్లరేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పించాలన్నారు. 58 సంవత్సరాలకు రిటైర్డ్ అయిన తర్వాత మినహాయించిన పిఎఫ్ మొత్తాలను రిటైర్డ్ అయిన రోజునే చెల్లించాలని కోరారు. ఈ మేరకు వారు ర్యాలీ నిర్వహించి జిల్లా ప్రజా రవాణా అధికారి అజితకుమారికి వినతిపత్రాలను అందజేశారు.

## సిఎం చంద్రబాబును కలిసిన కొమ్మాలపాటి

నరసరావుపేట, అక్టోబర్ 27 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును సోమవారం జిల్లా టిడిపి అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ కలిశారు. పల్నాడు జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఆయన ఘనంగా స్వాగతం పలికారు. పల్నాడు జిల్లాకు



సంబంధించి వివిధ అంశాలను వినతిపత్రం రూపంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొమ్మాలపాటి శ్రీధర్ తెలియజేశారు. జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, తుఫాన్ ప్రభావానికి సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి ఆయన తీసుకెళ్ళారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో జిల్లా అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు ప్రజలకు ఇబ్బందులు లేకుండా తొలగించాయని తెలియజేశారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తనయుడు వివాహ రిసెప్షనకు హాజరైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఘనంగా ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారని ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ తెలియజేశారు. ఫోటో

## పేదల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటం : డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట, అక్టోబర్ 27 ప్రభాతవార్త : పేదల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని వైకాపా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ద్వారా 9 వేల శస్త్ర చికిత్సలు జరిగితే ప్రస్తుతం ఆరోగ్యశ్రీని నిలిపివేయడంతో కేవలం 3 వేలు మాత్రమే జరుగుతున్నాయన్నారు. పేదలు డబ్బులు లేకపోవడం, ఆరోగ్యశ్రీ అమలు కాకపోవడంతో శస్త్ర చికిత్సలను వాయిదా వేసుకుంటున్నారని తెలిపారు. దేశంలోనే రోల్ మోడల్‌గా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం నిలిచిందన్నారు.



అనారోగ్యంతో ఏ పేదవాడు చనిపోకూడదని, అప్పులపాలు కాకూడదని ఆరోగ్యశ్రీని దివంగత నేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టారన్నారు. సిఎంగా వై.ఎస్.జగన్ 3007 జబ్బులకు ఆ పథకాన్ని విస్తరించారని, 2000 హాస్పటల్స్ ద్వారా చికిత్సను గొప్పగా అందించారని గుర్తు చేశారు. కోవిడ్ సమయంలో సైతం రూ.700 కోట్లను ఆరోగ్యశ్రీకి వై.ఎస్.జగన్ ఇచ్చారని గుర్తు చేశారు. 45 లక్షల 10 వేల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.1342 కోట్లను వై.ఎస్.జగన్ ఖర్చు పెట్టి పేద కుటుంబాలను ఆదుకోవడం జరిగిందన్నారు.

## కార్తీకమాసం పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, అక్టోబర్ 27 ప్రభాతవార్త : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు సోమవారం కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పట్టణంలోని శివునిబొమ్మ సెంటర్‌లో



శివుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్తీకమాసంలో జరిగేటటువంటి ప్రత్యేక పూజా కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. స్వామివారికి సంబంధించి భక్తుల దర్శన కార్యక్రమంలో, పూజలలో తగిన ఏర్పాట్లు చేయాలని సూచనలు చేశారు. పట్టణ నడిబొడ్డున ఉన్న శివుని విగ్రహానికి ఎంతో చరిత్ర ఉందని తెలిపారు. భక్తి భావంతో స్వామివారిని కొలిస్తే తప్పకుండా కోర్కెలు నెరవేర్చుతారని, శివుని కృపతో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లుతారని తెలిపారు. కార్తీకమాసంలో జరిగే శివ పూజలతో అద్భుతమైన ఫలితాలను భక్తులు పొందుతారని తెలిపారు. అదే విధంగా అక్కడ ఉన్న చిరు వ్యాపారులను, సామాన్యులను పలకరించి వారి సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలుసుకున్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు ఉన్నారు.

## ఆసియన్ గేమ్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థి

నకరికల్లు, అక్టోబర్ 27 ప్రభాతవార్త : ఆసియన్ యూత్ గేమ్స్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీలలో బంగారు పతకం ఏపి జట్టు సాధించేందుకు క్రీడాకారుడు హరీష్ కీలకపాత్ర పోషించారని ఎంఎఎం కళాశాల చైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావు అన్నారు. హరీష్‌ను సత్కరించి ఆయన మాట్లాడారు. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి ఆసియా యూత్ గేమ్స్‌ను నిర్వహిస్తారని తెలిపారు. ఒలంపిక్ కౌన్సిల్‌ఆఫ్ ఆసియా ఈ పోటీలను నిర్వహిస్తుందన్నారు. 2025 ఆసియా యువజన క్రీడలు అక్టోబర్ 22 నుండి 31 వరకు జరిగాయన్నారు. ఈ పోటీలలో హరీష్ ఈ ఘనత సాధించారని ఎం.ఆర్.శేషగిరిరావు తెలియజేశారు.

## ఈశ్వర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు విద్యారత్న అవార్డు

నరసరావుపేట, అక్టోబర్ 27 ప్రభాతవార్త : ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావుకు విద్యారత్న అవార్డు లభించింది. బ్రెయిన్ విజన్ సంస్థ ఆధ్వర్యంలో



నిర్వహించిన భారత్ విద్య ప్రతిభా అవార్డులను పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా అనేక విద్యాసంస్థల అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్‌ను గుర్తించి వారికి ఈ అవార్డులను సంస్థ ప్రతినిధులు అందజేశారు. దేశవ్యాప్తంగా ఏడుగురు ఎంపిక కాగా వారిలో నాగమల్లేశ్వరరావు ఉన్నారని కళాశాల చైర్మన్ షేక్.మీరావలి తెలిపారు. అవార్డు గ్రహీత నాగమల్లేశ్వరరావును చైర్మన్ మీరావలితో పాటు కార్యదర్శి కరీమ్, డైరెక్టర్ మస్తాన్‌షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్.నజీమా అభినందించారు.

## శివ నామస్మరణతో మార్మోగిన శివాలయాలు



యడ్లపాడు, అక్టోబర్ 27, ప్రభాతవార్త : కార్తీక మాసంన అంటే శివ కేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైన నెలగా చెబుతారు. ఈమాసంలో చేసే ప్రతి పూజ, దీపం, దానం వంటివి అనంతమైన పుణ్య పలాన్ని ఇస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ముఖ్యంగా కార్తీక మాసంలో వచ్చే సోమవారానికి అపారమైన విశిష్టత ఉంటుంది. ఇది శివుడికి అత్యంత ఇష్టమైన మాసం, ముఖ్యంగా కార్తీక మాసంలో మొదటి సోమవారం రోజు సాయంత్రం వేళలో నియమ నిష్టలతో పూజ చేస్తే విద్యార్ధులకు జ్ఞానం ఉద్యోగార్ధులకు, వ్యాపారులకు విజయం సంపద వంటివి కలుగుతాయని అలయ పూజారి సంగాపు వెంకటేశ్వర్లు తెలుపుతున్నారు. పగలు ఉపవాసం ఉండి సాయంత్రం దీపారాధన చేసి నక్త భోజనం చేయడం కార్తీక మాస నియమాలలో ఒకటని, సోమవారం సాయంకాలం శివుడిని అరాధించడం వల్ల అశ్వమేధ యాగం చేసినంత పుణ్యం లభిస్తుందని నమ్మకమన్నారు. మండల పరిధిలోని అన్ని ప్రధాన శివాలయాలలో కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో భక్తులు భారీగా తరలి వచ్చారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించటం జరిగిందన్నారు.

## మొంథా వాయుగుండంతో కారుమబ్బులు....చిరుజల్లులు



యడ్లపాడు, అక్టోబర్ 27, ప్రభాతవార్త : బంగాళాఖాతంలో మొంథా తుపానుగా బలపడిన వాయుగుండం నైరుతి అగ్నేయ మధ్యం బంగాళాఖాతంలో మొంథా తుపాను పశ్చిమ వాయువ్య దిశగా కదులుతున్న తుపాను కారణంగా ఉదయం నుండి కారుమబ్బులు కమ్మి తేలిక పాటి జల్లులు పడుతున్నాయి. తుఫాను తీవ్రతను దృష్టిలో పెట్టుకొని గ్రామాలలో రెవెన్యూ అధికారులకు ప్రత్యేక అదేశాలు ఇవ్వటం జరిగిందని, ఎక్కడా ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే ఎదుర్కొనే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయటం జరిగిందని తహశీల్దార్ విజయశ్రీ తెలిపారు. గ్రామాలలో తుఫాన్ ప్రభావం కారణంగా ఇబ్బందులు ఉంటే వెంటనే సంబంధిత గ్రామ స్థాయి అధికారులకుగాని కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు.

## అదుపుతప్పి లారీ బోల్తా



యడ్లపాడు, అక్టోబర్ 27, ప్రభాతవార్త : జాతీయ రహదారి ఎన్ఎస్ఎల్ సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసు కుంది. సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఒంగోలు నుండి అమరావతి వైపు చేపల దాణాలోడ్‌తో వెళుతున్న సమయంలో లారీ అదుపుతప్పి బోల్తా పడటం జరిగిందని, రోడ్డుపై దాణా బస్తాలు పడిపోవటం ట్రాఫిక్ అంతరాయం కావటంతో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని రోడ్డుపై పడిన దాణా బస్తాలను ప్రక్కకు తీసి ట్రాఫిక్ పునరుద్ధరణ చేపట్టారు. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదని వారు తెలిపారు.

## కబడ్డీ అండర్-18 విజేత హరీష్‌కు వశిష్ఠ కళాశాల సత్కారం



రొంపిచర్ల, అక్టోబర్ 27 ప్రభాతవార్త : ఆసియా కబడ్డీ అండర్-18 పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చూపిన జి.హరీష్‌ను సోమవారం వశిష్ఠ కళాశాల ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎం.నరేష్‌కుమార్, వై.వి.చిరంజీవి, సురేష్‌లు హరీష్‌ను అభినందించి శాలువాతో సత్కరించారు. క్రీడలో ప్రోత్సహించేందుకు ఆర్ధికంగా వెనుకబడిన హరీష్‌కు వశిష్ఠ కళాశాల స్పాన్సర్‌గా వ్యవహరించిందని డైరెక్టర్ నరేష్ తెలిపారు.

## అత్యధిక ప్యాకేజీలతో ఎన్‌ఈసి విద్యార్థులకు ఉద్యోగాలు



నరసరావుపేట టౌన్, అక్టోబర్ 27 ప్రభాతవార్త : ప్రముఖ బహుళజాతి సంస్థ టీవీఎస్‌కు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వివరాలను కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌లు తెలియజేశారు. వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి మాట్లాడుతూ టీవీఎస్ సంస్థ సోమవారం ప్రాంగణ ఎంపికలను నిర్వహించిందన్నారు. ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రాంగణ ఎంపికలలో పాల్గొన్నారని తెలిపారు. వారికి వ్రాతపరీక్ష, ముఖాముఖి ఇంటర్వ్యూలను నిర్వహించి సంస్థ ప్రతినిధులు 52 మందిని గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వారికి రూ.3 లక్షలు వార్షిక వేతనం లభిస్తుందని వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి తెలియజేశారు.

## క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 36 మంది ఎంపిక



విజయపురిసౌత్, అక్టోబరు 27 ప్రభాతవార్త: స్థానిక న్యూటన్స్ కళాశాలలో తమిళనాడుకు చెందిన రేనాల్ట్ నిస్సాన్ ఆటోమోటివ్స్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 36 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జగదీశ్వరరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ బి.నరసింహారావు, టీపీఓ డి.రామ్మోహన్‌రెడ్డి, ఇతర హెచ్‌ఓడీలు అభినందించారు.

## గంటా కిషోర్‌కు అబ్దుల్ కలాం జాతీయ అవార్డు

గురజాల, అక్టోబరు 27 ప్రభాతవార్తః విద్యారంగంలో అంకితభావంతో పనిచేస్తున్న గురజాలలోని జేఆర్‌ఆర్ నవోదయా డిగ్రీ కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకుడు గంటా కిషోర్ కిషోర్ ప్రతిష్టాత్మక గౌరవాన్ని పొందారు. దేశ వ్యాప్తంగా ప్రతిభావంతులైన వ్యక్తులకు ప్రతి యేటా ప్రధానం చేసే ప్రతిష్టాత్మక డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారం 2025ను కిషోం కుమార్ అందుకున్నారు. గుంటూరులో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ వహీద్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎస్‌పిఎల్‌టివో సభ్యుల చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పేరం వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్‌లు సీతారామయ్య, అంకిరెడ్డి, కోటిరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.



## తుపానుపై వ్యసాయాధికారుల సమీక్ష



మాచర్ల, అక్టోబరు 27 ప్రభాతవార్త: మాచర్ల నియోజకవర్గ పరిధిలోని అయిదు మండలాల వ్యవసాయ అధికారులతో జిల్లా వ్యవసా యాధికారి యం.జగ్గారావు మెంథా తుపానుపై సన్నద్ధత సమావేశం నిర్వహించారు. మాచర్ల మార్కెట్ యార్డులోని వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు తుపానుపై అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి కోతలు నిర్వహించవద్దన్నారు. తుపాను ప్రభావాన్ని బట్టి పంట చేలలో కాలువలు తీసి, నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి పంట నీటికి తడిచినట్లయితే మల్టీ-కె (13-0-45) ఎకరాకు కేజీ చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఆకులు ఎర్రబడకున్నా మెగ్నీషియం సల్ఫేట్ పిచికారీ చేసుకోవాన్నారు. మండల వ్యవసాయాధికారులు వారి పరిధిలో అన్ని గ్రామాల రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మాచర్ల సహాయ వ్యవసాయ సంచాలకులు వి.జగదీశ్వరరెడ్డి, అయిదు మండలాల వ్యవసాయాధికారులు డి.పాపకుమారి, కె.లక్ష్మారెడ్డి, వై.అమీర్‌రెడ్డి, టి.బాలాజీ గంగాధర్, పి.నరసింహారావు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి ఆర్థిసాయం



కారంపూడి, అక్టోబరు 27 ప్రభాతవార్త: మాచర్ల ఎమ్మెల్యే కుమారుడి రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్తున్న సమయంలో గుండెపోటుతో మృతి చెందిన కారంపూడికి చెందిన మట్టపల్లి శ్రీనివాసరావు మట్టి ఖర్చుల కోసం రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. శ్రీనివాసరావు మృతదేహాన్ని టీడీపీ నేతలు సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. కుటుంబానికి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షులు గోళ్ల సురేష్ యాదవ్, సీనియర్ నాయకులు మునుగోటి సత్యం, చప్పిడి రాము, బోల్నేడి శ్రీనివాసరావు, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జానీ, పట్టణ అధ్యక్షులు బొమ్మిన శేషగిరి, సొసైటీ అధ్యక్షుడు నాగారపు రామకృష్ణ, బోల్నేడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 'కృష్ణ లీల' మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నా
## ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో నిర్మాత సురేష్ బాబు



యంగ్ ట్యాలెంటెడ్ దేవన్ హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న సూపర్ నేచురల్ లవ్ స్టోరీ 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం'అనేది ట్యాగ్ లైన్. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్ గా నటిస్తోంది. బేబీ వైష్ణవి సమర్పణలో మహాసేన్ విజువల్స్ బ్యానర్ పై జ్యోత్స్న జి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కథ మాటలు అనిల్ కిరణ్ కుమార్ జి అందించారు. ఈ సినిమా టైటిల్ మోషన్ పోస్టర్, టీజర్, ఫస్ట్ సింగిల్ కి కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ రోజు మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో మాజీ సిబిఐ జే.డి.లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ, యువతరం ఏది చేసినా ప్యాషన్ తో చేయమని చెబుతుంటాను. అలాంటి పాషన్‌తో వర్క్ చేస్తున్న దేవన్‌ని చూసిన తర్వాత ఎలాగైనా ఈ అబ్బాయిని సపోర్ట్ చేయాలనిపించింది. రామానాయుడు తెలుగు సినిమాకి చేసిన సేవలు అమోఘం ఆయన మూవీ మొఘల్. చదువుకున్న రోజుల నుంచి ఆయనతో నాకు మంచి అనుబంధం ఉంది. సురేష్ బాబు ఈ ట్రైలర్‌ని లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. రైటర్ కిరణ్ కుమార్ మాకు మంచి ఫ్రెండ్. ఆయన ఆలోచనలు చాలా బాగుంటాయి. ఈ సినిమా చాలా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను. అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్.నిర్మాత సురేష్ బాబు మాట్లాడుతూ, . అనిల్ చాలా అద్భుతంగా ఈ స్టోరీ ని రాశారు. చాలా పాజిటివ్ గా ఉంది. నిర్మాత జోష్ణకి బెస్ట్ విషెస్. దేవన్ హీరోగా డైరెక్టర్ గా వస్తున్నారు, చాలా పాషన్ తో తీశారు. తప్పకుండా సినిమాకి మంచి పాజిటివ్ రిజల్ట్ ఉంటుంది. ఈవెంట్ కి వచ్చి జెడికి థాంక్యూ. సినిమాకి పాజిటివ్ రిజల్ట్ ఉంటుంది. అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. హీరో దేవన్ మాట్లాడుతూ, సురేష్ బాబుకి లక్ష్మినారాయణకి కృతజ్ఞతలు. సురేష్ బాబు గారు మాకు చాలా సపోర్ట్ చేశారు. అలాగే ఇండస్ట్రీలో చాలామంది పాజిటివ్‌గా రెస్పాండ్ అయ్యారు. హానెస్ట్‌గా సినిమా తీస్తే అందరూ సపోర్ట్ చేస్తారని మా కృష్ణలీల సినిమా మరోసారి ప్రూవ్ చేసింది. కృష్ణ లీల ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ. ప్రేమంటే ఒక త్యాగం ప్రేమంటే ఒక యుద్ధం. మనం ప్రేమించిన వారి కోసం మనం ఎంత దూరం వెళ్తాం ఏ స్థాయి వరకు వెళ్తామనేది అసలైన ప్రేమ. ప్రేమ కోసం ఎన్ని త్యాగాలైనా యుద్ధాలు అయినా చేస్తూనే ఉండాలి చివరిగా ప్రేమను గెలిపించడమే నిజమైన ప్రేమ. ఆ ప్రేమని కృష్ణ లీలలో చాలా వండర్ఫుల్‌గా థ్రిల్లింగ్ గా చూపించాం. ఈ సినిమాకి రండి. వండర్ఫుల్ ఎక్స్పీరియన్స్ ఉంటుంది. నాకు ఈ అవకాశం ఇచ్చిన అందరికీ థాంక్యూ.హీరోయిన్ ధన్య బాలకృష్ణ మాట్లాడుతూ, సురేష్ బాబుకి, జెడి లక్ష్మీనారాయణకి హృదయపూర్వక కృతజ్ఞతలు. చాలా సిన్సియర్‌గా తీసిన సినిమా ఇది. నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా సినిమా తీశారు. దేవన్ చాలా హార్డ్ వర్క్ తో ఈ ప్రాజెక్ట్ ని మీ ముందుకు తీసుకు వస్తున్నాడు. ఈ సినిమాని అందరూ సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను. నిర్మాత జ్యోత్స్న మాట్లాడుతూ, ఇది టీం వర్క్. మా నటీనటులు టెక్నికల్ టీం చాలా అద్భుతంగా వర్క్ చేశారు. దేవన్ చాలా అద్భుతంగా సినిమాని ముందుకు తీసుకెళ్లారు. ధన్య చాలా చక్కగా నటించారు. ఈ సినిమా తప్పకుండా మీ అందరిని అలరిస్తుంది.రైటర్ అనిల్ కిరణ్ మాట్లాడుతూ. ప్రేమనేది ఒక త్యాగం. ఒకరపట్ల మంచి భావం. ఇలాంటి గొప్ప లక్షణాల్లో ఎవరు కలిగి ఉంటారో వాళ్ళే ఈ ప్రేమ అనే ఫీలింగ్ ని మరొకరికి ఇవ్వగలరు. ఇందులో ప్రేమ కథ రెగ్యులర్ ఫార్మెట్ లో కాకుండా చాలా కొత్తగా ఉంటుంది. కచ్చితంగా ఈ జనరేషన్ పై ఈ ప్రేమ కథ చాలా ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది. దేవన్ అద్భుతంగా నటించారు.చాలా హార్డ్ వర్క్ చేశారు. ఇక్కడికి సపోర్ట్ చేయడానికి వచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.నటీనటులు: దేవన్, ధన్య బాలకృష్ణన్, వినోద్ కుమార్, పృధ్వి (పెళ్లి), రవి కాలే, తులసి, 7ఆర్ట్ సరయు, ఆనంద్ భరత్,సిబ్బంది:దర్శకత్వం : దేవన్, నిర్మాత : జ్యోత్స్న బ్యానర్: మహాసేన్ విజువల్స్ కథ,సంభాషణలు అనిల్ కిరణ్ కుమార్ జి డీవోపీ : సతీష్‌ముత్యాల,సంగీతం: భీమ్స్: సిసిరోలియో .

# వెంకీ అట్లూరి సినిమాలో బాలీవుడ్ హీరోయిన్ రవీనా టండన్



వెంకీ కోలీవుడ్ స్టార్ హీరో సూర్య లీడ్ రోల్ లో వెంకీ అట్లూరి డైరెక్షన్ లో తెరకెక్కుతున్న సినిమా సెట్స్ మీద కోలీవుడ్ స్టార్ హీరో సూర్య లీడ్ రోల్‌లో వెంకీ అట్లూరి డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న సినిమా సెట్స్ మీద ఉంది. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లో రూపొందుతున్న ఈ సినిమాలో మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుంది. ఐతే సినిమాలో బాలీవుడ్ ఒకప్పటి స్టార్ హీరోయిన్ రవీనా టాండన్ నటిస్తున్నట్టు తెలుస్తుంది. రవీనా టాండన్ తెలుగు ఆడియన్స్‌కు సుపరిచితురాలే. బాలకృష్ణతో బంగారు బుల్లోడు, నాగార్జునతో ఆకాశవీధిలో సినిమాలు చేసింది రవీనా. అప్పట్లోనే తన గ్లామర్ తో తెలుగు ఆడియన్స్ మనసులు గెలుచుకుంది. రవీనా టాండన్.. హీరోయిన్‌గా సినిమాలు చేయకపోయినా సినిమాలు, వెబ్ సీరీస్ లతో తన ప్రెజన్స్‌తో సర్ ప్రైజ్ చేస్తుంది. యష్, ప్రశాంత్ నీల్ కాంబోలో వచ్చిన కె.జి.ఎఫ్ 2లో నటించింది రవీనా టాండన్. .ఐతే ఇన్నాళ్లకు రవీనా మళ్లీ తెలుగు తెరపై కనిపించబోతుంది.

ఈ సినిమాలో ఆమె పాత్ర కూడా ఆడియన్స్‌ని సర్ ప్రైజ్ చేస్తుందని అంటున్నారు. తొలిప్రేమ, సార్, లక్కీ భాస్కర్ సినిమాలతో సక్సెస్ అందుకున్న డైరెక్టర్ వెంకీ అట్లూరి ఈసారి సూర్యతో మరో డిఫరెంట్ కథతో రాబోతున్నారు. ఈ సినిమాలో రాధికశరత్ కుమార్ కూడా మరో ఇంపార్టెంట్ రోల్ లో నటిస్తున్నారు.

# 36 మిలియన్ వ్యూస్‌తో 13 రోజులుగా ఇండియాలో నంబర్ 1 ట్రెండింగ్

మెగాస్టార్ చిరంజీవి 'మన శంకరవరప్రసాద్ గారు' ఫస్ట్ సింగిల్




మీసాల పిల్ల వైరల్ సెన్సేషన్, 36 మిలియన్ వ్యూస్‌తో గత 13 రోజులుగా ఇండియాలో నంబర్ 1 ట్రెండింగ్ మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ సింగిల్ మీసాల పిల్లతో మెగాస్టార్ చిరంజీవి ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ ఎనర్జిటిక్ మెలోడీ ఇన్స్టంట్ చార్ట్‌బస్టర్‌గా మారడమే కాకుండా, తెలుగు పాటకు దేశవ్యాప్తంగా అరుదైన ఘనతను సాధించింది.విడుదలైన కొద్ది రోజుల్లోనే, మీసాల పిల్ల యూట్యూబ్ మ్యూజిక్ ఇండియాలో నంబర్ 1 స్థానానికి చేరుకుంది, వరుసగా 13 రోజులు అగ్రస్థానాన్ని కొనసాగించి 36 మిలియన్లకు పైగా వ్యూస్ సంపాదించింది. ఈ పాట పాన్‌ఇండియా సంచలనంగా మారింది, నేషనల్ మ్యూజిక్ స్టేజ్ పై తెలుగు సినిమాకు ఇది ప్రౌడ్ మూమెంట్.మన శంకర వర ప్రసాద్ గారు పండుగ వాతావరణంలో కుటుంబ భావోద్వేగాలు, వినోదం, నాస్టాల్జియాతో నిండిన ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది.'మీసాల పిల్ల' పాట చిరంజీవి టైమ్‌లెస్ చార్మ్, అద్భుతమైన డాన్స్ మూవ్స్, హ్యూమర్ తో ఆకట్టుకుంటోంది. ఇందులో హీరోయిన్‌గా నటించిన నయనతారతో ఆయన కెమిస్ట్రీ కొత్తదనాన్ని తీసుకొచ్చింది.ఈ పాటలోని ఎనర్జిటిక్ బీట్‌లు సంగీత దర్శకుడు భీమ్స్ సెసిరోలియో అద్భుతంగా సమకూర్చారు. ఉదిత్ నారాయణ్, శ్వేతా మోహన్ వోకల్స్ పాటకు నాస్టాల్జిక్ టచ్ ఇచ్చి అందరికీ ఒకేలా కనెక్ట్ అవుతోంది.

ఈ పాటలోని క్యాచీ హుక్ స్టెప్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానులు పెద్ద ఎత్తున రీ క్రియేట్ చేస్తున్నారు.విక్టరీ వెంకటేష్ ఈ చిత్రంలో పూర్తి స్థాయి కీలక పాత్రలో కనిపించనుండటం సినిమా మీద అంచనాలను మరింత పెంచింది. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ హైదరాబాద్‌లోని భారీ సెట్‌పై వేగంగా సాగుతోంది.

సాహూ గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 సంక్రాంతి గ్రాండ్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది.

# 'జటాధర 'ఖచ్చితంగా గ్రేట్‌ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది: శిల్పా శిరోద్కర్



నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించే ఈ పాన్‌ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరు ణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హాల్, నిఖిల్ నందా నిర్మించారు. ఈ చిత్రంలో శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషించారు. జటాధర నవంబర్ 7న హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**చాలా ఏళ్ల తర్వాత మళ్లీ ఈ సినిమాతో తెలుగులో రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది ?**

బ్రహ్మ తర్వాత ఈ సినిమాతో మళ్లీ తెలుగులోకి వస్తున్నాను. చాలా ఆనందంగా ఉంది. ఇందులో శోభ అనే క్యారెక్టర్ కనిపిస్తాను. చాలా ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్. తనకి డబ్బంటే అత్యాశ. ఎలాగైనా సరే రిచ్ అయిపోవాలి అనుకునే క్యారెక్టర్. సినిమాలో చాలా ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తుంది.ఈ క్యారెక్టర్ ప్లే చేయడం చాలా చాలెంజింగ్ గా అనిపించింది.జటాధరతో రీఎంట్రీ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది.

**సుధీర్ బాబుతో వర్క్ చేయడం ఎలా అనిపించింది ?**

సుధీర్ బాబుతో కలిసి వర్క్ చేయడం మంచి ఎక్స్పీరియన్స్. ఈ జనరేషన్ యాక్టర్స్ నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చు. సుదీర్ బాబుచాలా డెడికేషన్ తో ఈ ప్రాజెక్టు చేశారు. తన 100 ఎఫర్ట్ పెట్టారు. ఆయనతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం వండర్ఫుల్ ఎక్స్పీరియన్స్.

**జటాధర ఎలాంటి సినిమా?**

ఇది మంచి సూపర్ నేచురల్ థ్రిల్లర్. స్టన్నింగ్ విజువల్స్ ఉంటాయి. ఎమోషన్స్ కూడా చాలా అద్భుతంగా ఉంటాయి. మంచి మ్యూజిక్ ఉంటుంది. అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఖచ్చితంగా ఆడియన్స్ కి చాలా మంచి ఎక్స్పీరియన్స్ ఇస్తుంది.

**వెంకట కళ్యాణ్ అభిషేక్ డైరెక్షన్ గురించి?**

వెంకట్ అభిషేక్ చాలా క్లారిటీ ఉన్న డైరెక్టర్స్. యాక్టర్స్ నుంచి ఏం కావాలో వాళ్ళకి తెలుసు. ప్రతి యాక్టర్ నుంచి మంచి పెర్ఫార్మెన్స్ ని రాబట్టుకున్నారు.

**హిందీలో ఎలాంటి రెస్పాన్స్ ఉంది?**

సినిమా కోసం తెలుగు హిందీ అన్నిచోట్ల చాలా క్యూరియస్ గా ఎదురుచూస్తున్నారు. ట్రైలర్ రిలీజ్ అయిన తర్వాత అంచనాలు మరింతగా పెరిగాయి. నవంబర్ 7న ఖచ్చితంగా ఒక అద్భుతమైన సినిమాని చూడబోతున్నారు.

**మీకు ఇష్టమైన జానర్, డ్రీం రోల్?**

నాకు రొమాంటిక్ కామెడీలు ఇష్టం, మంచి సినిమాలు చేయడమే నా డ్రీం.

# '12ఎ రైల్వే కాలనీ' నవంబర్ 21న రిలీజ్



అల్లరి నరేష్ నటించిన యూనిక్ థ్రిల్లర్ '12ఎ రైల్వే కాలనీ' ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకుంది. పొలిమేర, పొలిమేర 2 చిత్రాలతో గుర్తింపు తెచుకున్న డాక్టర్ అనిల్ విశ్వనాథ్ ఈ చిత్రానికి షోరన్నర్‌గా వ్యవహరిస్తూనే కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు. ప్రతిష్టాత్మక శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రంలో నాని కాసరగడ్డ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆయనే ఎడిటర్.ఈరోజు ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. 12ఎ రైల్వే కాలనీ నవంబర్ 21న ప్రపంచవ్యాప్తంగా బిగ్ స్క్రీన్‌లలోకి రానుంది. ఆ వారంలో బిగ్ రిలీజెస్ ఏవీ లేకపోవడంతో ఈ చిత్రంకు బాక్సాఫీస్ వద్ద స్ట్రాంగ్ ఎడ్వాంటేజ్ కానుంది.రిలీజ్ డేట్ పోస్టర్‌లో అల్లరి నరేష్ ఎనర్జిటిక్ డ్యాన్స్ ఫోజ్‌లో డ్యాన్సర్స్ గ్రూప్‌తో కలిసి కనిపిస్తున్నారు. మేకర్స్ విడుదల చేసిన స్పెషల్ వీడియో ఆకట్టుకుంది.ఈ సినిమా టైటిల్ టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అల్లరినరేష్ ఈ చిత్రంలో డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రను పోషిస్తున్నారు. పొలిమేర సిరీస్‌లో ఆకట్టుకున్న డాక్టర్ కామాక్షి భాస్కర్ల ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. సాయికుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, జీవన్ కుమార్, గగన్ విహారి, అనిష్ కురువిల్లా, మధుమణి కీలక పాత్రలు పోషించారు.కుశేంద్ర రమేష్ రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.విడుదల తేదీని ప్రకటించడంతో, మేకర్స్ త్వరలో ప్రమోషనల్ కాంపైయన్‌ని వేగవంతం చేయడానికి సిద్ధమవుతున్నారు.నటీనటులు: అల్లరి నరేష్, డాక్టర్ కామాక్షి భాస్కర్ల, సాయికుమార్, వైవాహర్ష, గెటప్ శ్రీను, సద్దాం, జీవన్‌కుమార్, గగన్ విహారి, అనీష్ కురువిల్లా, మధుమణి.సాంకేతిక సిబ్బంది:బ్యానర్: శ్రీనివాస సిల్వర్ స్క్రీన్‌నిర్మాత: శ్రీనివాస చిట్టూరి, సమర్పణ: పవన్ కుమార్‌కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్,షోరన్నర్: డాక్టర్ అనిల్ విశ్వనాథ్‌ఎడిటర్,డైరెక్టర్: నాని కాసరగడ్డ, డిఓపి: కుశేందర్ రమేష్ రెడ్డి,సంగీతం: భీమ్స్ సిసిరోలియోవిఎఫ్‌ఎక్స్: త్రివేణి కాసరగడ్డ (నియో స్టూడియోస్)సౌండ్ డిజైన్: రఘునాథ్‌డిఐ: అన్నపూర్ణ స్టూడియోస్,కలరిస్ట్ : రఘు తమ్మారెడ్డిసౌండ్‌మిక్స్ ఇంజనీర్: కృష్ణ రాజ్ .

# 'బ్యాడ్ బాయ్ కార్తీక్' నుంచి అందమైన ఫిగరు నువ్వా సాంగ్ రిలీజ్



హీరో నాగశౌర్య కంప్లీట్‌యాక్షన్ ఎంటర్‌టైనర్ బ్యాడ్‌బాయ్ కార్తీక్‌లోపవర్‌ఫుల్ పాత్రలో ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. నూతన దర్శకుడు రామ్ దేసినా (రమేష్) దర్శకత్వంలో శ్రీ వైష్ణవిఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు సూపర్ హిట్ అయ్యాయి. టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా అందమైన ఫిగరు నువ్వా సాంగ్ రిలీజ్ చేశారు మేకర్స్. హారిస్ జయరాజ్ రొమాంటిక్ ఫుట్ ట్యాపింగ్ నెంబర్ గా కంపోజ్ చేశారు. కృష్ణకాంత్ ఆకట్టుకునే లిరిక్స్ రాశారు. శ్రీధర్ సేన, ప్రియా జెర్సన్ వోకల్స్ మరింత మెలోడీని యాడ్ చేశాయి. సాంగ్‌లో నాగ శౌర్య, విధి కెమిస్ట్రీ అదిరిపోయింది. ఈ సాంగ్‌కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈచిత్రంలో సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, వెన్నెల కిషోర్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్‌కుమార్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఈ చిత్రానికి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రసూల్ ఎల్లోర్ డీవోపీగా పని చేస్తున్నారు. రామాంజ నేయులు ఆర్ట్ డైరెక్టర్ కాగ, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్. నటీనటులు: నాగ శౌర్య, విధి, సముద్రఖని, నరేష్ వీకే, సాయికుమార్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్‌కుమార్, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, పృథ్వీ, అజయ్, ప్రియ నెల్లాలు

# ట్రాలాలా ప్రొడక్షన్ నెం.2గా 'మా యింటి బంగారం ' ప్రారంభం


ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ ప్రొడక్షన్ నెం.2గా ప్రారంభమైన 'మా ఇంటి బంగారం ' ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.2గా మా ఇంటి బంగారం'ను సగర్వంగా ప్రారంభించినట్లు అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ ఏడాది బ్యానర్ నుంచి వచ్చిన 'శుభం'సినిమా బ్లాక్ బస్టర్ అయిన సంగతి తెలిసిందే. 'మా ఇంటి బంగారం సినిమాలో సమంత, దిగంత్, గుల్షన్ దేవయ్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సీనియర్ నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి సమంత, రాజ్ నిడుమోరు, హిమాంక్ దువ్వూరు నిర్మాతలు. ఓ బేబి వంటి బ్లాక్ బస్టర్ తర్వాత సమంత, నందినీ రెడ్డి కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా ఇది.

ఈ చిత్రానికి ఓం ప్రకాష్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా... సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్నారు. సీతా మీనన్. వసంత్ మరిన్‌గంటి కథ, స్క్రీన్‌ప్లే అందించారు. పల్లవి సింగ్ కాస్ట్యూమర్, ఉల్లాస్ హైదర్ ప్రొడక్షన్ డిజైనర్, ధర్మేంద్ర కాకరాల ఎడిటర్‌గా వర్క్‌చేస్తున్నారు.సన్నిహితులు, శ్రేయోభిలాషుల ఆత్మీయ కలయిక, ఆశీర్వాదాలతో సినిమా ప్రారంభమైంది. మూవీ ఫస్ట్ లుక్‌ను గమనిస్తే గ్రిప్పింగ్ యాక్షన్ డ్రామాగా అనిపించింది. అద్భుతమైన యాక్షన్ బ్యాంగ్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తామని ఈ సందర్భంగా మేకర్స్ తెలియజేశారు. సినిమా షూటింగ్ ప్రారంభమైందని, మరిన్ని వివరాలను తెలిజేస్తామని మేకర్స్ పేర్కొన్నారు.



# 'సంతాన ప్రాప్తిరస్తు' మ్యూజికల్ హిట్ అవుతుంది
## సాంగ్ లాంచ్ ఈవెంట్ లో ప్రొడ్యూసర్ సురేష్ బాబు

విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న సినిమా "సంతాన ప్రాప్తిరస్తు". ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. "సంతాన ప్రాప్తిరస్తు "సినిమా నవంబర్ 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఈ సినిమా నుంచి తెలుసా నీ కోసమే లిరికల్ సాంగ్ ను ప్రొడ్యూసర్ సురేష్ బాబు అతిథిగా రిలీజ్ చేశారు. "ఆయ్", "సేవ్ ది టైగర్స్"వంటి సక్సెస్ ఫుల్ ప్రాజెక్ట్స్ కు వర్క్ చేసిన టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ అరసాడ తెలుసా నీ కోసమే. పాటను బ్యూటిఫుల్ గా కంపోజ్ చేశారు. శ్రీమణి ఆకట్టుకునే లిరిక్స్ అందించగా.. అర్మాన్ మాలిక్ మనసుకు హత్తుకునే పాడారు. ఈ సాంగ్ లాంఛ్ ఈవెంట్ లో.. స్క్రీన్ ప్లే రైటర్‌షేక్ దావూద్. జి. మాట్లాడుతూ, జనాభాలో భారత్ చైనాను దాటేసింది. మనది ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశం. మరోవైపు ఐవీఎఫ్, ఫర్టిలిటీ సెంటర్స్ చాలా పెరిగాయి. ఎందుకు అనే పాయింట్ ను డిస్కస్ చేస్తూ ఎంటర్ టైనింగ్ వే లో రాసుకున్న స్టోరీ ఇది. 'సంతాన ప్రాప్తిరస్తు' మంచి ఎంటర్ టైనింగ్ మూవీ. మీరంతా ఫ్యామిలీతో కలిసి ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుంది. ఈ చిత్రంలో మంచి వినోదం ఉంటుందని మేమంతా గట్టిగా చెప్పగలం. మా సినిమాకు మీరంతా సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాం. అన్నారు.వప్రొడ్యూసర్ మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, అత్యధిక జనాభా ఉన్న మన దేశంలో పెద్ద సంఖ్యలో ఫర్టిలిటీ సెంటర్స్ ఉన్నాయి. ఈ పాయింట్ నుంచే కథ మొదలైంది. పిల్లలు పుట్టకపోవడం అనేది బిజీ లైఫ్ లో ఉన్న సాఫ్ట్ వేర్ ఇంజినీర్స్‌గానీ ఇతర ప్రొఫెషన్స్‌లో ఉన్న వాళ్ల జీవితాల్లో పెద్ద సమస్యగా మారింది. ఆయనకు టీజర్, ట్రైలర్ చూపించాం. "సంతాన ప్రాప్తిరస్తు సినిమా కాంటెంపరరీగా ఉంటూ ఎంటర్ టైన్ చేస్తుంది, ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది. తెలుసా నీ కోసమే బ్యూటిఫుల్ సాంగ్, కథలోనుంచి వచ్చిన పాట ఇది. తప్పకుండా ఛాట్ బస్టర్ అవుతుంది. డైరెక్టర్ సంజీవ్ సిన్సియర్‌గా వర్క్ చేస్తారు. ఏబీసీడీ మూవీ నుంచి మేము కలిసి ట్రావెల్ చేస్తున్నాం. ఈ కథకు మంచి హీరో కావాలని చాలా రోజులు చూశాం. మాకు విక్రాంత్ దొరికాడు.నిర్మాత సురేష్ బాబు మాట్లాడుతూ, 'సంతాన ప్రాప్తిరస్తు'టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా.ఆయన సాఫ్ట్ వేర్ ఇంజినీర్ నుంచి ప్రొడ్యూసర్‌గా మారారు. సినిమా అంటే ఎంతో ప్యాషన్ తో ఉంటారు. ఆయన ఎఫర్ట్స్ ఎప్పుడూ ఫెయిల్ కాలేదు. 'సంతాన ప్రాప్తిరస్తు' సాంగ్స్ చాలా బాగున్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ కు కంగ్రాట్స్. ఈ సినిమా మంచి మ్యూజికల్ హిట్ కావాలని కోరుకుంటున్నానని అన్నారు.



# బంగ్లా మ్యాప్‌లో భారత్ భూభాగాలు!

## వివాదాస్పద మ్యాప్‌ను పాక్ ఆర్మీ-చీఫ్‌కు అందించిన యూనస్




**ఢాకా, అక్టోబరు 27:** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహమ్మద్ యూనస్ మరోసారి భారత్‌తో దౌత్యపరమైన ఉద్రిక్తతలకు కారణమయ్యారు. భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలను బంగ్లాదేశ్‌లో అంతర్భాగంగా చూపిస్తున్న ఒక వివాదాస్పద మ్యాప్‌ను పాకిస్థాన్ ఆర్మీ ఉన్నతాధికారికి ఆయన బహుమతిగా ఇవ్వడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ చర్య ద్వారా భారత్ సార్వభౌమత్వాన్ని యూనస్ పరోక్షంగా ప్రశ్నించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల పాకిస్థాన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్మన్ జనరల్ సాహిర్ షంషాద్ మీర్జా ఢాకాలో పర్యటించారు. యూనస్‌తో భేటీ తర్వాత, యూనస్ స్వయంగా తన ట్విట్టర్ ఖాతాలో కొన్ని ఫొటోలను పోస్ట్ చేశారు. వాటిలో, పాక్ జనరల్‌కు ఆర్ట్ ఆఫ్ ట్రయంఫ్ అనే పుస్తకాన్ని బహుమతిగా ఇస్తున్న చిత్రం ఉంది. అయితే, ఆ పుస్తకం ముఖచిత్రంపై ఉన్న మ్యాప్‌లో భారత్‌లోని ఏడు ఈశాన్య రాష్ట్రాలను బంగ్లాదేశ్ భూభాగంలో కలిపి చూపించారు. ఇది తీవ్రవాద ఇస్లామిక్ సంస్థలు కోరుతున్న గ్రేటర్ బంగ్లాదేశ్ వాదనకు బలం చేకూర్చేలా ఉంది. ఈ ఫొటో బయటకు రావడంతో సోషల్ మీడియాలో యూనస్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అనవసరంగా భారత్ అంతర్గత విషయాల్లోకి ప్రవేశిస్తున్నారని నెటిజన్లు విమర్శిస్తున్నారు. అయితే ఈ వివాదంపై భారత విదేశాంగ శాఖ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. 1971 విమోచన యుద్ధం తర్వాత చారిత్రాత్మకంగా దెబ్బతిన్న బంగ్లాదేశ్‌పాకిస్థాన్ సంబంధాలు, యూనస్ అధికారంలోకి వచ్చాక మెరుగు పడుతున్నాయనడానికి ఈ భేటీ నిదర్శనంగా నిలుస్తోంది. యూనస్ భారత్ ఈశాన్య రాష్ట్రాల గురించి మాట్లాడటం ఇది మొదటిసారి కాదు. గత ఏప్రిల్‌లో చైనా పర్యటనకు వెళ్లినప్పుడు, "భారత్‌లోని ఏడు ఈశాన్య రాష్ట్రాలు భూపరివేష్టిత ప్రాంతాలు. సముద్రానికి చేరుకోవడానికి వాటికి మార్గం లేదు. ఆ ప్రాంతానికి సముద్ర సంరక్షకులం మేమే అని వ్యాఖ్యానించి ఢిల్లీకి ఆగ్రహం తెప్పించారు. చైనా తన ఆర్థిక కార్యకలాపాలను ఈ ప్రాంతంలో విస్తరించుకోవడానికి ఇది మంచి అవకాశమని ఆయన సూచించారు. యూనస్ వ్యాఖ్యల తర్వాత భారత్ తీవ్రంగా స్పందించింది. బంగ్లాదేశ్ వస్తువులు భారత భూభాగం గుండా నేపాల్, భూటాన్‌లకు వెళ్లేందుకు వీలు కల్పించే రవాణా ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది. దీనికితోడు, యూనస్ సన్నిహితులు కూడా గతంలో గ్రేటర్ బంగ్లాదేశ్ మ్యాప్‌లను సోషల్ మీడియాలో షేర్ చేయడం, భారత్‌పైరెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వంటివి చేశారు. వరుస ఘటనలపై యూనస్ మౌనంగా ఉండటం, ఇప్పుడు స్వయంగా వివాదాస్పద మ్యాప్‌ను బహుమతిగా ఇవ్వడం చూస్తుంటే.. చైనా, పాకిస్థాన్‌ల మద్దతుతో ఈ ప్రాంతంలో రాజకీయ సమీకరణాలను మార్చేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని అంతర్జాతీయ సంబంధాల నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# వాణిజ్య ఒప్పందం దిశగా భారత్ - అమెరికా చర్చలు



- ఆసియాన్ సదస్సు వేదికగా సమాలోచనలు
- మార్కో రూబియోతో జైశంకర్ సమావేశం
- అటు యూఎస్‌లో జీన్ షాహీన్‌తో భారత్ రాయబారి భేటీ
- వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడి

**కౌలాలంపూర్, అక్టోబరు 27:** భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరే దిశగా చర్చలు కొనసాగుతున్నాయి. భారత్ వస్తువులపై అమెరికా విధించిన శిక్షాత్మక సుంకాల కారణంగా దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించడానికి రెండు వైపులా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరుగుతున్న ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు వేదికగా భారత్ విదేశాంగ మంత్రి, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో కీలక చర్చలు జరిపారు. మలేసియా వేదికగా ఆసియాన్ శిఖరాగ్ర సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశాలకు ప్రధాని మోదీ గైర్హాజరయ్యారు. మోదీ తరఫున భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మలేసియాకు వెళ్లారు. ఈ సందర్భంగా అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోను జైశంకర్ కలిశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు, ద్వైపాక్షిక సంబంధాలు, ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులపై జైశంకర్- రూబియో చర్చించారు. ఈ మేరకు జైశంకర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "ఈ ఉదయం కౌలాలంపూర్‌లో రూబియోని కలవడం ఆనందంగా ఉంది. ద్వైపాక్షిక సంబంధాలతోపాటు ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై చర్చలు జరిగాయి" అని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య కీలక చర్చలు జరిగినట్లుగా పేర్కొన్నారు. ఇంబంధించిన ఫొటోలను కూడా పంచుకున్నారు. ఆదివారం జైశంకర్ మలేసియా ప్రధానమంనరతి అన్వర్ ఇబ్రహీం, సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్, థాయ్‌లాండ్ విదేశాంగ మంత్రి సిహాసక్ ఫువాంగ్కెట్కియోలతో విడివిడిగా చర్చలు జరిపారు. ఇదిలా ఉంటే అమెరికాలో భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, సెనేట్ విదేశీ సంబంధాల కమిటీ ర్యాంకింగ్ సభ్యురాలు జీన్ షాహీన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరస్పరం ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం, ఇంధన భద్రత, చమురు, గ్యాస్ వాణిజ్యం గురించి చర్చించారు. ఇరు దేశాలకు సంబంధించిన కీలక చర్చలు జరిగినట్లుగా వినయ్ మోహన్ క్వానరాతా ఎక్స్‌లో తెలిపారు. ఈ సందర్భంగా రష్యా-ఉక్రెయిన్ వివాదంపై భారత ప్రధాని మోదీ వైఖరిని రాయబారి క్వాత్రా స్పష్టంగా తెలియజేశారు. మరోవైపు వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, భారత్- అమెరికా మధ్య వాణిజ్య చర్చలు బాగా పురోగమిస్తున్నాయని, రెండు వైపులా చాలా అంశాలపై కమ్యూనికేట్ అవుతున్నాయని, పరస్పర ప్రయోజనకరమైన ఒప్పందం ఆసన్నమైందని సూచించారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై మనం చాలా దగ్గరగా ఉన్నట్లు భావిస్తున్నట్లు అగర్వాల్ తెలిపారు. భారత్- అమెరికా మధ్య వాణిజ్య చర్చలు సుదీర్ఘంగా సాగుతున్నాయి. భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం మొదటి దశ కోసం ఇప్పటి వరకు ఐదు రౌండ్ల చర్చలు పూర్తయ్యాయి. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం ముగింపునకు చాలా దగ్గరగా ఉంది. భారత్‌పై తొలుత 25శాతం సుంకాన్ని ట్రంప్ వేశారు. అనంతరం రష్యాతో సంబంధాలు పెట్టుకున్నందుకు జరిమానాగా మరో 25శాతం సుంకం విధించారు. ఇలా మొత్తంగా భారత్‌పై 50శాతం సుంకం పడింది. అయితే రష్యాతో సంబంధాలు తెంచుకుంటే సుంకాలు తగ్గిస్తామని అమెరికా అంటోంది. ప్రస్తుతం రష్యా దగ్గర చమురు కొనుగోలు తగ్గించేందుకు భారత్ ప్రయత్నిస్తోంది.

## పాక్- అఫ్ఘాన్ సమస్య పరిష్కరిస్తా

# మధ్యవర్తిత్వానికి సిద్ధం

## ఆసియాన్ సదస్సులో ట్రంప్




**కౌలాలంపూర్, అక్టోబరు 27:** పాకిస్థాన్- అఫ్ఘనిస్థాన్ మధ్య నెలకొన్న వివాదాన్ని తానే పరిష్కరిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుకొచ్చారు. మలేషియాలో జరిగిన ఆసియాన్ సదస్సులో ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ మధ్య మళ్లీ వివాదం మొదలైందని విన్నాను. కానీ నేను దాన్ని చాలా త్వరగా పరిష్కరిస్తాను. వాళ్లిద్దరూ నాకు తెలుసు. మధ్యవర్తిత్వం నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నా అని వ్యాఖ్యానించారు. వివాదాలను పరిష్కరించడం తనకు బాగా చేతనైన పని అని, దీని ద్వారా లక్షలాది ప్రాణాలను కాపాడగలనని ట్రంప్ చెప్పుకొచ్చారు. గతంలో భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించడంలో తానే కీలకపాత్ర పోషించానని ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. ఇస్తాంబుల్ వేదికగా పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆసియాన్ సదస్సులో ప్రసంగించిన అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జపాన్ బయలుదేరి వెళ్లారు. టోక్యోలో ట్రంప్‌కు ఘనస్వాగతం లభించింది. జపాన్ ప్రధానమంత్రి సనాయి తకాచితో సమావేశమై, ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరుపనున్నారు. అనంతరం జపాన్- అమెరికా సదస్సులో పాల్గొననున్నారు.

# ఘూవిసిరిన లాయర్‌పై ధిక్కార చర్యలకు సుప్రీం నో!



**న్యూఢిల్లీ, అక్టోబరు 27:** భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఇటీవల షూ విసిరేందుకు ప్రయత్నించిన లాయర్‌పై కోర్టు ధిక్కార చర్యలు చేపట్టేందుకు అనుమతించేది లేదని సుప్రీంకోర్టు సోమవారం నాడు పేర్కొంది. ఈ విషయంపై సీజేఐ ఎలాంటి కేసు నమోదు చేయలేదని, లాయర్‌పై చర్యలు తీసుకోవడానికి సీజేఐ విముఖత చూపించారని తెలిపింది. లాయర్‌పై కోర్టు ధిక్కారణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఇటీవల పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. కోర్టు ధిక్కార నోటీసు జారీ చేయడం వల్ల సీజేఐపై షూ విసిరిన లాయర్‌కు అనవసర ప్రాధాన్యత ఇచ్చినట్టు అవుతుందని, ఈ ఘటన దానంతటదే సద్దుమణుగుతుందని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయ పడింది. విష్ణుమూర్తి విగ్రహానికి సంబంధించిన ఒక కేసులో సీజేఐ వ్యాఖ్యలకు నిరసనగా రాకేష్ కిషోర్ అనే అడ్వకేట్ ఈనెల 6న ఆయనపై షూ విసిరేందుకు ప్రయత్నించారు. భద్రతా సిబ్బంది అతన్ని అడ్డుకుని బయటకు పంపారు. సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదంటూ రాకేష్ కిషోర్ నినాదాలు చేశారు. కోర్టులో నినాదాలు చేయడం, షూ విసిరడం కోర్టు ధిక్కారణ కిందకు వస్తుందని, అయితే దీనిపై చట్టం ప్రకారం ముందుకు వెళ్లడం అనేది సంబంధిత న్యాయమూర్తిపై ఆధారపడి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలను పరిశీలిస్తామని కూడా తెలిపింది.

# మీకుటుంబంలో ఒకడిగా చూడండి!

## మృతుల కుటుంబాలను క్షమించమని కోరిన టివికె చీఫ్ విజయ్



**మహాబలిపురం, అక్టోబరు 27:** తమిళనాడు కరూర్‌లో టీవీకే చీఫ్, ప్రముఖ నటుడు విజయ్ నిర్వహించిన ప్రచార ర్యాలీలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో మృతుల కుటుంబాలను కలిసారు. వీరికోసం పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రిసార్టును బుక్‌చేసారు. ప్రతి కుటుంబానికి ఒక సూట్ చొప్పున బుక్‌చేసినటివికె పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమం మొత్తం సజావుగా సాగేటట్లు పర్యవేక్షించారు. భద్రతా కారణాల రీత్యా ఎక్కువమందిని మీడియాప్రతినిధులను కూడా అనుమతించలేదు. మీ కుటుంబంలో ఒకడిగా చూడాలని, ఏంసమస్య వచ్చినా తాను అండగా ఉంటానని టివికె చీఫ్ విజయ్ ఈసందర్భంగా మృతుల కుటుంబాల్లో భరోసా నింపారు. జరిగిన సంఘటన విషాదాంతమని ఈఘోరంపై తన ప్రమేయం లేకున్నా అందరూ క్షమించాలని నటుడు విజయ్ వారిని కోరారని పార్టీ నేతలు వెల్లడించారు. మహాబలిపురం లోని ఓ రిసార్ట్‌లో బాధిత కుటుంబాలతో సమావేశమయ్యారు. ప్రతికుటుంబాన్ని ఆయన ఆప్యాయంగా పలకరించారు. మృతులకు చెందిన 37 కుటుంబాలతో సహా 200 మందితో భేటీ అయ్యారు. ఈ మీటింగ్ కోసం టీవీకే దాదాపు 50 రూమ్స్‌ను బుక్ చేసింది. కరూర్‌తోపాటు ఇతర జిల్లాల్లో ఉన్న బాధిత కుటుంబాలను ప్రత్యేక బస్సుల్లో హోటల్‌కు తరలించారు. అక్కడ వారితో విజయ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రతీ కుటుంబం నుంచి నాలుగు నుండి ఐదుగురు వ్యక్తులు విజయ్‌ను కలవడానికి వచ్చారు. ప్రతి ఒక్కరినీ విజయ్ వ్యక్తిగతంగా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇక ఈ భేటీకి మీడియా సహా ఇతరులను అనుమతించలేదు. 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొత్త పార్టీని స్థాపించిన విజయం రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం మొదలుపెట్టారు. గత నెల 27న కరూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 60 మంది గాయపడ్డారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా విషాదాన్ని మిగిల్చింది. ఇక మృతుల కుటుంబాలకు టీవీకే ఆర్థిక సాయంగా రూ.20 లక్షలు అందజేసిన విషయం తెలిసిందే.

# డిజిటల్ అరెస్టు.. అత్యంత భయంకర ముప్పు

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆందోళన



**న్యూఢిల్లీ, అక్టోబరు 27:** డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను బెదరింపులకు గురిచేస్తూ.. భారీ మొత్తంలో డబ్బును కాజేస్తుండడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టును ప్రజలకు ఉన్న అత్యంత భయంకరమైన ప్రమాదాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఇటువంటి వాటిని ఎదుర్కోవాలంటే సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు సరైన అవగాహన కల్పించాలన్నారు. పోలీసుల పట్ల ప్రజలకు భయం ఉండకూడదని, వారు తమకు రక్షణగా నిలుస్తారనే గౌరవం ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రొబేషనరీ ఐపిఎస్‌లను ఉద్దేశించి ప్రసంగించిన ముర్ము ఈ వ్యాఖ్యలు చేశారు. సైబర్ నేరగాళ్లు విడియో కాల్స్ చేసి.. తాము పోలీసులమని బెదరిస్తారని.. తాము చెప్పినట్లు చేయకపోతే డిజిటల్ అరెస్టు చేస్తామని భయ పెడతారని ద్రౌపదీ ముర్ము అన్నారు. ఇటువంటి సమయాల్లో ప్రజలు చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ డిజిటల్ అరెస్టు ప్రభావం పోలీసు వ్యవస్థపైనా అధికంగా ఉంటుందన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసుల మాదిరి ప్రజలను నమ్మించి మోసం చేయడంతో.. అసలైన పోలీసులు ఎవరనే విషయాన్ని కూడా వారు గ్రహించలేకపోతారన్నారు. దీనిని నివారించాలంటే సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు, పోలీసులు నూతన సాంకేతికతపైనా పట్టు సాధించాలని సూచించారు.

# సంక్షిప్తంగా..

## బాలీవుడ్ యువ నటుడు సచిన్ ఆత్మహత్య




**ముంబై, అక్టోబరు 27:** బాలీవుడ్‌లో విషాదం నెలకొంది. యువ నటుడు సచిన్ చాంద్‌వడే (25) ఆత్మహత్య చేసుకున్నారన్న వార్త అందరినీ షాక్‌కు గురి చేస్తోంది. ఈ ఘటన కొన్ని రోజుల క్రితం జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్రలో ఉందిర్‌ఖేడ్‌లోని తన ఇంట్లో ఈ నెల 23న ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆయనను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో.. మరుసటిరోజు ఇంకో ఆస్పత్రికి తీసుకెళ్లాలనుకున్నా ఫలితం దక్కలేదు. చికిత్స పొందుతూనే సచిన్ ఈ నెల 24న మృతి చెందినట్లు సమాచారం. ఆత్మహత్యకు గల కారణం తెలియాల్సి ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన సచిన్.. నటన పై ఆసక్తితో చిత్ర పరిశ్రమలోకి వచ్చారు. 'జాంతాఢా 2' వెబ్‌సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్నారు.

## బ్రిటన్‌లో మరో సిక్కు యువతిపై లైంగిక దాడి

**లండన్, అక్టోబరు 27:** బ్రిటన్‌లో భారతీయ మూలాలున్న మహిళలపై జాత్యహంకార ప్రేరేపిత లైంగిక దాడులు పెరుగుతున్నాయి. గత నెలలో సిక్కు మహిళపై జరిగిన దారుణ ఘటన మరవక ముందే తాజాగా మరో 20 ఏళ్ల భారతీయ యువతిపై అత్యాచార ఘటన వెలుగులోకి వచ్చింది. పశ్చిమ మిడ్‌లాండ్‌లోని వాల్సల్ ప్రాంతంలో ఈ దారుణం చోటు చేసుకోగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు యుద్ధ ప్రాతిపదికన గాలింపు చర్యలు చేపట్టారు. యూకే కాలమానం ప్రకారం శనివారం రోజు సాయంత్రం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటన జరిగిన రోజే వాల్సల్ ప్రాంతంలో ఒక యువతిపై లైంగిక దాడి జరిగినట్లు వెస్ట్ మిడ్‌లాండ్స్ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆపై దర్యాప్తు చేపట్టారు.

## మరణశిక్ష విధించినా సమ్మతమే :దర్శన్ తరపు న్యాయవాది



**బెంగళూరు, అక్టోబరు 27:** చిత్రదుర్గకు చెందిన రేణుకాచార్య హత్య కేసులో నిందితుడు దర్శన్‌పై ఉన్న ఆరోపణలపై విచారణ పూర్తి చేసి, మరణశిక్ష విధించినా సమ్మతమేనని ఆయన తరఫు న్యాయవాది సునీల్ ఉన్నత న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. కారాగారంలో ఖైదీలకు ఇవ్వవలసిన కనీస సదుపాయాలను దర్శన్‌కు కల్పించలేదని వాదనలు వినిపించారు. దీనికి సంబంధించి 20 సార్లు బెయిలుకు అర్జీ వేసుకున్నా పరిగణనలోకి తీసుకోలేదని, కనీస సదుపాయాలు కల్పించాలని కోరినా పట్టించుకోలేదని తెలిపారు. విచారణ త్వరగా పూర్తి చేస్తే దానికి అనుగుణంగా శిక్షను అనుభవించేందుకు దర్శన్ సిద్ధంగా ఉన్నాడని చెప్పారు. వెన్నునొప్పి సమస్య తిరగబెట్టిందని, తనకు సైనేడ్ ఇస్తే తిని ఆత్మహత్య చేసుకుంటానని దర్శన్ గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది.

## ఢిల్లీలో పెరుగుతున్న వాయుకాలుష్యం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 27:** దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం రోజు రోజుకు పెరుగుతోంది. గాలి నాణ్యత సూచీ ప్రమాదకరస్థాయిలో నమోదవుతోంది. సోమవారం ఉదయం ఢిల్లీ, ఎన్‌సిఆర్ ప్రాంతం వాయు నాణ్యత సూచిక 315గా నమోదైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం అశోక్ విహార్‌లో అత్యధికంగా ఏక్యూఐ 416గా నమోదైంది. ఆ తర్వాత గౌతమ్ పురి వద్ద 415, ఆనంద్ విహార్ వద్ద 366గా గాలి నాణ్యత సూచీ ఉంది. గణేశ్‌పూర్ వద్ద 318, జిటిబి నగర్‌లో 302, కశ్మీర్‌గేట్ ఐఎస్‌బిటి ప్రాంతంలో 298, యమూర్ విహార్‌లో 287గా ఎక్యూఐ నమోదైంది.

## తోబుట్టువుల అశ్లీల చిత్రాలతో బెదరింపులు: యువకుడి ఆత్మహత్య

**హర్యానా, అక్టోబర్ 27:** సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు ఓ యువకుడు బలయ్యాడు. తన తోబుట్టువులకు సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలు పంపించి డబ్బులు డిమాండ్ చేయడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన హర్యానాలోని ఫరీదాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫరిదాబాద్‌కు చెందిన రాహుల్ భారతి (19) అనే యువకుడికి రెండు వారాల క్రితం సైబర్ నేరగాళ్లు పలు చిత్రాలు పంపారు.

అందులో అతడి ముగ్గురు తోబుట్టువుల చిత్రాలు మార్ఫింగ్ చేసి ఉండడాన్ని చూసి షాక్‌కు గురయ్యాడు. నాటి నుంచి సైబర్ నేరగాళ్లు అతడికి పలుమార్లు కాల్ చేసి రూ.లక్షల్లో డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తామని బెదిరించారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# డంకీరూటులో అమెరికాకువెళ్లి పట్టుబడిన భారతీయులు!



**కర్నాల్, అక్టోబరు 27:** అమెరికాలో అడుగుపెట్టి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలనుకున్న హర్యానా యువకుల కలలు కల్లలయ్యాయి. అక్రమంగా డంకీ మార్గంలో దేశంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన సుమారు 50 మంది యువకులను అమెరికా అధికారులు అరెస్ట్ చేసి, బేడీలతో భారత్‌కు తిప్పి పంపారు. 25 నుంచి 30 ఏళ్ల వయసున్న ఈ యువకులంతా హర్యానాలోని జింద్, కైథల్ జిల్లాలకు చెందిన వారు. ఈ ఘటనలో బాధితుడైన కైథల్ జిల్లాకు చెందిన నరేశ్ కుమార్ అనే యువకుడు తన ఆవేదనను మీడియా ముందు వెల్లడించాడు. వ్యవసాయ భూమిని అమ్మి ఓ ఏజెంట్‌కు రూ. 57 లక్షలు ఇచ్చాను. పనామా అడవుల గుండా అమెరికాకు పంపిస్తానని చెప్పాడు. కానీ, సరిహద్దు దాటుతున్నప్పుడు నన్ను అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. 14 నెలల తర్వాత బేడీలతో వెనక్కి పంపారని నరేశ్ వాపోయాడు. ఏజెంట్ తన నుంచి పలు దఫాలుగా డబ్బులు గుంజినట్లు తెలిపాడు. మొదట రూ. 42 లక్షలు తీసుకున్నాడు. గ్వాటెమాలలో రూ. 6 లక్షలు, మెక్సికోలో మరో రూ. 6 లక్షలు, సరిహద్దు దాటే ముందు మిగిలిన మొత్తాన్ని తీసుకున్నాడు. కానీ, నన్ను సురక్షితంగా అమెరికా చేర్చకుండా జైలు పాలు చేశాడని ఆవేదన వ్యక్తం చేశాడు. తనను మోసం చేసిన ఏజెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, యువత ఎవరూ డంకీ మార్గాన్ని ఎంచుకోవద్దని విజ్ఞప్తి చేశాడు. ఈ ఘటనపై కైథల్ ఎస్పీ ఉపాసన మాట్లాడుతూ, అమెరికా నుంచి బహిష్కరణకు గురైన యువకులను వారి కుటుంబాలకు అప్పగించినట్లు తెలిపారు. వారి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, వారిలో ఒకరికి నేరచరిత్ర ఉన్నట్లు తేలిందని పేర్కొన్నారు. జింద్ జిల్లాకు చెందిన ముగ్గురు యువకులను కూడా ఇలాగే వెనక్కి పంపారని ఎస్పీ కుల్దీప్ సింగ్ వెల్లడించారు. డంకీ మార్గంలో విదేశాలకు వెళ్లడం తీవ్రమైన నేరం. ఇది మన సమాజ ప్రతిష్ఠను దెబ్బతీస్తుంది. ఇలాంటి అక్రమ ప్రయాణాలు ఆర్థిక నష్టాన్ని కలిగించడమే కాకుండా, ప్రాణాలకు కూడా ముప్పు తెచ్చిపెడతాయి. అనేక సందర్భాల్లో యువకులు శారీరక వేధింపులు, మోసాలు, చివరికి మరణాన్ని కూడా ఎదుర్కొంటున్నారని జింద్ ఎస్పీ కుల్దీప్ సింగ్ హెచ్చరించారు. విదేశాలకు వెళ్లాలనుకునే వారు చట్టబద్ధమైన మార్గాలను మాత్రమే ఎంచుకోవాలని ఆయన సూచించారు. యువతను తప్పుదోవ పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# షట్‌డౌన్‌తో 8 వేల విమానసర్వీసులకు ఎఫెక్ట్

## అమెరికాలో తీవ్రమవుతున్న రవాణా సమస్యలు



**వాషింగ్టన్,అక్టోబరు 27:** అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి విమాన సర్వీసుల్లో అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ షట్‌డౌన్‌తో వేల సంఖ్యలో విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. ఈ షట్‌డౌన్‌తో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది విధులకు హాజరుకావడం లేదు. ఇది విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం పడింది. పలు విమానాశ్రయాల్లో దాదాపు 8 వేలకుపైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. పలు విమానాలు రద్దైనట్లు తెలిసింది. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా చాలా చోట్ల ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది విధులకు హాజరుకావడంలేదు. ఫలితంగా అనేక ప్రాంతాల్లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది కొరత ఏర్పడింది. లాస్‌ఏంజిల్స్, కాలిఫోర్నియా, చికాగో, వాషింగ్టన్, న్యూజెర్సీలోని నెవార్క్ తదితర ప్రాంతాల్లో సిబ్బంది కొరత ఉన్నట్లు ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎఎ) తెలిపింది. ఫలితంగా దాదాపు 8వేలకు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు వెల్లడించింది. మరోవైపు రానున్న రోజుల్లో సిబ్బంది కొరత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అమెరికా రవాణా మంత్రి శాన్ డఫీ వెల్లడించారు. దీంతో విమానాల ఆలస్యం, సర్వీసుల రద్దు మరింత ఎక్కువగా ఉండొచ్చని పేర్కొన్నారు. విమానాల ఆలస్యంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# ఉద్యోగి కాకుండానే అధికారి భార్యకు రెండేళ్లుగా జీతం

## రాజస్థాన్‌లో వెలుగులోకి వచ్చిన ఐటిడైరెక్టర్ నిర్వాకం



**జైపూర్, అక్టోబరు 27:** ఆమె అసలు సాఫ్ట్ వేర్ ఉద్యోగియే కాదు. అయినా రెండు టెక్ కంపెనీల్లో జాబ్. ఒక్క రోజు కూడా ఆఫీస్‌కు వెళ్లలేదు. అయినా ప్రతినెల ఠంచనుగా ఆమె అకౌంట్లలో జీతం పడింది. ఇలా ఇంట్లో కూర్చునే రెండేండ్లలో ఏకంగా రూ.37 లక్షల 54 వేలు సంపాదించింది. ఇంజినీరింగ్, డిగ్రీ పట్టాలు ఉన్నా ఉద్యోగం ఎలా సంపాదించాలని చాలామంది నెలల తరబడి కంపెనీల చుట్టూ తిరుగుతూ ఉంటారు.. అయినా ఆమె రెండు ఉద్యోగాలు ఎలా సంపాదించారనుకుంటున్నారా అంటే ఆమె భర్త రాజస్థాన్ ప్రభుత్వ ఐటీ శాఖలో డైరెక్టర్ కావడమే. ప్రద్యుమ్న దీక్షిత్ అనే వ్యక్తి రాజస్థాన్ ప్రభుత్వ రాజ్‌కాంప్ ఇన్ఫో సర్వీసెస్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో జాయింట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఓరియన్‌ప్రో సొల్యూషన్స్, ట్రీజెన్ సాఫ్ట్‌వేర్ లిమిటెడ్ సంస్థలకు ప్రభుత్వ టెండర్లు దక్కేలా దీక్షిత్ చేశాడు. ప్రతిగా తన భార్య పూనమ్ దీక్షిత్‌కు ఉద్యోగం ఇవ్వాలని రెండు కంపెనీలను డిమాండ్ చేశాడు. ప్రతి నెల జీతం చెల్లించాలని ప్రతిపాదించాడు. దీంతో ఓరియన్‌ప్రో కంపెనీలో ఉద్యోగిగా, ట్రీజెన్ సాఫ్ట్‌వేర్‌లో ఫ్రీలాన్సింగ్ చేస్తున్నట్లుగా నకిలీ పత్రాలు సృష్టించాడు. ప్రతి నెలా అతడే నకిలీ అటెండెన్స్ సమర్పించేవాడు. ఇలా 2019 జనవరి నుంచి 2020 సెప్టెంబర్ వరకు పూనమ్ దీక్షిత్‌కు చెందిన వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్లలో జీతం రూపంలో రూ.37,54,405 జమ అయ్యాయి. ఇలా పెద్దమొత్తంలో లంచంగా సంపాదించాడు. ఈ తంతంగంపై రాజస్థాన్ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. దీంతో న్యాయస్థానం ఏసీబీ విచారణకు ఆదేశించింది. అధికారుల దర్యాప్తులో భాగంగా ప్రద్యుమ్న దీక్షిత్ నకిలీ ఉద్యోగం వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

28-10pg6exHMNWJQE 10_28-10pg6exHMNWJQE.qxd 27/Oct/25 11:50 PM Page 1



# శివోహం...

## భక్తులతో శ్రీకాళహస్తీశ్వరాలయం కిటకిట

శ్రీకాళహస్తి, అక్టోబరు 27 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం కార్తిక మాసం మొదటి సోమవారం భక్త జనంతో కిటకిట లాడింది. ఓ వైపు ముంథా తుపాన్ భయభ్రాంతుల్ని చేస్తున్న మహిళా భక్తులు లెక్కచేయక కదలి వచ్చారు. ఆలయ ఆవరణ శివనామస్మరణతో దద్దరిల్లింది. ఆలయం శివరాత్రిని మరపించింది. దీపాల వెలిగింపుతో పునీతమైంది. అభిషేకాల సేవ లందించటానికి అధికారులు చొరవ చూపారు. అందరికి సుదర్శనం కోసం పాలకులు మహాలఘుదర్శనం ఏర్పాటు చేసారు. అంతరాలయ దర్శనాలకు తప్పనిసరిగా సంప్రదాయ దుస్తుల నిర్ణయం సత్ఫలితాలను ప్రజల ప్రసంశ లను అందుకున్నారు. సోమవారం ఆకాశం మేఘావృతమై సన్నగా వర్షం కురుస్తున్నా శ్రీకాళహస్తి పట్టణం, ఆలయ పరిసరాల్లోని నాలుగుమాడా వీధులు, సన్నిధివీధి, సువర్ణముఖి నది పరిసరాలు ఓంకార నాదం, శివనామ స్మరణతో దద్దరిల్లాయి. వేకువ జాము నుంచి కర్నాటక, తమిళనాడు నుంచి తరలి వచ్చిన భక్త జనం జీవనది సువర్ణముఖిలో స్నానమాచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గోపూజ అనంతరం భక్తుల్ని సర్వదర్శనానికి అనుమతించారు. కాగా 5గంటల నుంచి స్వామి అమ్మవార్లకు ఆలయం తరఫున అభిషేకాలు ప్రారంభించారు. ఆయన ప్రతి గంటకు ఆలయంలోని తిష్టవేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా పర్యవేక్షించారు.

## కన్నులపండువగా లక్షదీపోత్సవం

### శ్రీశైల మల్లన్నకు పుష్కరిణీ హారతి





శ్రీశైలం ప్రాజెక్టు, అక్టోబరు 27 ప్రభాతవార్త: కార్తిక మొదటి సోమవారం సందర్భంగా పుష్కరిణి వద్ద దేవస్థానం లక్ష దీపోత్స వం, పుష్కరిణి హారతి నిర్వహించింది. లోక కల్యాణం కోసం ఈ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. లక దీపోత్స వ కార్యక్రమంలో పుష్కరిణీ ప్రాంగణమంతా కూడా దీపాలను ఏర్పాటు చేశారు. సోమవారంనాడు సాయంత్రం ముందుగా శ్రీస్వామిఅమ్మవార్లకు పుష్కరిణీకి దశవిధ హారతులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా ఈ కార్యక్ర మానికి ముందుగా శ్రీస్వామి అమ్మవార్ల ఉత్స వమూర్తులను పుష్కరిణి వద్దకు వేంచేయించి విశేషంగా పూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హారతులను ఇవ్వడం జరిగింది. అనంతరం ఓంకారహారతి, నాగహారతి, త్రిశూల హారతి, నంది హారతి, సింహహారతి, సూర్యహారతి, చంద్రహారతి, కుంభహారతి, నక్షత్రహారతి, కర్పూరహారతులు సమర్పించారు.


## శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో భక్తజనం

శ్రీకాళహస్తి, అక్టోబరు 27 ప్రభాత వార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో సోమవారం సుబ్రమణ్యం స్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఆలయంలోని చెంగల్వ రాయస్వామి ఆలయంలోనూ, అలాగే తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయంలో స్కందషష్టి సందర్భంగా భక్తులు విశేష సంఖ్యలో హాజరై పూజలు జరుపుకున్నారు. స్వామి వారిని షోడషాభిషేకాలు నిర్వహిం చారు. ఈ నేపథ్యంలో సోమవారం స్కందషష్టి సందర్భంగా షణ్ముఖ స్వామి ఆలయం భక్తులతో కిటకిట లాడింది. వందలాది లీటర్ల పాల తోనూ, పన్నీరు, షోడషాభిషేకాలతో పునీతం చేసారు. ఇక అలంకారాలతో భక్తులను ఆకట్టుకున్నారు. నైవేద్య ప్రసాదాలను అందించారు.



### ఆకాశ దీపం ఆవిష్కరణ

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం రద్దీ రోజురోజుకు పెరుగు తుంది. మొదటి సోమవారం ఉదయం నుంచి ఆలయంలలో స్థానిక భక్తులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు స్వామి అమ్మ వార్లను దర్శించుకున్నారు. కాగా సాయంత్రం కోట మండపం వద్ద స్కందషష్టి సందర్భ ంగా ఆకాశదీపం ఆవిష్కరణను నిర్వ హించారు, ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, ఇఇ మురళీధర్‌రెడ్డి, డిప్యూటీ ఇఓ ఎన్‌ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఓలు విద్యాసాగర్‌రెడ్డి, మోహన్, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శనం నాయుడు, సిబ్బంది, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.



ఆకాశదీపం కార్యక్రమాల్లో పాల్గొన్న శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్, ఇఓ తదితరులు

## దుర్గమ్మవారి ఆలయంలో వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్య కల్యాణోత్సవం

### హుండీ ఆదాయం రూ.4.33 కోట్లు



ఇంద్రకీలాద్రి, అక్టోబరు 27 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో సోమవారం కార్తీక మాసం శుద్ధ షష్ఠి సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్యే శ్వర స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వ హించారు. ముందుగా శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని చూడముచ్చటగా అలంక రించి వేదికపై వేంచేపు చేసి వర్ణమయ పుష్పా లంకరణ చేశారు. కల్యాణ క్రతువు అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమరి ్పంచి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. దుర్గమ్మకు భక్తులు హుండ ల ద్వారా సమర్పించిన కానుకలను సోమవారం ఇఓ పర్యవేక్షనలో లెక్కించగా రూ.4,33,85,665ల నగదు, 420 గ్రాముల వెండి, 6.614కేజీల వెండి, ఇంకా విదేశీ కరెన్సీ లభించినట్లు ఇఓ తెలిపారు.

### వేదోక్తంగా సహస్ర లింగార్చన, కార్తీకమాస పూజలు

శ్రీ మల్లేశ్వర స్వామివారి ఆలయంవద్ద జరిగిన సహస్ర దీపాలంకరణలో ఇఓ, చైర్మన్, పాలకమండలి పాల్గొన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో సోమవారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఓ చైర్మన్లు తెలిపారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవారు ్ల భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తులని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు.

### దుర్గమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

దుర్గమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాన వేంద్రనాత్ రాయ్ దర్శించుకున్నారు. సహస్ర దీపాలంకార సేవలో పాల్గొన్నారు. ఆయనకు ఇఓ దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అం దించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

### అధికారులు అప్రమత్తంగా వుండాలి:

వాతావరణ శాఖ తుపాన్ ప్రభావం వుండవచ్చని హెచ్చరికలు చేసిన సందర్భంగా అధికారులు, ఇంజనీర్లు అందరూ అప్రమత్తంగా వుండి భక్తులకు ఎటువంటి ఇబ్బందికలగకుండా చర్యలు తీసుకోవాలని ఇఓ వికె శీనానాయక్ అన్నారు. సోమవారం ఆయన అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ కొండచరియలు జారిపడకుండా చర్యలు తీసుకోవాలని, ఇంజనీరింగ్ అధికారు ్ల, సిబ్బంది భక్తులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాహన పార్కింగ్ వద్ద, ప్రోటోకాల్ వద్ద కూడ అధికారులు అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఇఓలు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమలలో వైకుంఠద్వార దర్శనాలు 2రోజులకు కుదించొద్దు



తిరుమల, అక్టోబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి: తమిళనాడు శ్రీరంగం ఆలయం ద్రావిడ సంస్కృతి అంటూ ప్రస్తుత టిటిడి బోర్డు, అధికారులు తెరపైకి తీసుకువస్తున్నారని, అయితే 2020లో 26మంది పీఠాధిపతులు, 32మంది ప్రముఖ పండితులతో చర్చించిన తరువాతే తిరుమల ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు అమలుచేశామని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. తిరుమలలో ఎంతో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనం మోక్షమార్గం ప్రవేశానికి పది లక్షల మంది భక్తులు వేచిచూస్తుంటారన్నారు. వైసిపి హయంలో, టిటిడి బోర్డు కాలంలో ప్రశాంతంగా, సాఫీగా పదిరోజులు వైకుంఠద్వారాలను తెరచి భక్తులకు దర్శనం చేయించామని ఉద్ఘాటించారు. ద్రావిడ సంస్కృతి అంటూ రెండురోజుల వైకుంఠద్వార దర్శనాలను అమలుచేసేందుకు ప్రస్తుత టిటిడి బోర్డు చైర్మన్ బిఆర్‌నాయుడు సిద్ధమవ్వడాన్ని భూమన తప్పుపట్టారు. ఆ ఆలోచన విరమించుకోవాలన్నారు. సోమవారం సాయంత్రం ఆయన మీడియా ప్రతినిదులతో మాట్లాడారు. వైఖానస ఆగమ సలహాదారులు సూచనల మేరకు పదిరోజులు వైకుంఠద్వార దర్శనం ఏర్పాటు చేశామన్నారు. ఆ రోజు పీఠాధిపతులు ఇచ్చిన సూచనలు ఇప్పుడు తప్పు ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. అప్పుడు కూడా కృష్ణమూర్తి వైద్యనాథన్ బోర్డు సభ్యుడుగా ఉన్నాడని, ఇప్పుడు ఆయన బోర్డులో ఉన్నాడన్నారు. శృంగేరి మఠం, ఆండవన్‌వన్ మఠం, వ్యాసరాజమఠం, త్రిదండి, ఉత్తరాధి, పెజావర్‌మఠం, అహోబిల మఠం పీఠాదిపతులు సూచనలు సలహాలు తీసుకునే ఈ నిర్ణయం ఆనాడు తీసుకున్నామన్నారు. ద్రావిడ సంప్రదాయం అంటూ కొత్తబాణి వినిపిస్తున్నారని ఆయన అసహనం చెందారు. పున్నమి గరుడసేవ, పుష్కరిణి హారతి మా హయాంలో తీసుకువచ్చిన నిర్ణయాలు అమలవుతున్నాయన్నారు. వాటిని మీరు మార్పులు చేయగలరా అని బిఆర్ నాయుడును భూమన ప్రశ్నించారు. రెండు రోజుల వైకుంఠద్వార దర్శనాలతో పది లక్షల మందికి పవిత్రమార్గాన్ని దూరం చేస్తున్నారని ఆయన తెలిపారు.

## మైనర్ బాలికపై అత్యాచారం

### ఎన్టీఆర్ జిల్లా ముప్పాళ్ళలో దారుణం

విజయవాడ, అక్టోబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్ళ గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. ముప్పాళ్ళ గ్రామానికి చెందిన మైనర్ బాలికపై అఘాయిత్యానికి నలుగురు వ్యక్తులు పాల్పడ్డారు. బాధిత బాలిక బంధువులు నందిగామ పనిమీద వెళ్ళారు. ఇంటిదగ్గర ఆడుకుంటున్న ఆ బాలికకు మాయమాటలు చెప్పి జామకాయలో మత్తుమందు కలిపి నలుగురు వ్యక్తులు అత్యాచారం చేసారు. తరువాత అక్కడ నుంచి పారిపోయారు. బాలిక రక్తస్రావంతో ఇంట్లో ఉండగా గమనించిన బంధువులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. ఆ బాలికను వైద్య పరీక్షల నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు విచారణ చేపట్టారు.

## క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం



విజయవాడ, అక్టోబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి రాష్ట్రానికి గౌరవం తెచ్చిన ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, ప్రోత్స హించి, సత్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నగదు ప్రోత్సా హక పథకంకు సంబంధించి సవరించిన మార్గదర్శకా లను ప్రకటించినట్లు శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపారు. ఈ పథకం ఆంధ్రప్రదేశ్ క్రీడా విధానం 2024-2029 నిబంధనలకు అనుగుణంగా జీవో ఎంఎస్ సంఖ్య262 జీవోఎంఎస్ సంఖ్య 8 ప్రకారం అమలు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అలాగే జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన అర్హత గల క్రీడాకారులు తమ దరఖాస్తులను శాప్ క్రీడా యాప్ ద్వారా లేదా ఈ లింక్ ద్వారా ఎపి ప్రభుత్వ స్పోర్ట్స్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో నవంబరు 4వ తేదీ లోపు సమర్పించుకోవచ్చు. ప్రతి అర్హత గల క్రీడాకారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు క్రీడాకారులకు పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం క్రీడాకారులు 95735 52108, 82473 02497, 95538 21065 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

## జాతీయ యాదవ మహాసభ ఎపి అధ్యక్షుడిగా నారాయణ యాదవ్



విజయవాడ, అక్టోబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి: జాతీయ యాదవ మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా విజయవాడ సమీపాన ఉన్న కానూరు లోని, అశోక్‌నగర్‌కు చెందిన నారాయణ యాదవ్ నియమితుల య్యారు. అఖిల భారత యాదవ మహాసభ (ఆల్ ఇండియా యాదవ మహాసభ) జాతీయ అధ్యక్షుడు రవీంద్రసింగ్ యాదవ్ నారాయణను ఏపీ రాష్ట్ర యూనిట్‌కు అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నారాయణకు నియామక పత్రాన్ని అందజేశారు. వచ్చే నెలలోపు రాష్ట్ర కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి ఆ వివవరాలను జాతీయ మహాసభ సమన్వయకర్త సి.శేఖర్ యాదవ్‌కు అందజేయాలని రవీంద్ర సింగ్ ఉత్తర్వులలో పేర్కొన్నారు. తనకు ఈ బాధ్యతలను అప్పగించినందుకు నారాయణ యాదవ్ రవీంద్ర సింగ్‌కు, జాతీయ యూనిట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎపిలో మరో రెండు కొత్త జిల్లాలు!

### అమరావతి కేంద్రంగా అర్బన్ జిల్లా! మార్కాపురం కేంద్రంగా మరో జిల్లా

విజయవాడ, అక్టోబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపిలో నూతన జిల్లా ఏర్పాటుపై ఒక స్పష్టత వచ్చినట్లు సమాచారం. అమరావతి కేంద్రంగా అర్బన్ జిల్లా, మార్కాపురం కేంద్రంగా రెండు కొత్త జిల్లాలు ఏర్పడనున్నట్లు తెలుస్తోంది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ, కొత్త జిల్లాల ఏర్పాటుపై అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఏడుగురు మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రజల వినతులు స్వీకరించింది. జిల్లాల కలెక్టర్లు కూడా ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. అందిన ప్రతిపాదనలన్నింటినీ సమీక్షి ంచిన తర్వాత ఉపసంఘం నివేదికను రూపొందించింది. ఈ నివేదిక ఒకటి, రెండు రోజుల్లో సీఎం చంద్రబాబుకు సమర్పించనున్నది. ఇప్పటికి అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం మంగళవారం (ఈనెల28న) సిఎంతో మంత్రి వర్గం భేటీ అవుతుంది. ఈ భేటీలో మంత్రి వర్గ ఉప సంఘం అందించే నివేదికను పరిశీలించిన తరువాత సిఎం చంద్రబాబు కీలకంగా చర్చించి నిర్ణయం తీసుకుంటారంటున్నారు.

సిఎం నిర్ణయం అనంతరం నవంబరు మొదటి వారంలో జరిగే మంత్రిమండలి సమావేశంలో నూతన జిల్లాల ప్రతిపాదన అమలుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు కానున్నట్లు తెలుస్తోంది. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల, గ్రామ సరిహద్దులు, పేర్ల మార్పునకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఈ మేరకు ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు సమాచారం. ఏజెన్సీలో మరో జిల్లా, అమరావతి కేంద్రంగా జిల్లా ఏర్పాటుపైనా ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. వీటన్నింటిపైనా మంత్రివర్గం ఉపసంఘం సీఎంతో మంగళవారం చర్చించనుంది. రాష్ట్రంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుతో పాటు పేర్ల మార్పుపై కసరత్తు కొలిక్కి వచ్చింది. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల, గ్రామ సరిహద్దులు, పేర్ల మార్పునకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం మధ్యాహ్నం సిఎం చంద్రబాబుతో సమావేశం కానుంది. జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు, పేర్ల మార్పులపై అందిన అర్జీలపై ఆయనతో చర్చిస్తారు. ఆయన సూచనలు తీసుకుని తుది నివేదిక రూపొందించనున్నారు. నవంబరు 7న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. తర్వాత ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరిస్తారు. అనంతరం గెజిట్ విడుదల చేస్తారు. జనగణన నేపథ్యంలో డిసెంబరు 31వ తేదీలోగానే మొత్తం ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంది. మార్కాపురం కేంద్రంగా కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం, దర్శి, మార్కాపురం నియోజకవర్గాలతో జిల్లా ఏర్పాటుకు మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేసినట్లు సమాచారం. రామాయపట్నం పోర్టు ఏర్పాటు నేపథ్యంలో.. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలోకి తిరిగి చేర్చడంపై సందేహాలు నెలకొన్నాయి. దీన్ని నెల్లూరు జిల్లాలో కొనసాగించాలా..? ప్రకాశం జిల్లాలో చేర్చాలా అనే అంశంపైనా సీఎంతో జరిగే సమావేశంలో స్పష్టత రానుంది.

ఏజెన్సీ ప్రాంతంలో కొత్త జిల్లా ఏర్పాటుకు సీఎం చంద్రబాబు గతంలో హామీ ఇచ్చారు. రంపచోడవరం నుంచి జిల్లా కేంద్రమైన పాడేరుకు 187 కిలోమీటర్ల దూరం ఉంది. దీంతో రంపచోడవరం, చింతూరు డివిజన్లతో పాటు 4 విలీన మండలాలతో జిల్లా ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు తెలిసింది. అమరావతి కేంద్రంగా పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలోని నియోజకవర్గాలతో కొత్త జిల్లా ఏర్పాటు ప్రతిపాదన ఉంది. రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీతోపాటు కొత్త భవనాల నిర్మాణమూ పూర్తి కావస్తోంది. కన్వెన్షన్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రస్థాయి కార్యక్రమాలకూ వేదిక అవుతోంది. వీటితోపాటు శాంతిభద్రతల నిర్వహణ, ప్రొటోకాల్ విధులు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త జిల్లా ఏర్పాటుపై ఆలోచిస్తున్నట్లు తెలిసింది. మదనపల్లె కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై నివేదికలో వివరించనున్నారు.

అద్దంకి, మడకశిర సహా 10 కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేశారు. ఒక నియోజకవర్గం రెండు, మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉంటే పరిపాలనా సౌలభ్యం మేరకు ఒకే నియోజకవర్గ పరిధిలోకి తేవాలని యోచిస్తున్నారు. ఆదోని మండలంలో లక్షా 50 వేల మంది జనాభా ఉన్న నేపథ్యంలో మండలాన్ని విభజించాలనే వినతులు వచ్చాయి. ఇలాంటి వినతులపైనా నిర్ణయం తీసుకోనున్నారు. మండపేట, కొత్తపేట, ఎస్.కోట సహా కొన్ని నియోజకవర్గాల్ని ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మార్చాలనే ప్రతిపాదనలు అందాయి. కొన్ని నియోజకవర్గాల పునర్విభజనపై కూడా ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రస్తుతం కృష్ణా జిల్లాలో ఉన్న గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని యోచిస్తున్నారు. దీని వల్ల ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ తూర్పు, పశ్చిమ, మధ్య, తిరువూరు, మైలవరం, గన్నవరం, పెనమలూరు సహా ఏడు నియోజకవర్గాలు ఉంటాయి. అదే విధంగా శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో, మండపేటను తూర్పుగోదావరిలో, రామచంద్రపురంను కాకినాడ జిల్లాలో చేర్చే అవకాశం ఉంది. కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని, రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో చేర్చాలని ప్రతిపాదనలు వచ్చాయి. జిల్లాల పునర్వ్యవస్థీకరణ సాధారణ పరిపాలనా ప్రక్రియ మాత్రమే కాదు. ఇది ప్రజల జీవితాలపై, అభివృద్ధి అవకాశాలపై నేరుగా ప్రభావం చూపుతుంది. అందుకే ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. డిసెంబరు 31 గడువు సమీపిస్తున్న తరుణంలో కొత్త జిల్లాల తుది మార్పులపై ఆసక్తి నెలకొంది.

## ముంచుకొస్తున్న మొంథా తుపాను... మున్సిపాలిటీల్లో కంట్రోల్ రూంలు



విజయవాడ, అక్టోబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి: మొంథా తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని మున్సి పల కమీషనర్లతో పురపాలక శాఖ మంత్రి నారాయణ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. చేపట్టాల్సి న చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు. 'తుపానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్దం కావాలి. అన్ని మున్సి పాలిటీల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలి. ప్రజలకు ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం అందేలా చూడాలి. రోడ్లపై చెట్లు కూలితే వెంటనే తొలగించేలా ఏర్పాట్లు చేయాలి. పునరావాస శిబిరాల సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు అందించాలి. తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి' అని మంత్రి దిశానిర్దేశం చేశారు. మచిలీపట్నం- కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో మంగళవారం తీరం దాటే అవకాశం ఉంది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 90-110 కి.మీల వేగంతో గాలులు వీచే వీలుంది' అని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. అధికారులకు సెలవులు రద్దు చేశామన్నారు. ఎన్డీఆర్‌ఎఫ్, ఏపీఎస్‌డీఎంఏ కేంద్రాలు, 16 శాటిలైట్ ఫోన్లు ఏర్పాటు చేశారు. 57 తీర ప్రాంత మండలాల పరిధిలో 219 తుపాను షెల్టర్లు ఏర్పాటు చేశారు. సముద్రంలోని 62 మెకనైజ్డ్ బోట్లను ఒడ్డుకు రప్పిస్తున్నారు. సముద్ర తీరాల్లో పర్యాటకుల రాకపోకలపై నిషేధం విధించారు.

## ఇద్దరు డిఎస్పీలు ఒక్కటయ్యారు..!



ఏలూరు, అక్టోబరు 27 ప్రభాతవార్త: పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలో ఘనంగా డిఎస్పీ వివాహ మహోత్స వం జరిగింది. గతంలో చందోలు పోలీస్ స్టేషన్‌లో ట్రైనింగ్ డిఎస్పీగా విధులు నిర్వహించి, ప్రస్తుతం కృష్ణా జిల్లా అవనిగడ్డ డిఎస్పీగా పనిచేస్తున్న విద్యశ్రీ, పల్నాడు జిల్లా గురజాల డిఎస్పీగా పనిచేస్తున్న జగదీష్ వివాహ వేడుక కన్నుల పండుగగా జరిగింది. పోలీసు శాఖలో ఒకే క్యాడర్‌లో ఉన్న అధికారులు ప్రేమ వివాహం చేసుకోవడం విశేషంగా మారింది. పలువురు పోలీసు అధికారులు పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

## సియోల్‌లో శ్రీసిటీ బృందం



శ్రీసిటీ (తడ), అక్టోబరు 27 ప్రభాతవార్త: విదేశీ పెట్టుబడులు, వ్యాపార విస్తరణలో భాగంగా శ్రీసిటీ మార్కెటింగ్ బృందం కొరియా పర్యటించింది. ఈ సందర్భంగా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ నేతృత్వంలో సియోల్‌లోని భారత రాయబార కార్యాలయం డిప్యూటీ మిషన్ చీఫ్ నిషికాంత్ సింగ్ మరియు జపాన్ ఉన్నతాధికారులను కలిసి, ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతి, 31 దేశాలకు చెందిన 240కు పైగా పరిశ్రమలను ఆకర్షించడంలో శ్రీసిటీ కీలక పాత్రను హైలైట్ చేశారు. ఎల్జీ, సోలుమ్, హ్యుందాయ్ ఇంజనీరింగ్ ప్లాస్టిక్స్ ఎస్కే ప్యుకోర్, ఎల్జీ పాలిమర్స్ వంటి ప్రముఖ కొరియన్ కంపెనీలు ఇప్పటికే శ్రీసిటీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు వారికి వివరించారు. అలాగే సియోల్‌లో జరిగిన కొరియాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్, ఐటీ ప్రదర్శన (కెఇఎస్ 2025)ను సందర్శించారు. అధికారులు, ఇతర వ్యాపార సమూహాలతో వ్యూహాత్మక సమావేశాలు నిర్వహించి, పెట్టుబడి భాగస్వామ్య అవకాశాలను చర్చించారు. శ్రీసిటీ వేగవంతమైన పురోగతిని ప్రశంసించిన నిషికాంత్ సింగ్, భవిష్యత్ కొరియా పెట్టుబడులకు తన మద్దతు తెలిపారు. ఈ పర్యటన శ్రీసిటీ, కొరియన్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని బలపరుస్తుందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.



## 787మంది గర్భిణులను వైద్యశాలలకు తరలింపు

విజయవాడ, అక్టోబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి: తుపాను ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా నెలలు నిండి ప్రసవానికి దగ్గరలో ఉన్న గర్భిణీలను వైద్యశాలలకు తరలిస్తున్నామని, కోస్తా జిల్లాల్లో ఇప్పటికే 787మందిని వైద్యశాలలకు తరలించినట్లు వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఏఎన్‌యంల నుండి సేకరించిన సమాచారం మేరకు ప్రసవానికి దగ్గర్లో ఉన్న గర్భిణీలను సామాజిక, ప్రాంతీయ, జిల్లా వైద్యశాలలకు తరలించారని చెప్పారు. హైరిస్క్ ఉన్న గర్భిణీల పట్ల వైద్యులు జాగ్రత్తలు తీసుకుంటున్నారని, కృష్ణా జిల్లాలో 240, ఏలూరు జిల్లాలో 171, కోనసీమ జిల్లాలో 150, తూర్పుగోదావరి జిల్లాలో 142మంది గర్భిణీలను వైద్య శాలలకు తరలించినట్లు మంత్రి వివరించారు. తుపాన్ ప్రభావిత 17 జిల్లాలోనూ ఇదే విధంగా గర్భిణీలను వైద్య శాలలకు తరలించేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి చెప్పారు. తుపాన్ పునరావాస శిబిరాల వద్ద ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుల ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వ హించనున్నట్లు తెలిపారు. ప్రతి వైద్యశిబిరంలోనూ వైద్యు లు, ఏఎన్‌యం, ఆశావర్కర్‌ను నియమించా మన్నారు. ఇప్పటి వరకు 551 పునరావాస శిబిరాలు ఏర్పాటు చేస నట్లు పేర్కొన్నారు. తుపాన్ సహాయక విధుల్లో పాల్గొనే వైద్యఆరోగ్య సిబ్బంది హాజరును నిశితంగా పరిశీలి స్తున్నట్లు రాష్ట్రవైద్యఆరోగ్య శాఖ కార్య దర్శి సౌరభ్‌గౌర్ తెలిపారు. తుపాన్ సహాయక చర్యల్లో వైద్యఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## డేటా ఎంట్రీ ఆపరేటర్ నియామక స్కిల్ టెస్ట్ వాయిదా

విజయవాడ, అక్టోబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి: డా.ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఈనెల 29, 30 తేదీలలో నిర్వహించాల్సిన సిస్టం అడ్మినిస్ట్రేటర్, కంప్యూటర్ ఆపరేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగ నియామకాల స్కిల్ టెస్ట్ నవంబర్ 5, 6 తేదీలలో నిర్వహించటం జరుగుతుందని యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. వి రాధికా రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో చేసిన మార్పును అభ్యర్థులు గమనించాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆ ప్రకటనలో తెలిపారు.

# తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పవర్ పోకూడదు



- జిల్లాల కలెక్టర్లతో సమన్వయంతో చేసుకోవాలి
- విద్యుత్ పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టాలి
- విద్యుత్ సంస్థల సిఎండిలతో సిఎస్ టెలికాన్ఫరెన్స్

విజయవాడ, అక్టోబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి: మొంథా తుపాను నేపథ్యంలో, రాష్ట్ర విద్యుత్ సంస్థలు పూర్తి అప్రమత్తంగా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. తుపాన్ నేపథ్యంలో సోమవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా ఎపి జెన్కో ఎండి ఎస్ నాగలక్ష్మి, జెఎండి ఎపి ట్రాన్స్కో జి సూర్యసాయి ప్రవీణ్ చంద్, డిస్కాముల సిఎండీలు ఐ.పృథ్వీతేజ్, ఎల్. శివశంకర్, పి.పుల్లారెడ్డిలతో సిఎస్ సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షిస్తూ, అవసరమైనప్పుడు విద్యుత్ సరఫరా తక్షణం పునరుద్ధరించడానికి సమన్వయంతో చర్యలు చేపట్టాలని కె.విజయానంద్ సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే, పునరుద్ధరణకు కావాల్సిన సిబ్బంది, సామగ్రితో విద్యుత్ సంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణకు సంబంధించి ఎపిట్రాన్స్‌కో, ఎపిజెన్‌కోతో పాటు విద్యుత్ పంపిణి సంస్థలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజాభద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సిఎస్ ఆదేశించారు. కంట్రోల్ రూములు, కమ్యూనికేషన్ వ్యవస్థల ద్వారా నిరంతర పర్యవేక్షణలో విద్యుత్ సిబ్బంది పనిచేయాలనీ, తుపాను ప్రభావం తగ్గిన వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించారు. తుపానుకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ శాఖకు సంబంధించి ఎప్పటికపుడు సమీక్షిస్తున్నారని, అందరూ అప్రమత్తంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు అందుకోవాలని సిఎస్ కె.విజయానంద్ కోరారు.

డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్, డా.ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్, దామోదర సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్‌లో అన్ని అత్యవసర వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయని ఎపిజెన్‌కో ఎండి ఎస్.నాగలక్ష్మి సిఎస్‌కు తెలిపారు. డిజి సెట్‌లు, ఫైర్ హైడ్రెంట్లు, సంప్ పంపులు, లైటింగ్ సిస్టమ్‌లు తనిఖీ చేశామని, తగినంత బొగ్గు, ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ప్లాంట్‌లో ఇంజనీర్లతో రౌండ్ ది క్లాక్ బృందాలు విధుల్లో ఉన్నారని, జెసిబిలు, ట్రాక్టర్లు, పంపులు, ఇసుక సంచులు సిద్ధంగా ఉన్నాయని ఆమె సిఎస్‌కు వివరించారు.

ఎపిట్రాన్స్‌కో జెఎండి జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ, విశాఖపట్నం, విజయవాడ జోన్లలోని ఎనిమిది జిల్లాల్లో పునరుద్ధరణకు కావలసిన సామాగ్రి, సిబ్బంది సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. మచిలీపట్నం, పామర్రు, అవనిగడ్డ, గుడివాడ, బాపట్ల, రెపల్లె, ఒంగోలు, చిరాల, గూడూరు, నెల్లూరు వంటి కీలక సబ్‌స్టేషన్లలో లైన్ గ్యాంగులు, ట్రీ కట్టింగ్ బృందాలు, ఫాల్ట్ లోకేటర్లు, అవసరమైన మేరకు సిబ్బందిని, మెటీరియల్‌ను తరలించేందుకు వాహనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. నున్నా, మచిలీపట్నం, అవనిగడ్డ, అంపోలు సబ్‌స్టేషన్లలో ఎమర్జెన్సీ సిస్టం రెస్పాన్స్ టవర్లు, 7.5 హెచ్‌పీ డీజిల్ డివాటరింగ్ పంపులు, అవసరమైన సామగ్రి సిద్ధం చేశామని సిఎస్‌కు వివరించారు. ఎక్కడైనా తుపాను ప్రభావంతో పునరుద్ధరణకు అవసరమయ్యే సామాగ్రిని ఆయా సమీప ప్రాంతాల్లోని గాజువాక, బొమ్మూరు, గుణదల, ఒంగోలు, కర్నూలు, కడప స్టోర్లలో సీటీలు, పీటీలు, లైట్నింగ్ అరెస్టర్లు, వీసిబీలు తదితర పరికరాలు తక్షణ వినియోగానికి సిద్ధంగా ఉన్నాయని సిఎస్ కె.విజయానంద్‌కు ఆయన తెలిపారు.

ఎపి ఇపిడిసిఎల్ సిఎండి ఐ.పృథ్వీతేజ్ మాట్లాడుతూ, తుపాను ప్రభావిత జిల్లాలలో నిరంతర విద్యుత్ సరఫరా, వేగవంతమైన పునరుద్ధరణకు విస్తృత ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. అమలాపురంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఉంటూ, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలలో జరిగే కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అదే సమయంలో, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) కార్పొరేట్ కార్యాలయంలో ఉంటూ అవసరమైన సామగ్రి సమీకరణ, లాజిస్టిక్స్ కదలికలను పర్యవేక్షిస్తున్నారని, డైరెక్టర్ (టెక్నికల్/ట్రాన్స్‌కో) రాజమహేంద్రవరం వద్ద ఉంటూ ట్రాన్స్‌కో సంబంధిత అన్ని కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారని సిఎస్‌కు వివరించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన మేరకు సిబ్బందిని చీఫ్ జనరల్ మేనేజర్ ఆధ్వర్యంలో, నోడల్ అధికారిగా నియమించి, కార్పొరేట్ కార్యాలయంలో 24 గంటల ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పృథ్వీ తేజ్ సిఎస్‌కు వివరించారు. సమర్థవంతమైన పర్యవేక్షణ, వేగవంతమైన స్పందన కోసం తీరప్రాంత జిల్లాలలో 22 కంట్రోల్ రూములు ఏర్పాటు చేశాయని, మొత్తం 496 బృందాలు, 7,394 మంది సిబ్బందితో తక్షణ విద్యుత్ పునరుద్ధరణ పనులకోసం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం 288 పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, 274 వాహనాలు, 376 జనరేటర్లు, మరియు 324 పవర్ సా యంత్రాలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ఈ ముందస్తు ఏర్పాట్లతో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు సంసిద్ధంగా ఉన్నామని సిఎస్ కె.విజయానంద్‌కు ఎపి ఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీ తేజ్ వివరించారు.

ఎపి ఎస్‌పిడిసిఎల్ సిఎండి ఎల్.శివశంకర్ మాట్లాడుతూ, ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో నెల్లూరు, తిరుపతి జిల్లాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని, అన్ని డివిజన్ ప్రధాన కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని, 1,505 సిబ్బందితో 147 బృందాలు విద్యుత్ పునరుద్ధరణ పనులకు సంసిద్ధంగా ఉన్నాయని, 65,000 పైగా విద్యుత్ స్తంభాలు, 7,600 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, 5,000 కిలోమీటర్ల కండక్టర్లు జిల్లాల స్టోర్లలో అందుబాటులో ఉన్నాయని సిఎస్‌కు వివరించారు.

ఎపి సిపిడిసిఎల్ సిఎండి పి. పుల్లారెడ్డి మాట్లాడుతూ, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల తీర ప్రాంత సబ్‌డివిజన్లలో విద్యుత్ పునరుద్ధరణకు సంబంధించి సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు సిఎస్‌కు వివరించారు.


## వదంతులు నమ్మవద్దు

### సురక్షిత ప్రాంతాలకు చేరుకుని ప్రజల సహకరించాలి
### తూర్పుగోదావరి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణతేజ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 27 ప్రభాతవార్త: మొంథా తుపాన్ హెచ్చరికలు నేపథ్యంలో ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని తుపాన్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ అన్నారు. తుపాన్ ప్రభావిత తీరప్రాంతాలను సోమవారం జిల్లా కలెక్టర్ షాన్మోహన్, ఎస్పీ బిందు మాధవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్‌పై సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను, వదంతులను నమ్మవద్దు అన్నారు. తప్పుడు ప్రచారాలు చేయడం వలన ప్రజల భయభ్రాంతులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కలెక్టర్ షాన్మోహన్ మాట్లాడుతూ మంగళవారం రాత్రి తుపాన్ తీరం దాటే అవకాశం ఉండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగింది. అధికార యంత్రాంగం ప్రజలను, మత్స్యకారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. జిల్లాలోని నాలుగు తీర ప్రాంత మండలాలతో పాటు, ఏలేరు వరద నీరు విడుదల చేస్తే కిర్లంపూడి, కాకినాడ సిటీ మండలాలు ప్రభావితం అయ్యే అవకాశం ఉంది. పునరావాస కేంద్రాలలో వైద్యం, త్రాగునీరు, విద్యుత్తుతో పాటు అన్ని అత్యవసర సేవలు అందుబాటులో ఉంటాయి. కాకినాడ సమీపంలోని హోప్ ఐలాండ్‌లో ఉన్న 111 మంది ప్రజలను ఇప్పటికే సురక్షి త ప్రాంతానికి చేర్చడం జరిగింది. తుపాన్‌కు సంబంధించి సోషల్ మీడియాలో అసత్య ప్రసారలను చేసినా, వాటిని ఫార్వర్డ్ చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ జిల్లా పోలీస్ యంత్రాంగం 15 బృందాలుగా ఏర్పాటు చేశామని, తుపాన్ ప్రభావిత ప్రాంతాలలో అనుక్షణం అందుబాటులో ఉంటారన్నారు. 2 ఎన్డీఆర్ఎఫ్, 2 ఎస్టిఆర్ఎస్, ఏపీఎస్పీ బృందాలు కూడా సిద్ధం చేశామన్నారు. అన్ని శాఖల అధికారులతో కలిసి పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయడం జరుగుతుందన్నారు.

## టెట్ పై ఉపాధ్యాయలోకం ఆందోళన

గుంటూరు విద్య,అక్టోబర్ 27,ప్రభాతవార్త : టెట్ పై ఉపాధ్యాయ లోకం ఆందోళన చెందుతున్న నేపథ్యంలో తక్షణమే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఉదయం 11గంటలకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కృష్ణ గుంటూరు



జిల్లాల ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ ని ఆయన స్వగృహంలో కలసి వినతి ప త్రం అందించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదరి ్శ బి.హైమారావు మాట్లాడుతూ విద్యాశాఖ మం త్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న సమయంలో విద్యాశాఖ అధికారులు విడుదల చేసిన టెట్ నోటిఫికేషన్ లో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను కూడా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో టెట్ పరీక్షకు అప్లై చేసుకోమని తెలియజేయడంతో ఉపాధ్యాయ లోక ం ఆందోళన చెందుతోందని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వడానికి ఉన్న ప్రతి ఒక్క అవకాశాన్ని పరిశీలించాలని కోరారు.దీనికి ఏఎస్ రామకృష్ణ స్పందిస్తూ తప్పనిసరిగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్ళి సమస్యను పరిష్కరిస్తామని,ఉపాధ్యాయులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పి.సాయి విశ్వనాథ్, ఎన్.భాస్కరరావు,అసోసియేట్ అధ్యక్షులు పి.లలితబాబు,రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్,గుంటూరు నగర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె.వి.రాఘ వులు, టి.శ్రీనివాస్,ఉపాధ్యక్షులు ఎ.హరగోపాల్,టి.రవి పాల్గొన్నారు.

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది

గుంటూరు విద్య,అక్టోబర్ 27,ప్రభాతవార్త : సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని అలాంటి ఉపాధ్యాయులను డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డ్స్ ్ర 2025పేరిట సదరన్‌ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వారు సన్మానించడం అవార్డులను అందజేయడం ఎంతైనా అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు.స్థా ్థనిక రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగిన ఏపిజే అబ్దుల్‌కలాం నేషనల్ అవార్డ్స్ కార్యక్రమంలో



లక్ష్మణరావు అధ్యక్షత వహించి మాట్లాడారు.. కార్య క్రమానికి ముఖ్యఅతిధులుగా కొండిన ్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌చైర్మన్ డాక్టర్ ఈవి నారాయణ,కర్నూలు టిడిపి స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ వహీద్ హుస్సేన్.జనచైతన్య వేదిక గుంటూరు ప్రెసిడెంట్ వి.లక్ష్మారెడ్ ్డలు హాజరయ్యారు.ఏఎన్యూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కన్నా విద్యాసంస్థల అధినేత డాక్టర్ విన్నకోట కన్నామాస్టారు,అపుస్మా స్టేట్ జాయింట్ ట్రెజరర్ కాటూరి వెంకటేశ్వరరావు,అపూస్మా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఐటి కోఆర్డినేటర్ కొండవీడు పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ టి.మస్తాన్‌రావు,జైన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.డి.మున్ను,తదితరులు గౌరవాతిధులుగా హాజరయ్యారు. ఆర్గనైజేషన్ నేషనల్ ప్రెసిడెంట్ ఫౌండర్ డాక్టర్ పి.నాగయ్య నేతృత్వంలో ఆయన బృందం నేషనల్ ప్రెసిడెంట్ కె.గోవిందరాజులు,నేషనల్ వరి ్కంగ్ ప్రెసిడెంట్ కొండపల్లి విల్సన్,నేషనల్ కన్వీనర్ పిటర్ రత్న కుమార్,ప్రెసిడెంట్ ఎన్.వి.ఎస్.రఘు ప్రదీప్,నేషనల్ సెక్రటరీ మెడతోటి రాకేష్, నేషనల్ ప్రెసిడెంట్ పిఎస్ ఆదిత్య, కోఆర్డినేటర్ డి.నాగమణి,కన్వీనర్ ఎస్.పి.రసూల్,స్టేట్ ప్రెసిడెంట్ తమిళనాడు డాక్టర్ షేక్ నయాబ్ రసూల్,పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ కె.రాము తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో భారీ వాహనాలు రావడానికి వీల్లేదు: ఎమ్మెల్యే మాధవి

గుంటూరు వెస్ట్, అక్టోబర్ 27, ప్రభాతవార్త: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో భారీ వాహనాలు రాకుండా చూడాలని గళ్ళా మాధవి, ట్రాఫిక్, ఆర్టీవో అధికారులకి ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. సోమవారం ఆర్ బి, మున్సిపల్, ట్రాఫిక్, ఆర్టీవో అధికారులతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి సమీక్షా సమావేశం నిర్వహించారు.గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అనుమతులు లేని భారీ వాహనాలు అడ్డగోలుగా రోడ్డు మీదకు వస్తున్నాయని, ఒక్కో వాహనం 28 టన్నులు వరకు మాత్రమే అనుమతులు ఉండగా, దానిని తుంగలో తొక్కుతూ ఒక్కో వాహనం 60 టన్నుల పైగానే లోడుతో రాకపోకలు చేస్తున్నాయని, దీని వలన రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, అలా వచ్చిన వాహనాలు రాత్రి పూట రోడ్డు అడ్డంగా నిలిపి ఉంచుతున్నారని, ఈ రకంగా ఉన్న ఈ వాహనాలు నగరంలోకి రావటానికి ఎవరు అనుమతి ఇస్తున్నారని ట్రాఫిక్ పోలీసులు ఆర్టిఓ అధికారుల పై ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భారీ వాహనాల వలన ఏర్పడిన గుంటల వలన, వర్షపు నీరు అందులో చేరితో, ఆ నీరును మున్సిపల్ అధికారులు ఎందుకు తోడటం లేదని, దీని వలన భారీ గోతులు ఏర్పడుతున్నాయని మున్సిపల్ అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఏర్పడిన గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో రోడ్లు ధ్వంసం అవ్వటానికి కారణంమైన భారీ వాహనాల పట్ల ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీవో అధికారులు పరస్పర సమన్వయంతో తనిఖీలు నిర్వహించి, నగరంలోకి రాకుండా కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు. మైనర్లు వాహనాలు నడపకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే అనేక మంది రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, ఇటువంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. జీ.టి. రోడ్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, గుంతల వలన ప్రజలు పడుతున్నారని, ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

## అధికారులు, కూటమి నేతలు ప్రజలకు అందుబాటులో ఉండాలి పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవలందించాలి

గుంటూరు వెస్ట్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: తుఫాన్ దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అదే విధంగా



పునరావాస కేంద్రాల గురించి ప్రజలకు సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. ఈ విపత్కర సమయంలో ఈ పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవలందించాలని కోరారు. సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలో మొంథా తుఫాను ప్రభావం పై ముందస్తు చర్యలు, ప్రజలకు కల్పించవలసిన పునరావాస కేంద్రాలు, వరద ప్రభావిత ప్రాంతాల పరిస్థితులపై నోడల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, విద్యుత్ శాఖ, తహసీల్దార్, ట్రాఫిక్ పోలీసులు తదితర శాఖాధికారులతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ డివిజన్‌ల వారీగా పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి, వాటిలో అవసరమైన సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావాన్ని తగ్గించేందుకు మున్సిపల్, పోలీస్, ట్రాఫిక్, ఫైర్, విద్యుత్ శాఖలతో సమన్వయం కలిగి ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు.



## సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు

### 83 తుపాను సహాయక కేంద్రాలు ఏర్పాటు

ఏలూరు, అక్టోబరు 27 ప్రభాతవార్త: మొంథా పెను తుపాన్ ఈనెల 28వ తేదీ రాత్రిలోగా మచిలీ పట్టణం- కళింగపట్నం మధ్య తీరం దాటవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఆ సమయంలో తీవ్రమైన వేగంతో గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, అధికారు లందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి, తుపాన్ పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్ దండే చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా యంత్రాంగం తీసుకున్న తుపాన్ ముందస్తు జాగ్రత్త చర్యలను పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడలతో కలిసి తెలియజేసారు. ఈ సందర్భంగా కాంతిలాల్ దండే మాట్లాడుతూ తుపాన్ కారణంగా జిల్లాలో ఎటువంటి నష్టం కలగకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకున్నదన్నారు. ముంపు ప్రాంతాలలోని ప్రజలను తరలించేందుకు 82 తుపాన్ సహాయక కేంద్రాలను గుర్తించామని, వాటిలో కలిదిండిలో సహాయక కేంద్రాన్ని ఏర్పాటుచేసి 42 కుటుంబాలను తరలించామన్నారు. తుపాన్ ముంపు గ్రామాలలో 100 మంది గజఈతగాళ్లను సిద్ధం చేశామని, 123 మంది గర్భిణీలను దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. 11 లంక గ్రామంలో ప్రజలకు నిత్యావసర సరుకులు, ఆహార ధాన్యాలు అందించాలని అధికారులను ఆదేశించా మన్నారు. ఉప్పుటేరు బ్యాక్ వాటర్ కారణంగా ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షి త ప్రాంతాలకు తరలించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నదన్నారు.

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ మొంథా పెను తుపాన్ ప్రభావంతో మంగళవారం జిల్లాలోని 13 మండలంలో పెనుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని 14 మండలాల్లో హై అలెర్ట్ ప్రకటించడం జరిగిందన్నారు. తుపాన్ సమయంలో గాలితీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో జిల్లాలోని 763 హోర్డింగ్స్‌ను తొలగించడం జరిగిందన్నారు. తుపాన్ సమయంలో ప్రజలెవ్వరూ నదులు, చెరువులు ఈతకు వెళ్లవద్దని, బయటకు రావద్దని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. తుపాన్ సమయంలో దెబ్బతిన్న విద్యుత్ పనుల పునరుద్ధరణకు గాను 2 వేల విద్యుత్ స్తంభాలు, 500 ట్రాన్స్‌ఫార్మర్లు, 1200 మంది విద్యుత్ సిబ్బందిని అత్యవసర సేవల నిమిత్తం సిద్ధం చేయడం జరిగిందన్నారు. తుపాన్ సహాయక చర్యలకు గాను జెసిబిలు, చెట్లు కట్ చేసే యంత్రాలతోపాటు ఎస్డీఆర్ఎఫ్ బృందంను సిద్ధం చేయడం జరిగిందన్నారు. తుపాన్ గాలి తీవ్రత, భారీ వర్షాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున తుపాన్ సమయంలో అత్యవసరం అయితే తప్ప ప్రజలెవ్వరూ బయటకు రావద్దని, యంత్రాంగం తో సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## తీరంలో హై అలర్ట్

### కాకినాడ, కోనసీమ జిల్లాల పరిధిలో తీరం దాటే అవకాశం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 27 ప్రభాతవార్త: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను ప్రభావంతో తీరం అల్లకల్లోలంగా మారింది. తీరం వెంబడి గ్రామాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే ఈదురు గాలులు వీస్తున్నాయి. మొంథా పెను తుపానుగా మారడంతో అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ఇరు జిల్లాలకు ప్రత్యేక సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించింది ప్రభుత్వం. ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లకుండా అప్రమత్తం అవ్వాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. అయితే కాకినాడలో తీరం దాటే అవకాశాలున్నాయని హెచ్చరికల నేపథ్యంలో అధికారులు కాకినాడ జిల్లా వ్యాప్తంగా అప్రమత్తం అయ్యారు. అయితే తుపాను దిశ మార్చుకుని అంబేద్కర్ కోనసీమ జిల్లా వైపుగా కదులుతుందన్న సమాచారంతో అధికారులు కోనసీమ ప్రాంతంలో అప్రమత్తం అయ్యారు.

వణికిపోతున్న తీర ప్రాంత ప్రజలు

మొంథా తుపాను ప్రభావంతో కాకినాడ, కోనసీమ జిల్లా ప్రజలు చివరుటాకుల్లా వణికిపోతున్నారు. తీరం వెంబడి ఇప్పటికే బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. మరోపక్క సముద్రం తీవ్ర అల్లకల్లోలంగా మారింది. ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు తీర గ్రామాల్లో కురుస్తున్నాయి.. దీంతో 1996 పెను తుపాను విధ్వంసాన్ని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే తుపాను ప్రభావంతో ప్రజలంతా కాయకూరలు, కిరాణా సరుకులు కొనుగోళ్లకోసం ఎగబడడంతో దుకాణాలు కిటకిటలాడాయి. ఇదే అదనుగా కొంత మంది కూరగాయాల దుకాణ దారులు అధిక ధరలు పెంచి విక్రయాలు జరపడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి, అక్టోబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి: బుడమేరు డైవర్షన్ ఛానెల్‌పై నిరంతర నిఘా ఉండాలని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావిత జిల్లాల్లో ఇరిగేషన్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, సిఈ స్థాయి నుండి కింది స్థాయిలోని లష్కర్ వరకు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. సోమవారం అమరావతి సచివాలయంలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికా రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కడా స్పెషల్ కమీషనర్ ప్రశాంతి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సి నరసింహ మూర్తి, మరియు సిఈలు, ఎస్ఈలు, ఈఈలు, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు అందరూ తమకు కేటా యించిన హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని, అధికారులు తమ సెలవులు రద్దుచేసు కుని, తప్పని సరిగా విధులకు హాజరుకావాలని ఆదేశించారు. చెరువులు, కాల్వ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేయాలి అని, ఇందుకోసం ఇసుక బస్తాలు, మోటార్లు, బోట్లు వంటి అత్యవసర సామాగ్రి సిద్ధంగా ఉంచుకోవడంతో పాటు, గేట్లు, స్యూయిజ్ లు, సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో, ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, అధికారులకు సూచించారు. తుఫాన్ కారణంగా వాగులు, రిజర్వాయర్ల నుండి దిగువకు నీరు విడుదల చేసేముందు, సమీప ప్రవాహ ప్రాంత ప్రజలకు ముందస్తు హెచ్చరికలు చేయాలి అని అన్నారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు, పంటలకు నష్టం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో వర్షపాతాన్ని దృష్టిలో పెట్టుకుని, బుడమేరు డైవర్షన్ ఛానెల్ పై నిరంతర నిఘా ఉండాలని, వెలగలేరు రెగ్యులేటర్ నుండి ఎనికేపాడు యూటీ వరకు విజయవాడ నగర పరిధిలో ఓల్డ్ బుడమేరు అంతా, ప్రవాహానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా, తొలగించాలి అని తెలిపారు. ఎర్ర కాలువ, యనమదురు డ్రైన్, బురద కాలువ, సుద్ద వాగు, ఏలేరు రిజర్వాయర్, రైవాడ కాలువ వంటి వాటిపై నిరంతర నిఘా పెట్టాలి అని, జిల్లా కలెక్టర్, రెవిన్యూ, డిజాస్టర్ మేనేజ్మెంట్, పోలీస్, విద్యుత్, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

## ప్రాణనష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలి


### జోనల్ ప్రత్యేక అధికారి ఆర్పీ సిసోడియా



గన్నవరం (కృష్ణా), అక్టోబరు 27 ప్రభాతవార్త: మెంతా తుఫాన్ కారణంగా జిల్లాలో ప్రాణనష్టం జరుగకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జోనల్ ప్రత్యేక అధికారి ఆర్పీ సిసోడియా ఆదేశించారు. సోమ వారం సాయత్రం జిల్లా కలెక్టర్ డికె. బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జెసి యం.నవీన్‌తో కలిసి తుపాన్ వర్షాలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఏవిధమైన విపత్తులు సంభవించినా వెంటనే స్పందించాలని ఆదేశించారు. తుపాన్ తాకిడిని ఎదుర్కొ నేందుకు అధికారులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని, పల్లపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. తుపాన్ పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి తుపాన్ బాదితులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పునరావాస శిబిరాల్లో తాగునీరు, ఆహారం, బిస్కెట్లు, బ్రెడ్‌లు, మందులు ఎక్కువ మొత్తంలో నిలువ చేయాలని సూచించారు. మూడురోజులపాటు భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరినీ అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లో దండోరా వేయించా లని, ప్రజలందరూ నిత్యావసర సరుకులు నిల్వచేసుకోవాలని, కొవ్వోత్తులు, టార్చ్‌లైట్లు సిద్దంగా ఉంచుకోవాలని సూచించారు. మూడురోజులపాటు అత్యవసరమైతే తప్ప ఇంటి నుండి బయటకు రావద్దని హితవు పలికారు. కాజ్‌వేలపై రాకపోకలు నిలిపివేయాలని, బీచ్‌లలో సందర్శకులను అనుమతించ వద్దన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా పట్టణ ప్రాంతాల్లో హోర్డింగ్‌లు తొలగించాలని ఆదేశించారు. భారీవర్షాల కారణంగా డ్రేనేజిలు పొంగిపొర్తే ప్రమాదం ఉన్నందున డ్రేనేజిల్లో అడ్డంకులు తొలగించేందుకు జెసిబిలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. సెల్‌ఫోన్ సిగ్నల్ సమస్యలను అధిరోహించేందుకు శాటిలైట్ ఫోన్‌లు అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో చంద్రశేఖరరావు, జిల్లా పరిషత్ సీఈఓ కన్నమనాయుడు, బందరు ఆర్డీఓ కె.స్వాతి, ఇరిగేషన్ ఎస్ఈ మోహన్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్ వివిధశాఖ అధికారులు పాల్గొన్నారు.


28-10pg10 12 VJA_28-10pg10.qxd 27/Oct/25 10:21 PM Page 1





## ఆసియా యూత్ గేమ్స్
# స్వర్ణం సహా ప్రీతికి డబుల్ మెడల్స్

**న్యూఢిల్లీ:** ఆసియా యూత్ గేమ్స్-2025, వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ప్రీతిస్మిత భోయ్ యూత్ వరల్డ్ రికార్డ్ సృష్టించింది. ఈ గేమ్స్‌లోని వివిధ విభాగాల్లో ప్రీతి స్వర్ణం, రజత పతకాలను సాధించింది. బహ్రెయిన్‌లోని మనామాలో సోమవారం జరిగిన ఆసియా యూత్ గేమ్స్‌లో ప్రీతిస్మిత భోయ్ 92 కిలోల బరువును ఎత్తి యూత్ వరల్డ్ రికార్డ్‌తో వెయిట్ లిఫ్టింగ్‌లో క్లీన్ జెర్క్ స్వర్ణం సాధించింది. ఆమె స్నాచ్ విభాగంలో 66 కిలోల ఎత్తి రజత పతకాన్ని కూడా గెలుచుకుంది, కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లలో ఆమె మునుపటి యూత్ నేషనల్ రికార్డును ఈ సారి 3 కిలోలు అధిగమించింది. గత సంవత్సరం యూత్ వరల్డ్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 76 కిలోల లిఫ్ట్‌తో ఆమె నెలకొల్పిన 40 కిలోల కేటగిరీ రికార్డు తర్వాత, 16 ఏళ్ల ఆమె సాధించిన రెండవ యూత్ ప్రపంచ రికార్డు ఇది. ఆమె తన మొదటి ప్రయత్నంలోనే స్నాచ్‌లో విజయవంతంగా 66 కిలోల బరువును ఎత్తడంతో రోజును ప్రారంభించింది. కానీ తదుపరి రెండు ప్రయత్నాలలో వరుసగా 68 కిలోలు మరియు 69 కిలోలు ఎత్తడంలో విఫలమైంది. దీని వలన ఆమె డబుల్ స్వర్ణం సాధించే అవకాశాన్ని కోల్పోయింది, ఎందుకంటే చైనాకు చెందిన జిహాంగ్ వు స్నాచ్‌లో ఆమెను అధిగమించి 68 కిలోల ఉత్తమ ప్రదర్శనతో బంగారు పతకాన్ని సాధించింది.



## కెనడా మహిళల ఓపెన్
# వరల్డ్ ర్యాంకర్‌ను ఓడించిన అనాహత్

**న్యూఢిల్లీ:** కెనడా మహిళల స్క్వాష్ ఓపెన్‌లో ప్రపంచ 20వ ర్యాంకర్‌ను అనాహత్ సింగ్ ఓడించింది. టొరంటోలో జరిగిన కెనడియన్ మహిళల ఓపెన్ స్క్వాష్‌లో భారత క్రీడాకారిణి అనాహత్ సింగ్ విజయంతో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ప్రపంచ ర్యాంక్‌లో 43వ స్థానంలో ఉన్న 17 ఏళ్ల అమ్మాయి అనహత్, ఫ్రాన్స్‌కు చెందిన ఆరో సీడ్ మెలిస్సా అల్వేస్‌ను 17 నిమిషాల్లో 3-1 (12-10, 12-10, 8-11, 11-2) తేడాతో ఓడించింది. ఆమె తదుపరి మంగళవారం బెల్జియంకు చెందిన ప్రపంచ 6వ ర్యాంకర్ మరియు రెండవ సీడ్ టిన్నె గిలిస్‌తో తలపడనుంది. కాగా ఈ నెల ప్రారంభంలో, ఐదు ఆటల థ్రిల్లర్‌లో ఈజిప్టుకు చెందిన జానా స్వైఫీ చేతిలో ఓడిపోయిన తర్వాత అనాహత్ బోస్టన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్ నుంచి నిష్క్రమించింది. అయితే ఆగస్టులో అనాహత్ ఏడు స్థానాలు ఎగబాకి కెరీర్‌లో అత్యుత్తమ ప్రపంచ ర్యాంకింగ్ 46కి చేరుకున్నప్పుడు మొదటిసారి టాప్ 50లోకి ప్రవేశించింది.

## మహిళల వన్డే వరల్డ్ కప్..
# సెమీస్‌కు వర్షం ఎఫెక్ట్
### ఇండియా, ఆస్ట్రేలియా ఫైనల్?

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్స్ నాలుగు జట్ల మధ్య జరగనుంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, భారత జట్టు సెమీఫైనల్స్‌లో తలపడేందుకు సిద్ధమయ్యాయి. ఆస్ట్రేలియా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. టీమిండియా నాల్గవ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అందువల్ల, భారత్, ఆస్ట్రేలియా సెమీఫైనల్స్‌లో తలపడతాయి. వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. అందువల్ల, సెమీఫైనల్‌లో వర్షం పడితే విజేతను ఎలా నిర్ణయిస్తారనే ప్రశ్న తలెత్తుతుంది. గ్రూప్ దశలో వర్షం పడి మ్యాచ్ రద్దు అయితే, రెండు జట్లకు చెరో పాయింట్ ఇవ్వనున్నారు. కానీ, ఈ నియమం సెమీఫైనల్‌కు వర్తించదు. కాబట్టి, సెమీఫైనల్‌లో వర్షం పడి మ్యాచ్ రద్దు చేస్తే, ఫలితం ఎలా నిర్ణయించనున్నారో అనేది చర్చ జరుగుతోంది. సెమీఫైనల్స్‌లో వర్షం పడితే









ఈ రెంటి మధ్య సెమీఫైనల్స్ మ్యాచ్ ఈ నెల 30న జరుగుతుంది. అలాగే ఇంగ్లాండ్ రెండవ సెమీఫైనల్లో ఈ నెల 29న దక్షిణాఫ్రికాతో తలపడుతుంది. సెమీఫైనల్ చిత్రం స్పష్టంగా ఉన్నప్పటికీ, వర్షం భయం ఉంది. శ్రీలంకలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో ఇప్పటికే 5 మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. ఇప్పుడు మొంథా తుపాన్ ప్రభావంతో మ్యాచ్‌ను కొనసాగించడానికి రిజర్వ్ డేను నిర్ణయించారు. షెడ్యూల్ చేసిన రోజున మ్యాచ్ జరగకపోతే, మరుసటి రోజు మ్యాచ్ జరుగుతుంది. అంటే, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ మధ్య జరిగే మ్యాచ్‌లో వర్షం పడితే, ఆ మ్యాచ్‌ను మరుసటి రోజు నిర్వహిస్తారు. మరోవైపు, భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగే మ్యాచ్‌లో కూడా అదే పరిస్థితి తలెత్తితే, ఈ నెల 31ని రిజర్వ్ డేగా పక్కన పెట్టారు. రిజర్వ్ డేన కూడా వర్షం కారణంగా మ్యాచ్ జరగకపోతే, పాయింట్ల పట్టిక ఆధారంగా ఫలితం నిర్ణయించబడుతుంది. అంటే, వర్షం కారణంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్ జరగకపోతే, ఆస్ట్రేలియాకు చివరి రౌండ్‌కు టికెట్ లభిస్తుంది. దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ మ్యాచ్‌కు కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. పాయింట్ల పట్టికలో రెండవ స్థానంలో ఉన్న జట్టుకు ముందుకు సాగే అవకాశం లభిస్తుంది. ఇక ఫైనల్స్‌కు రిజర్వ్ డేను రిజర్వ్ చేశారు. షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 2న ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. వర్షం కారణంగా ఆ రోజు మ్యాచ్ జరగకపోతే, నవంబర్ 3న జరుగుతుంది. అయితే, ఈ రోజు కూడా మ్యాచ్ జరగకపోతే, ఫైనల్‌కు అర్హత సాధించిన రెండు జట్లను విజేతలుగా ప్రకటిస్తారు.

## ఆసియా రగ్బీ ట్రోఫీలో..
# రన్నరప్‌గా భారత్



**న్యూఢిల్లీ:** ఆసియా రగ్బీ ఎమిరేట్స్ ట్రోఫీ-2025లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. కోచ్ బెన్ గొల్లింగ్స్ నేతృత్వంలోని భారత్ జట్టు ఆసియా టాప్‌టైర్ సెవెన్స్ సిరీస్‌కు అర్హత సాధించింది. మస్కట్‌లో జరిగిన ఆసియా రగ్బీ ఎమిరేట్స్ సెవెన్స్ ట్రోఫీలో భారత సీనియర్ పురుషుల రగ్బీ సెవెన్స్ జట్టు రన్నరప్‌గా ప్రచారాన్ని ముగించింది. అగ్రశ్రేణి రగ్బీ సెవెన్స్ పోటీ అయిన ఆసియా రగ్బీ ఎమిరేట్స్ సెవెన్స్ సిరీస్ కి ప్రమోషన్‌ను సంపాదించింది. మాజీ ఇంగ్లాండ్ అంతర్జాతీయ ఆటగాడు, ప్రధాన కోచ్ బెన్ గొల్లింగ్స్ నేతృత్వంలో, భారత జట్టు టోర్నమెంట్ అంతటా క్రమశిక్షణ, నైపుణ్యం మరియు స్థితిస్థాపకతను ప్రదర్శించింది. లెబనాన్‌పై 14-10 తేడాతో ఉత్కంఠభరితమైన విజయంతో భారత్ తన ప్రచారాన్ని ప్రారంభించింది, ఆ తర్వాత ఆఫ్ఘనిస్తాన్‌పై 26-5 తేడాతో విజయం సాధించి గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. నాకౌట్ దశల వరకు ఈ జోరు కొనసాగింది. క్వార్టర్ ఫైనల్స్‌లో భారత్ ఇరాన్‌ను 21-7 తేడాతో ఓడించి, సౌదీ అరేబియాపై 17-0 సెమీఫైనల్ విజయాన్ని నమోదు చేసి ఫైనల్‌కు చేరుకుంది. టైటిల్ పోరులో, భారత్ రగ్బీ జట్టు తీవ్రంగా పోరాడినా కాని కజకిస్తాన్ చేతిలో 0-27 తేడాతో ఓడిపోయి రన్నరప్‌గా మిగిలింది.

# రంజీలో చరిత్రాత్మక విజయం

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ చరిత్రలో అరుదైన సంఘటన నమోదైంది. కేవలం 90 ఓవర్లలోనే మ్యాచ్ ముగిసింది. 91 ఏళ్ల రంజీ ట్రోఫీ హిస్టరీలో ఇంత తొందరగా (ఓవర్ల పరంగా) ముగిసిన మ్యాచ్ ఇదే కావడం విశేషం. పూర్తిగా బౌలర్లు ఆధిపత్యం కనబర్చిన ఈ మ్యాచ్‌లో 4 ఇన్నింగ్స్‌ల్లో కలిపి 32 వికెట్లు నేలకూలాయి. ఓవరాల్‌గా 359 రన్స్ నమోదు అయ్యాయి. 2025-26 రంజీలో భాగంగా రెండో రౌండ్ మ్యాచ్‌లో ఎలైట్ గ్రూప్ సి నుంచి సర్వీసెస్-అసోం జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో మొదట బ్యాటింగ్ చేసిన అసోం 17.2 ఓవర్లలో 103 రన్స్‌కు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన సర్వీసెస్ 29.2 ఓవర్లకు 108 రన్స్‌కు కుప్పకూలింది. దీంతో తొలి రోజు ముగియక ముందే మొదటి ఇన్నింగ్స్‌ల్లో రెండు జట్లు ఆలౌట్ అయ్యా యి. చివరి సెషన్‌లోఅసోం రెండోఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారం భించింది. ఇందులో కూడా తొలిరోజే అసోం5వికెట్లు కోల్పోయింది. 565 స్కోర్‌తో తొలి రోజు ఆట ముగిసింది. ఇక రెండో రోజు మొదటి సెషన్ లోనే అసోం ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 565కు అసోం కేవలం 19 రన్స్ జోడించి మిగిలిన 5 వికెట్లు కోల్పోయి 29.3 ఓవర్లలో 75 పరుగులకు కుప్పకూలింది. ఇక71పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన సర్వీసెస్ జట్టు 13.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఇలా ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు కలిపి మొత్తం 540 బంతులు మాత్రమే ఆడాయి. దీంతో ఓవరాల్‌గా రంజీ చరిత్రలోనే అతి తక్కువ ఓవర్లలో ముగిసిన మ్యాచ్‌గా రికార్డు కొట్టింది.



# దలాల్‌స్ట్రీట్‌లో ఈక్విటీ సూచీల ర్యాలీ



**ముంబయి, అక్టోబరు 27:** దేశీయ స్టాక్ సూచీలో వారం ప్రారంభంలో లాభాలతో పరుగులు తీసాయి. త్రైమాసిక ఫలితాలు,అ ంతర్జాతీయ ధోరణులు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఇంధనం, ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్‌స్టాక్స్ భారీగా ర్యాలీ తీసాయి. అమెరికా చైనా వాణిజ్య చర్చలు కొలిక్కివస్తున్నాయన్న వార్తలకు తోడు అమెరికా ద్రవ్యోల్బణం కొంతమేర దిగిరావడం కూడా ఫెడ్‌రిజర్వు రేట్ కట్‌లకు మార్గం ఏర్పరిచిందని ఇన్వెస్టర్ల అంచనా. బిఎస్‌ఇ సెన్సెక్స్ 566.96 పాయింట్లు పెరిగి 84,788.84 పాయింట్లవద్దముగిసింది. నిఫ్టీ సూచీ కూడా 170.90 పాయింట్లు పెరిగి 25,966.05 పాయింట్లవద్దముగిసింది. ఇక కంపెనీలపరంగాచూస్తే భారతి ఎయిర్‌టెల్ 2.56శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.24శాతం, హెచ్‌డిఎఫ్‌సి 0.82శాతం పెరిగాయి. ఇక బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.72శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.51శాతం పెరిగాయి. మొత్తం 2178 కంపెనీలషేర్లుపెరిగితే 2114 షేర్లు క్షీణించాయి. మరో 218 కంపెనీలషేర్లు స్థిరంగా కొనసాగాయి. భారత విదేశీకరెన్సీ రిజర్వులు 4.496 బిలియన్‌డాలర్లుపెరిగి రికార్డుస్థాయి అంటే 702.28 బిలియన్ డాలర్లకు చేరడం మార్కెట్లకు కలిసొచ్చింది. బంగారం నిల్వలు కూడా 6.181 బిలియన్‌డాలర్లు పెరిగి 108.546 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 87.83వద్ద స్థిరపడింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్స్ 1.44శాతం క్షీణించి 1,21,676వద్ద కొనసాగాయి. బ్రెంట్ ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 44సెంట్లు పెరిగి 65.50డాలర్లుగా కొనసాగాయి. డౌజోన్స్ ఫ్యూచర్స్ ప్రస్తుతం 259 పాయింట్లుపెరిగింది. యూరోపియన్ సూచీలు అన్నీ కూడా ఫెడ్‌రిజర్వ్ నిర్ణయాలకు అనుగుణంగా కదిలాయి. జపాన్‌నిక్కీ రెండుశాతంపెరిగి 50వేల మార్కును చేరింది. నిఫ్టీలో పిఎస్‌యు సూచీ 2.22శాతం పెరిగింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా 5.05, కెనరా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా 3.38శాతం, సెంట్రల్ బ్యాంకు 2.88శాతం, పీఎన్‌బి 2.78 శాతం, యుకోబ్యాంకు 2.65శాతం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.63శ్శాతం, ఎస్‌బిఐ 2.48శాతం, ఐఒబి 2.15శాతం, పంజాబ్‌సింధ్ బ్యాంకు 1.66శాతం, ఇండియన్ బ్యాంకు 1.63 శాతం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 0.53శాతం చొప్పున పెరిగాయి. కోటక్ బ్యాంకు 1.74శాతం క్షీణించింది.

# డెట్ సెక్యూరిటీల్లో రిటైల్ ఇన్వెస్టర్లకు ప్రాధాన్యం
### ఎక్కువ డిస్కౌంట్లు, ఎక్కువ కూపన్‌రేట్ల ఆఫర్

**న్యూఢిల్లీ, అక్టోబరు 27:**స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ డెట్ సెక్యూరిటీల మార్కెట్‌లో రిటైల్ ఇన్వెస్టర్లను ప్రోత్సహవించాలని నిర్ణయించింది. డెట్‌సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూల్లో వీరికి ప్రాధాన్యత ఇచ్చేందుకుగాను ఒక సంప్రదింపుల పత్రం విడుదలచేసింద.ి సెబీ ఇందుకోసం కొన్ని ప్రోత్సాహకాలు కూడా సిఫారసుచేసింది. వీరికి ఎక్కువ కూపన్‌రేటు లేదా ఎక్కువ డిస్కౌంట్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఇష్యూధరకంటే మరికొంత ప్రోత్సాహకం ఉంటే వారి భాగస్వామ్యం పెరుగుతుందని అంచనా. సీనియర్ సిటిజన్లు, మహిళలు, సాయుధదళాల సిబ్బంది వంటి కేటగిరీలకు ఎక్కువప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. ఇటీవలి ఇష్యూ అయిన ఎన్సీడీలలో 81.49 బిలియన్ రూపాయలకు తగ్గడాన్ని సెబీ సీరియస్‌గా తీసుకుంది. అదే గత ఏడాది అయితే 191.68 బిలియన్ రూపాయలు పబ్లిక్ ఇష్యూలో వచ్చాయి. ఈ తగ్గుదలను భర్తీ చేసేందుకు రిటైల్ ఇన్వెస్టర్లకు ప్రాధాన్యం పెంచాలని నిర్ణయించింది. అయితే సెబీ జారీ చేసిన ఈ సంప్రదింపుల పత్రంపై సంబంధిత వర్గాల నుంచి అభిప్రాయాలను కోరింది. వచ్చే నెల 17వ తేదీలోపు తమకు తెలియజేయాలని సూచించింది.



# అదానీ ఎనర్జీ నికరలాభం రూ.557 కోట్లు



**ముంబయి, అక్టోబరు 27:** ఆదాని ఎనర్జీ సొల్యూషన్స్ రెండోత్రైమాసికంలో 21శాతం నికరలాభాలను పెంచుకోగలి గింది. 557 కోట్లు ఆర్జించినట్లు ఎక్ఛేంజిలకు నివేదికి చ్చింది. ఏడాదిక్రితం ఇదే కాలంలో 314 కోట్లు ఆర్జించిన కంపెనీ ఈ త్రమాసికంలో 557కోట్లు రా బట్టింది. ఇక రాబడులు మొత్తం 6767 కోట్లుగా ఉన్నాయి. మొదటి ఆరునెలల కాలంలోనే 13,793కోట్లు ఆర్జించామని కంపెనీ ప్రకటిం చింది. ఇబిటిడా అయితే 2126 కోట్లుగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే 12శాతం పెరిగింది. స్మార్ట్ మీటరింగ్ బిజినెస్‌లో పంపిణీ విభాగం రాబడులు పెరిగాయి. అర్థసంవత్సర కాలంలో ఎబి టిడా 13శాతం పెరిగి రూ.4144కోట్లుగా ఉంది. మొదటి ఆరునెలల కాలంలోనే 1404 కోట్లుగా ఉంది. రెండో త్రైమాసికంలో 25శాతం పెరిగింది. మార్కెట్ సమయం ముగిసిన తర్వాత కంపెనీ తన ఫలితాలు ప్రకటించింది. కంపెనీ షేర్లు 0.16శాతం పెరిగి బిఎస్ఇలో రూ.946 వద్ద ట్రేడ్ అయ్యాయి.

## వాణిజ్యం



# ఇండియన్ ఆయిల్ నికరలాభం 7817.55 కోట్లు

**ముంబయి, అక్టోబరు 27:** ప్రభుత్వరంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రెండోత్రైమాసికంలో 7817.55 కోట్ల నికరలాభం ప్రకటించింది. అదే గత ఏడాది ఇదే కాలంలో 169.58 కోట్ల నికరనష్టం చవిచూసిన సంస్థ ఈ ఏడాది లాభాల్లో దూసుకుపోయింది. అంతర్జాతీయంగా ముడిచమురుదరలు తగ్గడంతో ప్రతి బ్యారెల్‌ముడిచమురుపైనా 19.6 డాలర్లు రాబడి సాధించింది. ఏప్రిల్ సెప్టెంబరుకాలంలో స్థూల రిఫైనింగ్ మార్జిన్ బ్యారెల్‌కు 6.32 డాలర్లుగా ఉంది. అంతకుముందు 4.08 డాలర్లు మాత్రమే ఉండేది. కార్యకలాపాలద్వారా రాబడులు 2.06 లక్షల కోట్లు సాధించింది. వార్షికపద్ధతిలోచూస్తే 3.9శాతం నమోదుచేసింది. మొత్తం వ్యయాలు 1.96 లక్షలకోట్లుగా చూపింది. అంతకుముందు ఏడాది రెండోత్రైమాసికంలో 2.01 లక్షలకోట్లుగా ఉంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో కూడా 2.14 లక్షలకోట్లు వ్యయాలుచూపించింది. కంపెనీ ఇప్పటివరకూ 17.609 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడిచమురును శుద్ధిచేసింది. స్థూలంగా చెప్పాలంటే రాబడులు 2.06 లక్షల కోట్లుకాగా నికరలాభం 7817.55 కోట్లు, ప్రతి వాటాకు రాబడి 5.68 రూపాయలుగా ఉంది.

# టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.148.16 కోట్లు లాభం

**ముంబయి, అక్టోబరు 27:** టాటాస్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ రెండోత్రైమాసికంలో నికరలాభం 19.8శాతం పెంచుకోగలిగింది. 148.16 కోట్ల నికరలాభం అర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో 123.69 కోట్లు ఆర్జించిన టాటా ఇన్వెస్ట్‌మెంట్‌కార్పొరేషన్ ఈసారి లాభాలు పెంచుకోగలిగింది. కార్యకలాపాల ద్వారా వచ్చిన రాబడులు 153.98 కోట్లుగా ఉన్నాయి. అంతకు ముందు ఏడాది ఇదేకాలంలో 142.48 కోట్లు రాబడులు నమోదు చేసింది. టాటా గ్రూప్ లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థగా కొనసాగుతున్న మధ్యస్థాయి హోదాతో నడుస్తోంది. రెండో త్రైమాసికంలో డివిడెండ్ల ద్వారా కేవలం 116.44 కోట్లు ఆర్జించింది. కంపెనీ అంతకు ముందు ఏడాది 102.14 కోట్లు రాబట్టినసంగతి తెలిసిందే. ఇక కంపెనీ వ్యయాలు 11.40 కోట్లు పెరిగాయి. అంతకుముందు ఏడాది 9.43కోట్లు మాత్రమే ఉన్నాయి. సోమవారం కంపెనీ స్టాక్ 837.20 వద్దముగిసింది. ముందురోజు కంటే 0.03శాతం క్షీణించినట్లు కనిపించింది.





# డిహెచ్‌ఎఫ్‌ఎల్ ఎండి బెయిల్ పిటిషన్‌పై సిబిఐకి నోటీసులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 27:** డిహెచ్‌ఎఫ్‌ఎల్ ఎండి కపిల్‌వాద్వాన్ దాఖలుచేసుకున్న బెయిల్‌పిటిషన్‌పై అభ్యంతరాలుంటే వెంటనే వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐని ఆదేశించింది. కంపెనీ వేలాదికోట్ల అవినీతి కుంభకోణానికి పాల్పడిన కేసులో వాద్వాన్‌ను అరెస్టుచేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ జెకె మహేశ్వరి, విజయక్ష బిష్ణోయ్‌లతో కూడిన బెంచ్ ఇందుకు సంబంధించి తన వివరణ ఇవ్వాలని సిబిఐకి నోటీసులు జారీ చేసింది. అలాగే ఢిల్లీ హైకోర్టు తన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడాన్ని కూడా వాద్వాన్ సుప్రీంలో సవాల్‌చేసారు. సిబిఐనుంచి వివరణ అందిన తర్వాత సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయం ప్రకటిస్తామని చెప్పింది. కపిల్‌వాద్వాన్ ఆయన సోదరుడు ధీరజ్ వాద్వాన్‌లు భారీ ఎత్తున ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని, 34,900 కోట్లరూపాయలు 17 బ్యాంకులనుంచి తీసుకున్న రుణమొత్తాన్ని దారిమళ్లించారని సిబిఐ ఆరోపించింది. మొత్తం 87 డొల్ల కంపెనీలను సృష్టించి తమ అసోసియేట్లు, ఉద్యోగులపేరిట ఏర్పాటుచేసి నిధులను మళ్లించినట్లు సిబిఐ గుర్తించింది. మనుగడలోలేని బాంద్రా బ్రాంచ్ 001 పేరిట గృహరుణాలు ఇచ్చినట్లుగా చూపించింది. సిబిఐ వాద్వాన్‌ను 2022 జులైలోనే అరెస్టుచేసింది. అదే ఏడాది ఆయనకు దిగువకోర్టు బెయిల్ మంజూరుచేసింది. అయితే సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులను 2024 జనవరిలో పక్కనపెట్టింది. కేసులో తీవ్రస్థాయి ఆర్తికనేరాలున్నందున బెయిల్ రద్దుచేసినట్లు వెల్లడించింది. అలాగే ఢిల్లీ హైకోర్టుకూడా ఈ ఏడాది ఆగస్టులో బెయిల్ తిరస్కరించింది. ఆరోపణలు తీవ్రస్థాయిలో ఉన్నందున వీలుకాదని చెప్పింది. ఈ అవినీతి ఆర్థిక వ్యవస్థకు విఘాతం కలిగించేదిగా ఉందని అందువల్ల కస్టడీలోనే ఉంచాలని కోర్టు ఆదేశించింది. అయితేరుణాలరూపంలో సేకరించిన ఈ నిధులను వివిధ సంస్థలకు మళ్లించారని, ఇవన్నీ కూడా వాద్వాన్ కుటుం బం, వారి అనుబంధ సంస్థల్లోకి వెళ్లాయని, వాటికి రుణాలు మంజూరు చేసినట్లుగా రికార్డుల్లో చూపించారన్నారు.



# ప్రభుత్వరంగ బ్యాంకుల్లోకి 49% విదేశీ పెట్టుబడులు
### ఆర్బీఐ అభిప్రాయం కోరిన ఆర్థికశాఖ

**న్యూఢిల్లీ, అక్టోబరు 27:** ప్రభుత్వరంగ బ్యాంకుల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 49శాతంగా ఉండేవిధంగా ఆర్థికశాఖ సూచిస్తోంది. ఇందుకు ఆర్బీఐ అభిప్రాయాన్ని కూడా కోరింది. ప్రస్తుతం విదేశీ పెట్టుబడులను 20శాతానికి మాత్రమే పరిమితంచేసారు. ప్రైవేటు బ్యాంకులు మాత్రం 74శాతం వరకూ విదేశీ యాజమాన్య హక్కులు పొందేవిధంగా ఫ్‌డిఐకి అనుమతులిచ్చినట్లు తెలిపింది. భారత్‌లోప్రస్తుతం 12 ప్రభుత్వరంగ బ్యాంకులున్నాయి.వాటి మొత్తం ఆస్తుల విలువ 1.95 లక్షలకోట్ల డాలర్లుగా ఉంది. దేశ బ్యాంకింగ్ రంగంలో వీటి వాటా 55శాతంగా ఉంది. ప్రభుత్వం కనీసం 51శాతం వాటాలను ఈ బ్యాంకుల్లో సర్కారువాటాగా ఉంచి మిగిలిన మొత్తానికి విదేశీ పెట్టుబడులను ఆమోదించాలని చూస్తోంది. బ్యాంకింగ్ రంగ మనుగడకోసమే ఈ చర్యలు అవసరమని ఆర్థికశాఖ చెపుతోంది. దుబాయి కేంద్రంగా ఉన్న ఎమిరేట్స్‌కు చెందిన ఎన్బీడీ ఆర్బీఎల్ బ్యాంకులో 60శాతం వాటా కొనుగోలుకు ముందుకువచ్చింది. ఈ డీల్ విలువ 300 కోట్ల డాలర్లు. ప్రిఫరెన్షియల్ ఇష్యూగా 51శాతం వాటాకు ముందుకువచ్చింది. అలాగే జపాన్‌కు చెందిన సుమితోమో మిట్సుయి బ్యాంకింగ్‌కార్పొరేషన్ 20శాతం వాటాను ఎస్‌బ్యాంకులో కొనుగోలుచేసింది. సింగపూర్ డిబిఎస్, కెనడా ఫెయిర్‌ఫ్యాక్స్ సంస్థలుకూడా బ్యాంకుల్లో వాటాలు కొంటున్నాయి. అయితే ఇవి కేవలం ప్రైవేటు బ్యాంకులకే పరిమితం అయ్యాయి. ఈ డీల్స్ ప్రభుత్వరంగ బ్యాంకుల్లో దీర్ఘకాలిక డీల్‌గా ఉండాలని సంస్థాగత ఇన్వెస్టర్లనుంచి అయితే మరింతగా మేలుజరుగుతుందని ఆర్థికశాఖ అధికారులు చెపుతున్నారు. ఇపుడు ప్రభుత్వరంగ బ్యాంకుల్లో కూడా ఎఫ్‌డిఐల పరిమితిని పెంచేందుకు నిర్ణయించడంవల్ల ఆర్థికంగా బ్యాంకులు మరింతగా నిలదొక్కుకోగలవని అంచనా.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14